UNIVERSAL LIBRARY
OU_204261
UNIVERSAL LIBRARY

OUP—391 · 29-4-72—10,000.

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T[illegible]4/S49A Accession No. 9703

Author శేషగిరిరావు.

Title ఆంధ్రసారస్వతవ్యాసావళి

This book should be returned on or before the date last marked below.

శ్రీరస్తు

# ఆంధ్రసారస్వతవ్యాసావళి

ANDRA SESHAGIRI RAO,
AUTHOR & JOURNALIST,
MUKKAMALA
(VIA) TANUKU-W. G. DT.

'ఆంధ్రభూమి' సంపాదకుఁడు

ఆంద్ర శేషగిరిరావు, బి.ఏ.

వ్రాసినది.

సర్వస్వామ్యములు గ్రంథకర్తవి

మొదటి కూర్పు:
సెప్టెంబరు : 1952

శ్రీ ఆంధ్ర శేషగిరిరావు, బి. ఏ.
రచియించిన గ్రంథములు

| | | | |
|---|---|---|---|
| | | | రు. అ. పై. |
| 1. | ఆంధ్రరమణీమణులు 1-వ భాగము | | 0-12-0 |
| 2. | ఆంధ్రరమణీమణులు 2-వ భాగము | | 0-12-0 |
| 3. | కేయూరబాహు చరిత్ర | ... | 0-12-0 |
| 4. | ఆంధ్రరాజభక్తులు ... | ... | 0-12-0 |
| 5. | ఆకుకూరలు ... | ... | 1- 0-0 |
| 6. | కాయకూరలు ... | ... | 1- 0-0 |
| 7. | దుంపకూరలు ... | ... | 1- 0-0 |
| 8. | వాణిజ్యపూజ్యులు 1-వ భాగము | | 1- 0-0 |
| 9. | ఆంధ్రవిదుషీమణులు 1-వ భాగము | | 1- 8-0 |
| 10. | ఫలజాతులు (మొదటిభాగము)... | | 2- 0-0 |
| 11. | ఫలజాతులు (రెండవ భాగము)... | | 2- 8-0 |
| 12. | ఆంధ్రసారస్వతవ్యాసావళి | ... | 2- 0-0 |

విక్రయము :
ఆంధ్రభూమి బుక్కుడిపో
మదరాసు: 7.

## మహావాక్యము

జననుతులౌ కవీశ్వరుల సత్కృతిసారసుధారసంపు వ
ర్ణన కాని సద్దమెట్లటుల గ్రంథచమత్కృతి చెప్పవెల్ల చ
క్కని పదియాఱువన్నెకనకంబున వాసన - కమ్మకస్తురి
న్గనదురుకాంతియున్ - జెలుకునన్ ఫల మబ్బెడు భాగ్యమౌకదా!

—చాటుధార

# విషయసూచిక


౧. ప్రాచీనాంధ్ర వాఙ్మయావలోకనము ... 5

౨. తెనుఁగుకైతల క్రొత్తతెన్నులు ... 21

౩. ఆంధ్రసారస్వతము - హాస్యరసము ... 54

౪. కవితిక్కన వంశకథ ... 75

౫. తిక్కన నవ్వులు ... 93

౬. వరూథిని మాయలు ...126

౭. ప్రవరుని సంసారసుఖము ...138

౮. ప్రవరుఁడు - పెద్దన్న ...150

౯. పారిజాతాపహరణప్రబంధపరామర్శ ...160

౧౦. పారిజాతాపహరణము : పాత్రపోషణము ...177

మనవిమాటలు ...191


* *
*

౧

# ప్రాచీనాంధ్ర వాఙ్మయావలోకనము

'మ. మహి మున్ వాగనుశాసనుండు సృజియింపన్ గుండలీంద్రుండు త
న్మహనీయస్థితి మూలమై నిలుప శ్రీనాథుండు ప్రోవన్ మహా
మహులై సోముఁడు భాస్కరుండు వెలయింపన్ సొంపువాటించు నీ
బహుళాంధ్రోక్తిమయప్రపంచమునఁ దత్ప్రాగల్భ్య మూహించెదన్.'

—రామరాజభూషణకవి

'దేశభాషలందుఁ దెలుఁగు లెస్స' యని రాయల వచనము. తీరుతీయములు కలిగి తెనుంగుబాస వీనులకు విందొనర్చును. దీని మార్దవము నాకళించి, మాధుర్యమును జూఱకొని దీనికి పాశ్చాత్త్యపండితప్రకాండులు 'తూర్పుఖండపు ఇటాలియన్ భాష' (Italian of the East) అని నామకరణ మొనర్చిరి.

ఆంధ్రభాష యనఁగా నాంధ్రునిచే మాటలాడఁబడు భాషయని కాని, లేక యాంధ్రదేశోద్భవమగు భాష యని కాని చెప్పవచ్చును. త్రిలింగదేశమునఁ బుట్టినదగుట, అచట వ్యవహరింపఁబడున దగుట ఆంధ్రభాష తెలుఁగు, తెనుఁగు అనియు వ్యవహరింపఁబడును.

ఆంధ్రభాషలో నన్నయభట్టారకునకుఁ బూర్వ మనేక గ్రంథము లుండియుండును. మన దురదృష్టమువలన తదుపలబ్ధి లేకపోయినది.

క్రీస్తుశకము పదునొకండవ శతాబ్ది ఆరంభమునుండియు వాఙ్మయ మభివృద్ధినొంది నిలచియున్నది.

ఆంధ్రసారస్వతాభివృద్ధి కాలమును నాలుగు యుగములుగా విభజింపవచ్చును:

1. భాషాంతరీకరణయుగము (11–15 శతాబ్దులు)
2. ప్రబంధయుగము (16, 17 శతాబ్దులు)
3 మధ్యమయుగము (18, 19 శతాబ్దులు)
4. ఆధునికయుగము (20–వ శతాబ్ది)

ఇందు మొదటి మూడుయుగములలోని ఆంధ్రవాఙ్మయాభివృద్ధిక్రమమును ఇచట పరామర్శించుకొందము.

ఆంధ్రసారస్వతయుగములలో తొలుతటిదైన భాషాంతరీకరణయుగమునఁ గావ్యములను కేవల మర్థగౌరవముతో రచించిరి. ప్రబంధయుగములో శబ్దార్థముల రెంటికిని సమానముగ ప్రాముఖ్యము నిచ్చిరి. మధ్యమయుగములో శబ్దగౌరవమునే విశేషముగఁ బాటించిరి. కావున నీకాలమున సారస్వతము క్షీణదశ నందినది.

ఆంధ్రసారస్వతచరిత్రమున ప్రథమయుగమగు భాషాంతరీకరణ యుగపు వాఙ్మయాభివృద్ధిని ప్రత్యేకించి రెండుపాదములుగ విభజించుకొని విమర్శించుకొందము.

# 1

## భాషాంతరీకరణ యుగము

### ౧–వ పాదము
### 11, 12, 13 శతాబ్దులు

### కవులు

నన్నయభట్టు ప్రథమాంధ్రమహాకవి. రాజరాజనరేంద్రుని ప్రోత్సాహముచే నాతఁడు ఆంధ్రకవితాప్రపంచ

మును సృష్టించినాఁడు. 'భారత వేదవాక్యరసభావము లెఱుంగ లేక నిస్సారమునస్యులై' 'కాసటబీసలే చదివి గాథలఁ ద్రవ్వ తెనుంగువారి'కినై భారతము పరివర్తింప దొరకొని అరణ్యపర్వము నాలవయాశ్వాసము సగమువఱకు రచించి కీర్తిశేషుఁ డయ్యెను. అతని రచన మృదుమధురమై, శబ్దాలంకారశోభితమై, సంస్కృతపదభూయిష్ఠమై యుండును. మధ్యాక్కఱలు మొదలగు పద్యముల రచన నన్నయ ప్రాచీనతను వెల్లడిసేయును. నన్నయ భాషాంతరీకరణము స్వతంత్రబహుళమైనది.

తర్వాత తిక్కన విరాటపర్వము మొదలుకొని భారత భాగమును 'ఆంధ్రావళి మోదముంబొరయ' రచించెను. నుడికారము గల తెలుఁగుఁబలుకుబళ్ళఁ గూర్చుటయం దీతఁ డద్వితీయుఁడు. తిక్కయజ్వ విరాటోద్యోగపర్వములందుఁ జూపిన 'మహత్త్వకవిత్వపటుత్వ' సంపద లదృశములు.

పదంపడి ఈ యిద్దరకుఁ దుల్యుఁ డగువాఁడు ఎఱ్ఱాప్రెగ్గడ. అరణ్యపర్వశేషపూరణ మీతని ప్రధానకృతి. శం దీతఁడు నన్నయనే యనుకరించెను. ప్రబంధశైలికి ఇతఁడే మార్గదర్శి. ప్రబంధపరమేశ్వరుఁడని ఇతనికి బిరుదము. ఈతని ప్రబంధశైలి ననుసరించి శ్రీనాథాదులు గ్రంథములను మనోహరముగా వ్రాసిరి.

నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రెగ్గడలను కవిత్రయమందురు. వీ రాంధ్రభాషకుఁ బ్రామాణికకవులు. వీరి కవిత్వము పదాఱువన్నె బంగారమువలె నిర్దుష్టమైనది.

తిక్కన భారతమును ముగింపఁగానే తర్వాతి కథయగు హరివంశమందలి యుత్తరభాగమును 'నవీనకవితానాథుఁ

డ'గు నాచన సోమనాథుఁడు రచించెను. ఈతఁడు కల్పనా కౌశలమున, ప్రతిభావిశేషమున, బుద్ధివైశద్యమున ఆంధ్ర కవులలో నిరుపమానుఁడని కొందఱి మతము.

మారన మార్కండేయ పురాణము, కేతన దశకుమార చరిత్ర ఈ సందర్భమునఁ బేర్కొనఁదగినవి.

ఈ పాదమున రంగనాథ, భాస్కరాదులు రామాయణమును తెనిఁగించిరి.

### కవిత్వలక్షణములు

ఆంధ్రభాష భట్టారకునితో నవతరించి తిక్కన కాలముననే జాతీయత నలవఱచుకొని మహోన్నతదశకు వచ్చినది. భారతకవుల గ్రంథములు భాషాంతరీకరణములయ్యును స్వతంత్రములుగా నుండును.

ఈకాలమునఁ గవు లాంధ్రపదముల నధికముగా వాడుచు వలయుపట్ల సంస్కృతపదప్రయోగముఁ జేయుచు రసవంతమును, మనోరంజకము నగు కవిత్వము చెప్పిరి.

ఈ పాదమునందలి గ్రంథములన్నియు భాషాంతరీకరణములే కాని స్వకపోలకల్పితములు కావు.

భారతకవు లెవ్వరును కేవల శబ్దాలంకారములను విశేషించి వాడియుండలేదు. నన్నయ కవనమందును, భాస్కర రామాయణ- హరివంశములందును కొలఁదిగా శబ్దాలంకారములు కలవు.

నన్నయ మొదలు సోమనాథునివఱకుఁ గల కాలములో ఆంధ్రభారతి సర్వాంగసౌందర్యసౌకుమార్యసంపాదన మొనర్చుకొన్నది.

ఈ కాలపు కవులు దీర్ఘసమాసములను అతిగా వాడి

యుండ లేదు.

వీరు స్వతంత్రగ్రంథకర్తలు కాకపోయినను శక్తిమంతులు; వాఙ్మయధురంధరులు.

ఈ కాలమందలి కవులు సాధారణముగా బ్రాహ్మణులే. అయినను బద్దెన, నన్నెచోడులవంటి రాజకవులును లేకపోలేదు. తిక్కనకాలమునాటి కవులు మంత్రులుగా—రాజకీయ తంత్రజ్ఞులుగా—యోధులుగా నుండిరి.

ఈ పాదమందలి కావ్యరచన నీతిబోధకును, మతవ్యాప్తికిని తోడ్పడినది.

**మతము**

ఈ కాలమున బ్రాహ్మణమతమే విజృంభించియున్నను జైనగ్రంథములు కొన్ని తలసూపినవి. నిదర్శనము: జినేంద్ర పురాణము, ఆదిత్యపురాణము.

భారత భాగవత, రామాయణాది గ్రంథభాషాంతరీకరణములు బ్రాహ్మణమతవ్యాప్తి నొనర్చి జైనమతమును క్షీణింపజేసినవి. నన్నయాదుల భారత భాగవతాదుల భాషాంతరీకరణములు జైనమతవిజృంభణ మడంచి బ్రాహ్మణమత ప్రచారమునకే తోడ్పడెను కాని వాఙ్మయాభివృద్ధికి గాదని వాఙ్మయచరిత్రకారుని అభిప్రాయము.

వీరశైవమతావలంబకులు 'జాను తెనుంగు'లో గ్రంథములను రచించి మతప్రచారమొనర్చిరి. పాలకురికి సోమనాథుని పండితారాధ్యచరిత్ర, బసవపురాణము లను ద్విపదకావ్యము లిందులకు నిదర్శనములు.

**పోషకులు**

ఆదినుండియు ఆంధ్రకవిత రాజపోషణమున వృద్ధిపొంది

నది. 11,12 శతాబ్దులలో మనవాఙ్మయమును పోషించినవారు చాళుక్యులు. చాళుక్యవంశజులగు సత్యాశ్రయుఁడు, యుద్ధమల్లుఁడు మొదలగువా రాంధ్రసారస్వతమును పోషించిరనుటకు నిదర్శనములు పెక్కులున్నవి.

చాళుక్యుల పిమ్మట చోళులు ఆంధ్రకవిపోషకులుగా నుండిరి. అటుపిమ్మట కాకతీయులును, రెడ్లును ఆంధ్రకవుల నాదరించిరి.

నన్నయ- నారాయణభట్టుల భారతము; మల్లన గణితము; విన్నకోట పెద్దన కావ్యాలంకారచూడామణి చాళుక్యుల కాలమునాఁటి సారస్వతము.

తిక్కన రామాయణ, భారతములు; మంచన కేయూర బాహుచరిత్ర చోడులనాఁటి వాఙ్మయము.

భాస్కర- రంగనాథ రామాయణములు కాకతీయుల నాఁటివి,

ఎఱ్ఱాప్రెగ్గడ భారత, రామాయణ, నృసింహ పురాణాదులు రెడ్ల యాదరణమున బయలుదేఱిన సారస్వతము.

### వాఙ్మయరంగములు

ఆంధ్రకవితాసతి గోదావరీతీరస్థమగు రాజమహేంద్రవరమున నన్నయచే సృజింపఁబడి, క్రమముగా పినాకినీ నదీ ప్రాంతముల స్వేచ్ఛావిహారములను సల్పి, అద్దంకి ఓరుగల్లు ప్రాంతముల బాల్యావస్థను గడపినది.

నన్నయకాలమున రాజమహేంద్రవరమును- తిక్కన కాలమున సింహపురియు- ఎఱ్ఱాప్రెగ్గడ కాలమున అద్దంకి ప్రాంతములును- భాస్కరాదుల కాలమున ఓరుగల్లును- నాచన సోమనాథుని కాలమున విద్యానగరమును వాఙ్మయ

కేంద్రస్థానములుగ నుండినవి.

## భాషాంతరీకరణయుగము

{ ౨-వ పాదము
14, 15 శతాబ్దులు }

### కవులు

ఈ కాలమునాఁటి ఆంధ్రవాఙ్మయవిజృంభణమును తిలకించి మనము పఱ్ఱువీఁగవలసినదే.

పినవీరభద్రుఁడు, అనంతుఁడు, జక్కన, శ్రీనాథుఁడు, బమ్మెర పోతన ఈ కాలమందలి అనర్ఘులగు కవులు.

పినవీరభద్రకవి భారతకవులతోఁ దుల్యమైనవాఁడు. జైమినిభారతము, శకుంతలాపరిణయము లీతని కృతులు. కాళిదాసు సంస్కృతభాషలో రచియించిన శాకుంతలనాటకమునకు పినవీరభద్రుని శకుంతలాపరిణయము చాలవఱకు అనువాదము. దృశ్యకావ్యమును ప్రబంధముగా భాషాంతరీకరించుటకితఁడే ప్రథముఁడు. ఈ శకుంతలాపరిణయరచనమే ప్రబంధనిర్మాణమునకు దారిచూపెను.

అనంతుని భోజరాజీయము నూతనకథావర్ణనాంశములు కలిగి మృదువై మధురముగ నుండును. స్వతంత్రగ్రంథరచనకు ఆంధ్రసారస్వతమున నితఁడే మార్గదర్శి. తెనుగులో ఉన్న స్వకపోలకల్పిత గ్రంథములలో భోజరాజీయము ఒకవిధముగా మొదటిదనవచ్చును.

జక్కన రచించిన విక్రమార్క చరిత్ర తెనుఁగులోని చమత్కారగ్రంథములలో నొకటి.

శ్రీనాథుఁడు లాక్షణికుఁడైన గొప్పకవి. ఈ కవిసార్వ

ళాముఁడు 'చిన్నారి పొన్నారి చిఱుతకూకటినాఁటి' నుండియు భాషాసేవ నొనర్చినవాఁడు. 'కాశీఖండ మయఃపిండం నైషధం విద్వదౌషధమ్' అని కొనియాడఁబడు సంస్కృతగ్రంథముల రెండిటికిఁ దానర్చిన యాంధ్రీకరణములే యీతని పాండితీగరిమమును వెల్లడించుచున్నవి. ఈతని సీసపద్యము లొయ్యారఁపు నడకలు కలవి. ప్రబంధపరమేశ్వరునిచే నిర్మింపఁబడిన ప్రబంధశైలిని శ్రీనాథుఁడు సొంపుగా, నింపుగా నభివృద్ధిపఱచెను. తిక్కన సృజియించిన మహనీయస్థితిని శ్రీనాథుఁడు ప్రోచినాఁడు. ఇతని కవితాధార మత్తేభగమనిక కలది. ఇతఁడు దీర్ఘసమాసములను విశేషముగాఁ బ్రయోగించెను.

బమ్మెరపోతన భక్తిరసప్రధానముగా భాగవతముఁ దెనిఁగించిన- ఆత్మగౌరవము కలిగిన కవిసత్తముఁడు. ధనమునకాశించి ఆంధ్రభారతిని కర్ణాటకిరాటకీచకుల కమ్మని మహాత్ముఁడు. లాక్షణికులీతని గ్రంథమున లక్షణదోషములు కలవందురు. ఇతని కవనమున శబ్దాలంకారములు మెండుకొని యుండును.

### కవిత్వలక్షణము

ఈ పాదము ఆంధ్రసారస్వతమున స్వతంత్రగ్రంథములు బయలుదేఱిన కాలము.

భారతమందలి శకుంతలకథ, కాళిదాసుని శకుంతలనాటకము సమ్మేళనమొనర్చి స్వతంత్రముగాఁ బినవీరభద్రుఁడు శకుంతలాపరిణయము రచించెను.

భోజరాజీయము నిర్వివాదముగా స్వతంత్రగ్రంథము.

శ్రీనాథుని హరవిలాసము కొంతవఱకు స్వకపోలకల్పితము.

భాషాంతరీకరణ మన్నమాటయే కాని ఆంధ్రభాగవతము సంస్కృతభాగవతముకంటె పెద్దది.

ఆంధ్రవాఙ్మయనిర్మాతలని, మహాకవులని మనము కీర్తించు శ్రీనాథుడు, పోతన్న భాషావ్యాప్తికి చెఱియొక అర్గళమును దెచ్చిపెట్టిరి. అవి అత్యంతదీర్ఘతమములగు ప్రౌఢసమాసములను వాడుట యొకటియు, శబ్దాలంకారాడంబరము నెలకొల్పుట యొకటియు నని నాభావము.

సంస్కృతాంధ్రభాషాపారంగతుఁడగుట శ్రీనాథునకు ప్రౌఢదీర్ఘసమాసము లుపయోగించుట సులభసాధ్యమైనది. కాని తరువాతి పండితేతరుల కది వేలము వెఱ్ఱి, కొఱుకువడని కొఱముట్టు ఐనది.

పోతన్న శబ్దార్థముల రెంటికి సమానగౌరవ మిచ్చి సామర్థ్యాతిశయముతో శబ్దార్థాలంకారము లుపయోగించెను. తర్వాతికవులు అవిషహ్యమగు వికారముఁ దెచ్చిరి.

## మతములు

భాషాంతరీకరణయుగపు ద్వితీయపాదములో రామానుజశిష్యులగు వైష్ణవులును, మధ్వాచార్యశిష్యులగు మాధ్వులును కొన్ని తెనుఁగుపుస్తకములు వ్రాసి వారివారి మతసిద్ధాంతప్రచారమును, ఆంధ్రసారస్వతాభివృద్ధిని నొనర్చి కీర్తికాయులైరి. శ్రీనాథుని కాలమునాఁటికి తెలుఁగునాటికి యవనసంపర్కము బాగుగా కలిగినది.

## పోషకులు

పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని కాలమున విద్యానగరప్రభువులును, శ్రీనాథుని కాలములోఁ గొండవీడు రాజు

మహేంద్రవరము రెడ్లును ఆంధ్రసారస్వతమునకు పోషకులుగా నుండిరి.

పోతన లక్ష్మీదేవిని తృణీకరించి సరస్వతిని ఆత్మగౌరవమున నిలిపెను.

### వాఙ్మయరంగస్థలములు

విజయనగరము, రాజమహేంద్రవరము లీకాలమున వాఙ్మయరంగములు. రాజమహేంద్రవరము భాషాంతరీకరణయుగపు టాద్యంతములందు సారస్వత కేంద్రస్థానముగా నుండుట గమనింపఁదగినది. పుట్టినిల్లువిడిచి దూర మేఁగిన ఆంధ్ర భాషాయోషను తిరిగి జన్మస్థానమునకుఁ దెచ్చినవాఁడు శ్రీనాథుఁడు. ఆంధ్రభారతిని శ్రీనాథుఁ డాంధ్ర దేశమంతయుఁ ద్రిప్పినాఁడు.

## 2

## ప్రబంధయుగము

### 16, 17 శతాబ్దులు

### కవులు

ప్రబంధపరమేశ్వరుని ప్రబంధశైలిని- శ్రీనాథుని దీర్ఘ సమాసములను, సీసపద్యములను- పోతరాజు శబ్దాలంకారములను- భోజరాజీయ శకుంతలాపరిణయములను ఆదర్శముగాఁ గొని ఈ యుగమునఁ గవులు స్వతంత్రగ్రంథములను వ్రాయ మొదలిడిరి.

పెద్దన, తిమ్మన, కృష్ణదేవరాయలు, రామరాజ భూషణుఁడు, సూరన, రామకృష్ణుఁడు వీరలు ప్రబంధకవితా తారాపథమున దివ్యజ్యోతులు.

మనుచరిత్ర రచించి ప్రబంధరచనకుఁ బెద్దన్న మార్గదర్శి యయ్యెను మారన మార్కండేయపురాణమునుండి కథావస్తువును గ్రహించి- విస్తరించి- మెఱుంగుపెట్టి మనుచరిత్ర వెల్వరించెను. ఇందలి అల్లిక, జిగిబిగి నిరుపమానము. ప్రకృతివర్ణనలు మనోహరములు.

తిమ్మన పారిజాతాపహరణము ముద్దులు మూటగట్టుచుండును. 'ముక్కు తిమ్మనార్య ముద్దుపలుకు' అనుమాట అతిరాస్యులైన ఆంధ్రులలో నెఱుంగనివారరుదు.

కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదను రచించి తన ఆంధ్రపారస్వతాభిమానమును వ్యక్తీకరించినాఁడు. ఇతఁడు మానవజీవితపరిశీలనమునం దసదృశుఁడు. ఆముక్తమాల్యద నారికేళపాకమునఁ బడినది. అయినను అద్భుతజనకములైన ఇందలి వర్ణనలు హృదయరంజకములు.

మాంధాతృచరిత్ర, కాళహస్తీశ్వరమాహాత్మ్యము మొదలగు మధ్యరకపు గ్రంథము లిప్పటికే. ధూర్జటికవి కాళహస్తీశ్వరశతకము గంగాప్రవాహప్రతీకాశమగు ధారావేగము కలది. ఈ కవి మత్తేభశార్దూలవృత్తములను పోంకముగా నడిపియున్నాఁడు.

రామరాజభూషణుని వసుచరిత్ర శబ్దాలంకారములందు భాగవతమును మించెను. భాషావిషయములో నేగ్రంథమును వసుచరిత్ర కీడురాకపోయినను కథాసంవిధానమందు- సంభాషణసమీచీనతయందు- వర్ణనసందర్భమందు వసుచరిత్ర ఉత్తమశ్రేణికిఁ జెందలేకపోయినది. కాని ఇందలి పద్యములు శ్రవణసుభగములైనవి.

పింగళి సూరన ప్రబంధయుగమునఁ జక్రవర్తి. ఈతని

గ్రంథములు అన్నియును రత్నములు. ఆంధ్రసారస్వతమున కీతఁడొనర్చిన సేవ వర్ణనాతీతము. రాఘవపాండవీయము ద్వ్యర్థికావ్యము. ప్రభావతీప్రద్యుమ్నము జాతీయములకు నిలయమై- మనోహరమై- నాటకసాంప్రదాయములుకల ప్రబంధము. కళాపూర్ణోదయము కథాసంవిధానమున మిన్న. ఆంధ్రసారస్వతమున నిదియొక అపూర్వగ్రంథము.

వ్యర్థపదములు మందునకైన లేకుండ తెనాలి రామకృష్ణుఁడు పాండురంగమాహాత్మ్యమును రచియించెను. పాండురంగమాహాత్మ్యములోని కథలు నీతిబోధకములు. ఇందలి నిగమశర్మకథ ననుసరించి కందుకూరు రుద్రకవి నిరంకుశోపాఖ్యానమను ప్రబంధము రచించెను. పాండురంగమాహాత్మ్యము శైలి నిర్దుష్టమైనది; అనుకరణీయమైనది.

కవిత్వ సామాన్య లక్షణములు

మనుచరిత్ర రచన దుర్నీతిబోధక మాయెను. ఇందలి రతివర్ణనలు దూష్యములు. వసుచరిత్ర రచనకుఁ బూర్వపు కవులు మనుచరిత్రనే యనుసరించిరి. ఇది మొదలుకొని యనుకరణమే కవిత్వమైనది. ప్రబంధకవులు విశేషసమ్మానములు బడయుటచేఁ గవులు ప్రబంధములు కుప్పతెప్పలుగా రచించిరి.

మనుచరిత్ర రచనానంతరము సారస్వతమునకు మూఁడు న్యూనతలు సంభవిల్లినవి.

అవి—

కవు లౌచిత్యమును గమనింపక కేవలము అనుకరణముపై నాధారపడుట :

శ్రీనాథ పోతనల దీర్ఘసమాస, శబ్దాలంకారముల యాదర్శము విస్తరించుట :

భాష కవులకధీనమై యుండుటకు మాఱు కవులే భాష కధీనులై నిఘంటువులపై నాధారపడుట :

ఇంకను రామరాజభూషణుని వసుచరిత్రతో మన భాషకు నాల్గవ న్యూనత సంభవించెను. వసుచరిత్ర తరువాతి ప్రబంధములన్నియు దానికి ప్రతిబింబములే.

ఈ కాలములోనివాఁడైనను జేమకూర వేంకటకవి 'పూమొగ్గలవలె తమకుఁదామే విచ్చు శ్లేషలతో, చవులూరు రచనలతో, అనుద్వేగకరములగు వర్ణనలతో' సారంగధర చరిత్ర, విజయవిలాసములను విరచించి ధన్యుఁడాయెను.

పింగళి సూరన్న ద్వ్యర్థి కావ్యరచనతో నాంధ్రసారస్వతమున కైదవన్యూనత కలిగెను. రసవిజృంభణము- శబ్దలాలిత్యము- కథాచమత్కారము శ్లేషకావ్యములందుఁ బూజ్యములు. అనఁగా నభావములనుట.

కావున నిది మొదలుకొని ఈ ఐదు న్యూనతలతో సారస్వతము క్షీణదశనొందినది.

ఇట్టి న్యూనతల పొంతపోక వేఱుగా నిలచిన ఈయుగపు వాఁడు వేమనకవి.

## పోషకులు

ఆంధ్రభారతిని జయంత్యుత్సవములతో పల్లకులపై నూరేగించినది యీ యుగమందే. కృష్ణదేవరాయల 'భువన విజయమున' వెల్వడిన గ్రంథములన్నియు నాంధ్రకవితాసతి కలంకారములు. మన సారస్వతాభివృద్ధికాలములో దీనిని 'అగస్టన్ ఏజ్' అనవచ్చును. తంజావూరు రాజులు, మధుర నాయకులు ఈ యుగమున శక్తికొలఁది సారస్వతమును బోషించిరి.

### వాఙ్మయరంగములు

విద్యానగరమే ఈ యుగమందలి ప్రధానసరస్వతీనిలయము. తమిళదేశమధ్యస్థములైన తంజావూరు, మధుర నగరములు ఈ యుగములోని ఉత్తరపాదమున వాఙ్మయరంగములగుట గమనార్హవిషయము. తంజనగరమున యక్షగానములు, మధురపట్టణమున వచనకావ్యములు విస్తరిల్లినవి.

## 3

## మధ్యమయుగము

### 18, 19 శతాబ్దులు

### కవులు

కీర్తనలు వ్రాసిన త్యాగరాజు, ఉత్తరరామాయణము రచించిన పాపరాజు మున్నగువారు తప్ప ఈ యుగమున పేర్కొనఁదగిన పెద్దకవు లెవ్వరును లేరు.

### కవిత్వసామాన్యలక్షణములు

మధ్యమయుగమున భాషాదోషము కురూపమై కుంట నారంభించినది. ఇదివఱకే వ్యాపించియున్న న్యూనతలుగాక మఱిరెండు న్యూనతలు వచ్చినవి.

మొదటిది:

అచ్చ తెనుఁగులో గ్రంథరచన—

పొన్నగంటి తెలగనార్యుఁడు యయాతిచరిత్ర నచ్చ తెనుఁగులో రచించి భాషకు క్రొత్తకట్టుబ్బు తెచ్చినాఁడు. మహాకవు లనిపించుకొనుటకై కూచిమంచి తిమ్మనాదు లచ్చ తెనుఁగులో గ్రంథములు కురియించిరి. వీరి గ్రంథములు సరస సాహిత్యవినాశనమునకుఁ దోడ్పడినవనక తప్పదు.

రెండవది :

నిరోష్ఠ్యాదినియమములతో గ్రంథరచన—

ఆధునికులగు వీరేశలింగముపంతులుగారుకూడ నిరోష్ఠ్యాది నియమములతో గ్రంథములు వ్రాసి భాషాదేవిని బంధించుటలో పాల్గొనఁ గల్గిరి.

ఉత్తమకావ్య మనఁదగినది యొక్కటియు నీమధ్యమ యుగమున వెడలలేదనవచ్చును.

అష్టాదశ వర్ణనలు: శృంగార రసము

ఈ యుగపువారు ప్రాచీనుల పద్యములనే మార్చి-మార్చి వ్రాసి వెలార్చిరి లక్ష్మణకవి, తిమ్మకవి మొదలగు వారు ఇందులకు దక్షులు. వీరితోఁ ప్రబంధయుగమున కవ సానదశ సిద్ధించి- స్త్రీవర్ణనములు మితిమీఱి- అష్టాదశ వర్ణనలే ప్రబంధమునకు ముఖ్యవిషయములుగ నైనవి.

భోగపరాయణులైన ధనవంతులు పోషకులుగా నుండుటచే అసభ్యశృంగారము ప్రధానమైనది. కనుకనే ఈకాలమున ప్రభవించిన ప్రబంధములు ఇప్పటి నాగరకుల కనిష్టజనక ములై యున్నవి. శేషము వేంకటపతి శశాంకవిజయము, ముద్దుపళని రాధికాసాంత్వనము మున్నగునవి ఇందులకు నిదర్శనములుగాఁ జెప్పనగును.

మతములు

మహమ్మదీయసంపర్కము గల ప్రబంధయుగములో మహమ్మదీయగ్రంథము లేవియు వెల్వడకున్నను ఇప్పటి క్రైస్తవమత సంపర్కములో మాత్రము మతప్రధానములగు గ్రంథములు పొడసూపినవి. ఈ యుగాంతమున బైబిలు వచన

రూపమున వ్రాయఁబడినది. ఆంగ్లభాషలో బైబిలుశైలి నిర్దుష్టమైనది. ఇఁక నాంధ్రమునందన్ననో బైబిలుశైలి విపరీతమై యవిషహ్యముగ నున్నది.

క్రైస్తవులు విపరీతమగు వచనశైలిని కొనివచ్చినవారయ్యు ఆంధ్రసారస్వతమునకు మహోపకార మొకటి చేసిరి. తెనుఁగున ముద్రాలయస్థాపనమే ఆ మహోపకారము. ఈ సందర్భమున బ్రౌనుదొర తప్పక స్మరింపఁదగినవాఁడు.

ముద్రాలయస్థాపనతో ఆంధ్రసారస్వత చరిత్రమున ఆధునికయుగము ప్రారంభమైనదని చెప్పవచ్చును.

౨

# తెనుఁగుకైతల క్రొత్తతెన్నులు

నవరసమ్ములు నాట్య మాడఁగ
చివురు పలుకుల జెవులు విందుగ
కవితలల్లే క్లాంతహృదయుల
గారవింపవె తుమ్మెదా !

—రాయప్రోలు సుబ్బారావు

## 1

## అభినవాంధ్ర కవిత్వావతరణము

ఇప్పుడు మనము తిలకింపఁబోవునది ఆంధ్రకవితాసారస్వత చరిత్రమందలి యొక రసవదధ్యాయము.

పింగళి సూరనకుఁ బిమ్మట ఆంధ్రసరస్వతి 'అరుణిమ దూలిన యధరము'వలె పసిచెడి శోభాదరిద్రాణమై దీర్ఘమైన నిద్రావస్థఁ బొందినది.

పందొమ్మిదవ శతాబ్ది మధ్యభాగమున బ్రౌనుదొర నిఘంటువు ప్రచురించుటతో ఆంధ్రభాషాప్రపంచమున నొక సంచలన ముదయించినది. చిన్నయసూరి, వీరేశలింగము పంతులు మొదలగు పండితప్రకాండు లీసంచలన మందికొని తీఁగ సాగింపఁజొచ్చిరి. వచనరచనయందుఁ గ్రొత్తఫణుతు లన్వేషించి, అవలంబించి నూతనయుగప్రవర్తకుఁడైన వీరేశలింగముపంతులు తెనుఁగుకైతను ప్రాచీనులవలెనే ప్రబంధ

వీథుల బందీకృతిఁ గావించెనే కాని క్రొత్తవెన్నుల నడిపింపలేదు.

తిరుపతి వేంకటకవులు కవితాసతికి బాహాటప్రచార మిచ్చి ఆంధ్రప్రజలదృష్టి కవిత్వమువైపు మరలించిరి. కాని వారు సరస్వతిని త్రిప్పరానిచోట్లఁ ద్రిప్పినారు. వారి బుద్ధచరిత్రమొకటిది నిజమైన కవిత్వము. కవితాప్రపంచమునఁ క్రొత్త వెన్నులు గొనిరాలేకపోయినను వారు మనకు నేటొక మహోపకారము కావించిరి. వా రాంధ్రయువకుల హృదయక్షేత్రములందుఁ గవితాంకురములు విత్తి కవితాసరస్వతీభాగ్యాభ్యుదయస్థితికిఁ బునాదులు వైచి కవితోత్సాహకులఁ గొందఱ వెడలఁదీసిరి ఇందుల కాంధ్రులు వారిని జిరకాలమువఱకు మఱవ నేరరు.

ఆంధ్రకవితాప్రపంచమున నవవసంతోదయమై నూతన వికాసము, నూతనచైతన్యము, నూతనవిలాసము, నూతన ప్రబోధమును ఇరువదియవశతాబ్దాదిని జనించినది. అప్పుడు సముద్రతరంగమువలె నువ్వెత్తుగ మూలమూలల వ్యాపించిన వందేమాతరోద్యమము స్వదేశాభిమానమును తీవరించి, స్వభాషాభిమానము నుద్రేకింపఁ జేసినది.

అందుతో భాషోద్ధరణోద్యమము వెల్లివిరిసినది. ఆంధ్ర కవితాసతి నాఁటి ఆ వేశతరంగిణియొక్క ఉత్తుంగతరంగడోలికలలో దాయించవలె ను య్యాలలూఁగి, దిక్కు మూరములందు ఎలుఁగెత్తి చాటుచున్న సమయశాంఖికుని విశ్రుతనాద మాలించి వికాసపుంజముల గొంగొనినది. అందుతో నవ్యాంధ్ర కవితాప్రపంచమునం దొక మహావిప్లవము ప్రారంభమైనది.

నవ్యాంధ్రకవిత్వశుభోదయమునకు శ్రీగురుజాడ అప్పారావు వేగుజుక్క. ప్రబంధవీథుల బందీకృతయైన కవితాసతిని

క్రొత్త తెన్నులకుఁ గొని తెచ్చి ఆమెకు స్వేచ్ఛానిశ్వాసము కల్గించిన ప్రజ్ఞానిధి అతఁడు. అతఁడు 'క్రొమ్మెఱుంగులుచిమ్ము'గాఁ కవితాగానముచేసి అనూనశోభ ఘటించి నూతనయుగారంభప్రకోష్ఠకాంతు లెల్లెడలఁ బఱపిన సిద్ధహస్తుఁడు; తన కవితాహస్తమున ముత్యాలసరులకు రూపసిద్ధి నొసఁగిన లక్షణవేత్త.

ప్రబంధవాసన లెడలించి, 'నూతనయుగోదయరాగము' లాలపించి ఆంధ్రకవిత్వమునకు నవ్యత కొని తెచ్చినవాఁడు శ్రీ రాయప్రోలు సుబ్బారావు. భావరసభరితములు, నవోద్యమదీపితములునగు 'తృణకంకణము, కష్టకమల' ఇత్యాది మనోహరకావ్యముల రచించిన సాహిత్యవర్ధనుఁ డాతఁడు. అతఁడాంధ్రకీర్తిని సంకీర్తనము చేసినవారిలోఁ ప్రథమాంధ్రమహాకవి. కుశేశయకుట్మలములవలెఁ గోమలములును, చిగురుటాకులవలె నూతనవికాసభాసురములును నగు నునుఁదియ్యని పదములతోఁ గావ్యములను జిత్రించు పదశిల్పి ఆతఁడు.

క్రొత్తపోకడ లలవఱచుకొని, పదశిల్పము నేర్చికొనిన నవీనాంధ్రకవితాసతికి నూతనవాతావరణములో సరిపోవు ఛందోవిన్యాస మర్పించిన రచనాభిజ్ఞులు వేంకటపార్వతీశ్వరులు, ఖండకావ్యములు, భావగీతములు రచించుటకు అన్ని విధముల అనువైనది తేటగీతియని నవీనాంధ్రకవికోటికి నివేదించిన కవితారసికులు వీరే. వీరి తేటగీతములు పదాంతములందు విరుపులతోఁ జెన్నొందు లాలిత్యలావణ్యములు కలిగి యుండు పూలరేకులు.

నవ్యాంధ్రకవితాసతికి గురుజాడ అప్పారావు క్రొత్త తెన్నులు రుచిచూపెను; రాయప్రోలు సుబ్బారావు పదశిల్పము

నివేదించెను; వేంకటపార్వతీశ్వరులు తేటగీతముల, మంజుల కాన్కనిచ్చిరి. ఈ కవులు కావ్యేందిరరూపు రేఖలకు మార్పుకొఁ దొడిగిరి; కవితారథమును నూతనపథములఁ బట్టించిరి. వీరలు నవీనాంధ్రకవిత్వమునకు సూత్రధారులు.

ఇట్టి కవిపుంగవులు భాషాయోషకుఁ బూజాపుష్పము లర్పించుచుండ నాంధ్రోద్యమ మారంభమై దేశము నుత్సాహ తరంగితము గావించెను.

1906–1908 ప్రాంతమున సముద్రతరంగమువలె దేశము నలుమొగముల వ్యాపించిన స్వదేశీయోద్యమము కవిత్వావేశమునకుఁ, గావ్యసామగ్రికి నంతులేని ఆవేదన పడుచున్న నాఁటి తెనుఁగుకైతగాండ్ర కావేశము కల్గించి కావ్య సామగ్రిని గల్పించినది.

ఆంగ్లవిద్యావంతులైన ఆంధ్రులు పెక్కురు అంత దనుక డిగ్రీలు పొందినవెంటనే ఉద్యోగధర్మ మవలంబించుచు వచ్చిరి. కావున అట్టివారు సారస్వతజీవనులు కాలేకపోయిరి. స్వదేశోద్యమానంతరము సేవకావృత్తిపై విద్యావంతులకు ఏవ పుట్టుటయే కాక ఉద్యోగపదవులుకూడఁ దక్కువకాఁ జొచ్చెను. అట్లగుట కొందఱు విద్యాధికులకు సారస్వతముపై దృష్టిపోవుటకుఁ దగిన యవకాశము సమకూడెను.

ఇట్లు వందేమాతరోద్యమము మనకవులకుఁ గవిత్వ రచనకు వలయు అవకాశమును, ఆవేశమును, సామగ్రిని కల్గించినది.

ఆ తరుణమున గురుజాడ అప్పారాయుని నూత్నభావ వీచికలును, రాయప్రోలు సుబ్బారాయుని ప్రౌఢపదవిన్యాసము

లును, వేంకటపార్వతీశ్వరుల తేటగీతముల క్రొత్తందనములును, మెత్తందనములును ప్రజాహృదయవీథి నడతెంచి, వారి మనముల నాటుకొనుచుండెను.

ఆ సమయమున ఆంధ్రపత్రిక, ఉగాదిసంచికలు, ఆంధ్రభారతి మొదలగు పత్రికలు బయలుదేఱి యువకవుల ఖండకావ్యములకు, భావగీతములకు సుస్వాగతము చేయుచు వానిని తలఁదాల్చుచుండెడివి.

ఆ సమయముననే ఆంధ్రోద్యమ మారంభమై ఆంధ్రులకు శుభోదయమును గొని తెచ్చెను. ఆంధ్రమహాప్రజల హృదయక్షేత్రములం దవబోధ మంకురించినది. దేశోద్ధరణమునకు దేశభాషాభివృద్ధి సహజసాధనమను సిద్ధాంత మంగీకృతమై తెలుఁగునాట దృఢతరమైన ఆంధ్రభాషాభిమానమును కల్గించినది.

అందుతోఁ గావ్యరచనాపరులగు ఆంధ్రకవుల కాంధ్రప్రజల పోషణప్రోత్సాహములును, అభిమానాదరణములును లభించి వారిని ఉత్సాహవంతులనుగా నొనర్చెను. ప్రపంచమునంతను కలగుండువెట్టిన ఐరోపామహాసంగ్రామముకూడ ఆంధ్రలోకవ్యాప్తమైన ఈనూతనోత్సాహమును, కవితావేశమును చప్పఁబఱుపఁజాలకపోయెను.

ఆంధ్రోద్యమ మారంభించిన నాఁటినుండియు తెనుఁగు కైత పాలసముద్రమువలె నపారముగఁ బెరుఁగుచు మున్నెన్నఁడుఁ ద్రొక్కి చూడని పెక్కు నూతనమార్గములఁ బరువెత్తుచున్నది.

ఆ నూతనమార్గములఁ బరామర్శింతము.

# 2

## ప్రాచీనాధునాతన కవితావిభేదములు

ఆంధ్రకవితాసారస్వతమును విమర్శకదృష్టితోఁ బాఱఁజూచితిమేని ప్రాచీన నవీన కవిత్వములందుఁ గల విభేదములు కొన్ని విస్పష్టముగఁ గానవగును.

### కావ్యపరిమాణము

మొదటిది కావ్యపరిమాణము. పూర్వకవులు సాధారణముగ మహాకావ్యములను రచించిరి. నేఁటివారన్నో అలఁతియలఁతి విషయముల నితివృత్తములుగా నెన్ని, ఖండకావ్యములు రచించుచున్నారు.

ఇక్కాలమున ఖండకావ్యరచనకు విశేషప్రోద్బలము గలదు.

ఏతత్కారణము లారయనగును.

'కావ్యగీతిప్రియు'లగు రాజరాజనరేంద్రులను గాని, 'కవితాప్రావీణ్యఫణీశు' లగు కృష్ణదేవరాయచక్రవర్తులను గాని పరాధీనమందున్న ఆంధ్రు లిఁకఁ జూడఁబోరు. అట్లగుట:

చ. నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు క
ప్పురవిడె మాత్మకింపయిన భోజన మూయ్యెలమంచము...

—చాటుధార.

ఇచ్చి మహాకావ్యములను రచియింపుఁడని కవులను గోరు ప్రభువతంసము లుండరు. మహాకావ్యరచనకు అవకాశముఁ గల్పించు రాజపోషణ మిట్లు కొఱవడియుండుటచే నీకాలమున ఖండకావ్యరచనమే కొనలుసాగుచున్నది.

మఱియొక కారణము :

ప్రస్తుతయుగమున కవితాపోషకులగు ప్రజలు తీరి కూర్చుండి మహాకావ్యములు పఠింపనేరని త్వరజీవనులు, లౌకికులు. వారికి తీరిక తక్కువ. వారిమనములు వివిధవ్యాపారములందుఁ బర్యాప్తములు. అందువలన స్వల్పకాలములో సమాప్తము కాఁగల ఖండకావ్యములపైకి వారిచిత్తములు పోవుచున్నవి. కావున నట్టి కావ్యరచనకు ఆధునికయుగమున విశేషమైన ప్రోత్సాహము, ప్రోద్బలము కల్గుట నైసర్గికము.

వేఱొందు హేతువు :

ప్రస్తుతకాలమున పత్రికలే పెక్కుసందర్భములలోఁ గావ్యప్రచురణసాధనములు. సుదీర్ఘమయిన కావ్యసామగ్రిని దలఁదాల్చుట ప్రజాభిరుచికి దూరమగుటయే యని నేఁటి పత్రికలు నిజ మూరసినవి. అట్లగుట నేఁడు కావ్యప్రచురణసాధనములైన పత్రికలుకూడ ఖండకావ్యరచననే అభిమానించుచున్నవి.

వేఱొక కారణము :

నవీనాంధ్రసారస్వతమునకు అదృష్టవశమున ఆంగ్ల సారస్వతసంపర్కము లభించినది. ఆంగ్లసారస్వతమున ఖండకావ్యములు వేనవేలు. అనుకరణమునకుఁ బెట్టినదిపేరగు మన ఆంధ్రకవులు అదిచూచి తెనుఁగుకైతను ఖండకావ్యభూషలతో సింగారింపఁ దొడఁగిరి. ఖండకావ్యరచనము ఆంగ్లసారస్వత సాహచర్యమువలన మన కబ్బిన మహాభాగ్యములలో నొకటి.

ఇఁక నొక కారణము :

'సతతము కావ్యరసముం గొనియాడుచు' 'మహాకవిత్వదీక్షావిధిఁ' బూనఁగల తిక్కనసోమయాజివంటి రసోపాసకులను, గవిబ్రహ్మలను గనఁజాలని పిడపకాల మిది. ఆధునికాంధ్ర

సారస్వతమహాసభాభవన మలంకరించిన 'కలికిపాటలకోయిల కోలము' వారికి సారస్వతమువలన జీవనోపాధి కల్గుటలేదు. వారు ఇతరత్ర ఉద్యోగధర్మమును స్వీకరించియో, వ్యాపార వ్యవసాయము లవలంబించియో పొట్టపోసికొనుచు దేశాభిమానములును, భాషాభిమానములును నగుటచే తీరికసమయములందు ఉద్విగ్నమనస్కులై కవన మల్లుచున్నారు. వారి శ్రద్ధాబుద్ధులను ఒక్క కవిత్వరచనమందే అవధానమొనర్చుటకు వారు ఉదరపోషణార్థ మవలంబించిన ఇతరవ్యాపారము లొప్పుకోనవు. కావున వారికి మహాకావ్యరచనకు వలయు దీక్షాపరత్వము లేకుండఁబోయినది. అత్యభిరుచిగల వారి కవిత్వాభినివేశము ఖండకావ్యరూపమున జాలువాఱుచున్నది.

కవితాపోషకులైన ప్రజలును, కావ్యప్రచురణసాధనములైన పత్రికలును, నవీనాంధ్రకవిత్వాభివృద్ధికిఁ బ్రోద్బలమొసంగుచున్న ఆంగ్లసారస్వతమును, కవితానిర్మాతలగు యువకవులును ఇట్లు ఖండకావ్యములవైపే ముల్లుచూపుచుండుటచేత ఆధునికయుగమున ఏతత్కావ్యరచనము మెండుకొనుచున్నది.

### కవితాసామగ్రి

ప్రాచీనకవిత్వమునుండి నేఁటి తెనుఁగుకవిత్వమును వేఱుపఱచెడి రెండవవిషయము కవితాసామగ్రి.

పూర్వకవులు ఉన్నతకుటుంబములవారి ప్రేమజీవితములు, మహాపురుషుల యుద్ధవీరత్వము మొదలైన సామాన్యజనుల కందుబాటుకాని ఉదాత్తవిషయములను కవితావస్తువుగా గ్రహించిరి. వారికిఁ బ్రకృతివర్ణనములు మహాకావ్యకల్పనలో నడపదడపఁ దోతెంచు నుపాఖ్యానములు.

నవీనకవుల కట్లుకాదు. ప్రకృతివర్ణనము లే వీరిఖండ కావ్యములకుఁ బ్రాణములోయు ప్రధానవిషయములు. ప్రకృతిలోని సీతాకోకచిలుక మొదలు గగనదీపమగు చంద్రునివఱకును గల సమస్తవస్తువులును వీరి కవితాకుంచిక కనువగు వస్తువులే. వీరు ప్రాకృతజనుల సామాన్యజీవితవిషయములను గూడ కవితాసామగ్రిగ స్వీకరింతురు. ఇది ప్రాచీనాంధ్ర పండితకవు లెవ్వరును ద్రొక్కిచూడని క్రొత్తతెన్ను.

ఇది ప్రజాస్వామిక (Democratic) ప్రభుత్వకాలము. కావున 'కవితలల్లే క్లాంతహృదయులు' సామాన్యప్రజల జీవిత విషయములను కవితాసామగ్రిగా స్వీకరించుట కాలప్రభావము.

ఇవి జాతీయపునరుద్ధరణదీక్షాదినము లగుటచే ఆంధ్ర చారిత్రకవిషయములను దేశోద్ధారకు లనఁదగిన యువకవులొకరిద్దఱు గానము చేయుచు 'ఆంధ్రావళి మోదముంబొరయు' చున్నారు.

ప్రబంధకవులు కృతిపతి నభినందించు ఘట్టమునఁ దప్ప మిగిలిన స్థలముల సమకాలికాంశములను ప్రస్తావింపలేదు. నవ్యకవు లట్లుకాక సమకాలికాంశములను గావ్యవస్తువుగాఁ జేకొనుచున్నారు.

## శైలి

మూఁడవది శైలి.

ప్రబంధకవులు తమకావ్యములను బ్రౌఢాతిదీర్ఘసమాసములతో నింపివైచిరి. అందు బంధశ్లేషద్వ్యర్థికావ్యాది యింద్రజాలికకవిత్వము మెండుకొనియుండుటయుఁ గలదు. ప్రబంధకవులలోఁ బెక్కురు సంస్కృతసాహితీమండను లగుటచే వారి గ్రంథములందలి శైలి సాంస్కృతికము. 'తోడ నర్థమొల్లఁ

నోఁచకుండు గూఢశబ్దములతోఁ నిండియుండు నా ప్రబంధములు పండితులకుఁగూడ కొఱుకుపడని కొఱముట్టులు.

నవకవులు చిన్నిపదములు, నాతిదీర్ఘసమాసములు, జానుతెనుఁగుపదములు వాడి సులభసుందర శైలిలోఁ గావ్యరచనము చేయుచున్నారు.

బంధశ్లేషద్వ్యర్థికవిత్వములు మన యదృష్టవశమున విస్మృతికూపమునందుఁబడి అడఁగారుచున్నవి. ఆంధ్రకవితాసతి యదృష్టరేఖ బయలుపడుటచే ఆశుకవితాప్రాబల్యము త్వరితగతి నడుగంటుచున్నది. పరకపాటుగఁ జూపట్టుచున్నను రసికప్రజల సాదరదృష్టి అట్టికవిత్వముపైఁ బ్రసరించుటలేదు.

పదకాఠిన్యమే గొప్పకవిత్వమునకు యోగ్యతాపత్రముగా భావించిన ప్రబంధకవుల శైలికిని, శిరీషకుసుమపేశలములైన లలితపదములతోఁ గవనమల్లు నేఁటివారి శైలికిని గల వ్యత్యాసము సముద్రమంత విస్తారమైనది.

పూర్వులు మారుమూలపదములను, కొండర్థములు స్ఫురించు పదములను శ్రమచేసి ఏర్చి కూర్చి తమకావ్యములను బండితజనైకవేద్యముగా నొనరించిరి. నేఁటివారన్ననో 'కందువమాటలు, సామెతలు' అందముగాఁ బొందుపఱిచి తమగీతికాప్రసవములను జనసామాన్యము తావిగొనునట్లు చేయుచున్నారు.

వ్యావహారికశైలి నుపయోగించుచుఁ గళాదక్షులును, మహామతులు నగు నవ్యాంధ్రకవులు కొందఱు జీవద్భాషామాధుర్యమును ఆంధ్రలోకమునకు నంజుకొనఁ బెట్టుచున్నారు. సులలితాంధ్రపదములు, వ్యావహారికభాషాపదములు, జాతీయములు, సామెతలు- ఇత్యాది జీవద్భాషాపరికరములు

నవీనాంధ్రకవుల శైలికి నవరఁదనముఁ గొనితెచ్చు మేరువు పూసలు.

ఛందస్సు

నాల్గవది ఛందస్సువిషయము.

పూర్వులు రచించిన గ్రంథములలో శతకములును, ద్విపదకావ్యములును మాత్రమే ఏకవృత్తపూర్ణములు. మిగిలినవన్నియు వివిధగద్యపద్యాత్మకములగు చంపువులు.

నవీనులగ్రంథములన్నిటో విశేషము తేటగీత, మంజరి, ముత్యాలసరులు మున్నగు ఏకఛందములో- రచింపఁబడిన ఖండకావ్యములు.

ఉత్పలమాల, చంపకమాల, మత్తేభము, శార్దూలము మొదలగు వృత్తములను విశేషముగను- సీసము, గీతము మున్నగు జాతులను ప్రాయికముగను పూర్వప్రబంధకవులు వాడిరి. ఆధునికయుగమున నియమబాహుళ్యముగల వృత్తముల రచన కొంచెము వెనుకబాటుపొందినది. యతిప్రాసలకుఁ గట్టుపడుట యనినను, వ్యర్థపదపూరణములతో యతిప్రాసల నిల్పుటయనినను స్వేచ్ఛాపరులును, పదశిల్పులును నగు నేఁటి కవులకుఁ దలచీఁదఱ. యతిప్రాసలు ఎత్తికట్టి భాషాసౌలభ్య సంపాదన మొనరించుటకు స్వేచ్ఛాపరులయ్యు నవ్యాంధ్రకవులు పూర్తిగా సాహసింపలేక వృత్తములను మాని నియమములు తక్కువగనుండు మంజరులపైకి, తేటగీతములపైకిఁ దమదృష్టి మరలించిరి.

నవ్యాంధ్రకవితాసూత్రధారులలోనివారైన వేంకట పార్వతీశ్వరులు తేటగీతములు, మంజరులు లాలిత్యలావణ్య ములు కలిగి విశృంఖలములగు నవ్యభావవర్ణనముల కమరి

యుంచుటను గనిపెట్టినారు. తేటగీతి ఆంధ్రమునకు అనుష్టుప్పు; సర్వతోముఖమగు నవ్యభావపరంపరకు ననువైన చక్కని వాహిక. మఱియొక మంజరీద్విపద మధురభాషయగు ఆంధ్రమునకే అవతరించినది. కావుననే నవకవులు తేటగీతముల, మంజరుల విశేషముగ నాశ్రయించుచున్నారు.

పరంపరానుగతములగు ఛందములు యతిప్రాసదూషితములై తగినస్వేచ్ఛను, తృప్తిని ఈయకుండుటచే నూతనచ్ఛందములను నిర్మించుటకు నేఁ డొకవిపులప్రయత్నము జరుగుచున్నది. ఈ విపులప్రయత్నము నవీనాంధ్రకవులలోఁ బెచ్చుపెరుగుచున్న స్వాతంత్ర్యబుద్ధివలనఁ గలిగిన ఆరోగ్యవంతమును, శ్లాఘ్యమును అగు కృషి. ఫలమెట్టిదగునో?

భావము

ఐదవది భావముల విషయము.

ప్రబంధకవులలో భావదాస్యము హెచ్చు. వారి కావ్యనిర్మాణపద్ధతియే ఇట్టిభావదాస్యమును బోషించినది. దేవతాప్రార్థన, కవిస్తుతి, కుకవినింద, కృతిపతివంశవర్ణన, షష్ఠ్యంతములు, పురవర్ణన, బ్రాహ్మ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణన, వేశ్యాభిసారికా పుష్పలావికాది వర్ణన, నాయికా నాయకుల వర్ణన, వారి విరహము, చంద్రోపాలంభము, మన్మథోపాలంభము మొదలైన విషయములన్నియుఁ దప్పనిసరిగాఁ గావ్యనిర్మాణములోఁ బూర్వులు చేర్చికొనియుండుటచే వారి భావములకు అనేకత్వముకాని, సంక్షేపవిక్షేపములుకాని లేకపోయినవి. ఒకరినొక రనుకరించుటచే వారిభావములకు నవీనత్వము కూడ లేకుండఁ బోయినది.

నవీనకవుల విషయమున అట్లుకాదు. వీరు స్వేచ్ఛా

ప్రియులు. అనుకరణము వీరి 'ఇంట ఒంట' కూడ లేదన సాహసింపనేరము కాని వీరు కావ్యనిర్మాణపద్ధతిలో వివిధత్వ మవలంబించుటచే వీరిభావములకు సరిక్రొత్తదనమును, సంక్షేపవిక్షేపములును లభించినవి

లక్షణగ్రంథముల బందుకిట్లకు లోఁబడి కావ్యరచనముఁ గావింపనొల్లని రసోపాసకులు నేఁటికవులు.

ప్రాఁదనుఁగుకైతనుండి వేఱైయున్న నేఁటి తెనుఁగుకైతల క్రొత్తతెన్నుల నిట్లు స్థూలదృష్టితోఁ బరామర్శించుకొంటిమి.

ఇఁక నాక్రొత్తతెన్నులను బ్రత్యేకనిదర్శనములతో విమర్శించుకొందము.

## 3

## తెనుఁగుకైతల క్రొత్తతెన్నులు

### ప్రకృతివర్ణనము

నవీనాంధ్రకవులకుఁ బ్రకృతిచింతనము, తత్సాంగత్యము నెక్కువ.

ప్రబంధకవులు తమకుఁదామై ప్రకృతితో సాంగత్యమనుభవించి ప్రకృతివర్ణనము చేయలేదు. ప్రకృతివర్ణనావసరమున వారు గ్రంథస్థములును, కవిసమయములును నైన వర్ణనాక్రమము నవలంబించిరి. ప్రవాహవేగయగు గంగానదిలోఁ దామరమొలపించెడి ప్రబంధకవు లెక్కడ? ప్రకృతిసాంగత్య మెక్కడ?

ఇట్టి విరుద్ధకవిసమయముల చెంతఁ జేరక ఆంధ్రకవితాపితామహునివలె నొక్కింత మనోహరముగఁ బ్రకృతివర్ణన

గావించిన కవులును కొందఱు ప్రాచీనులలో లేకపోలేదు. కాని అట్టివారైనను ప్రకృతి యథారూపవర్ణనముగా త్రిమే చేసిరి కాని ప్రకృతిలోని అంతర్లీనవిషయముల నవగాహము చేసికొన ప్రయత్నింపరైరి.

ప్రకృతిలోని వివిధచిత్రములఁ దిలకించి, ఆనందించి, కలరూపు కవితాకుంచికతోఁ జిత్రించుట ప్రాచీనాధునాతన కవులకు సమానవిషయము. కాని అధునికాంధ్రకవులు ప్రకృతి వివిధరూపములను దూరమునుండి తిలకించుటతోఁ దృప్తినొందరు. వీరు ప్రకృతిలో నంతర్లీనమగుదురు.

నిదర్శనముగా 'ఏకాంతసుఖము' అను శీర్షికగల శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి గ్రింది ఖండకావ్యమును తిలకింపనగును :

ఈ యడవి దాగిపోనా?
ఎట్లైన
ఇచటనే ఆగిపోనా?
ఆకులో ఆకునై
పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై
నునులేత రెమ్మనై
ఈయడవి దాగిపోనా?
ఎట్లైన
ఇచటనే ఆగిపోనా?
గలగలని వీచు చిఱు
గాలిలో కెరటమై
బలబలని పాడు
సెలపాటలో తేటనై

ఈయడవి దాగిపోనా?
ఎట్లైన
ఇచటనే ఆగిపోనా?

తరులెక్కి యాలనీల
గిరులెక్కి మెలమెల్ల
చదలెక్కి జలదంపు
నీలంపు నిగ్గునై

ఈ యడవి దాగిపోనా?
ఎట్లైన
ఇచటనే ఆగిపోనా?

ఆకలా దాహమా
చింతలా వంతలా
ఈ కరణి వెఱ్ఱినై
ఏకతమ తిరుగాడ?

ఈ యడవి దాగిపోనా?
ఎట్లైన
ఇచటనే ఆగిపోనా?

ప్రకృతితో సాహచర్యము హెచ్చు గావుననే వీరికి ప్రకృతిరూపవికారములం దొక అనిర్వాచ్యమైన మహాశక్తి, మహావ్యక్తి పొడగట్టును. ఆ మహావ్యక్తిని గురువుగను, తమ్ము శిష్యులుగను నిర్దేశించుకొని నవీనాంధ్రకవులు ఆ మహావ్యక్తితో మానసికసల్లాపసంతోషము నొంది అందుండి నీతిని గ్రహింతురు. ఒజ్జగా నిర్దేశింపఁబడిన ప్రకృతి మనసము క్రమముగా నతిశయిల్లి జీవాత్మపరమాత్మలకుఁ గల సంబంధ

సోపానమార్గమును వ్యక్తము చేయును.

ఇట్టి ప్రకృతివర్ణనము వేంకటపార్వతీశ్వరకవుల 'ఏకాంతసేవ'లోఁ బ్రకృతిపురుషులకుఁ గల పవిత్రప్రణయలీలల రూపముగఁ బ్రస్తావింపఁబడినది.

నవీనాంధ్రకవులకుఁ బ్రకృతి జీవితాదర్శములఁ బ్రదర్శించు గురువు; అంతరాత్మను ప్రబోధించు వేదాంతి.

## లిరిక్కు కవిత్వము

లిరిక్కు కవిత్వలక్షణములు కలదానినే కొందఱు భావకవిత్వమనుచున్నారు.

ఏజాతికిఁ జెందినను ఉన్నతకవిత్వమునకు భావము ప్రాణాధారము. అట్లగుట ఒకజాతి కవిత్వమునే భావకవిత్వమనుట కువాదమే యగును. కావున భావకవిత్వమని మనవారు పిలుచు కవిత్వమును 'లిరిక్కు' కవిత్వమని పిలుచుట సమంజసముగా నుండును.

ప్రబంధకవిత్వములో కవి చదువరులకుఁ దనకుఁ దానై గనుపించడు. కాని లిరిక్కు కవిత్వములోనో? లిరిక్కు కవిత్వమనునది కవి ఆత్మోదంతమో, ఆత్మానుభవమో ఐయుండును.

లిరిక్కు కవిత్వమునఁ గవి తనహృదయమున మిట్టుమీఱి మల్లాడు సుఖదుఃఖాద్యనుభవములను బ్రవహింపఁజేయును. కవి స్వీయానుభవవ్యక్తీకరణము గావున లిరిక్కు కవిత్వము విశ్వాసముండితమై యుండును.

లిరిక్కు కవితాప్రధానలక్షణ మొద్ది యనిన: కవితావస్తువుతోఁ గవికి ప్రచ్ఛన్నము కాని సంబంధముండుటయే. ఇంతియే కాని వస్తువునందుఁ గాని, భావమునందుఁ గాని లిరిక్కు కవిత్వమునకు నియమశృంఖల లేదు.

'ముక్తావళి' యను ఖండకావ్యమున శ్రీవేదుల సత్యనారాయణశాస్త్రి 'నావలె శుష్కజీవనమునన్.....' (భారతి: సంపు ౧-సంచిక ౭-పుట ౧౪౭) అని వెల్లడించిన దుఃఖభాజనమైన యాత్మోదంతమును, 'తిక్కన' యను ఖండకావ్యమున శ్రీ పెమ్మరాజు లక్ష్మీపతి గావించిన

ఉ. మేటివిపంచి కేలఁగొని మించినశక్తి బినాకినీనదీ
వాటికలన్ గవిత్వరసవైభవముల్ వికసింప నెన్నఁడో
మీటిన భావరాగముల మేదురనాదము మారుమ్రోయు నీ
నాఁటికిఁ గూడ నాంధ్రభువనంబునఁ దిక్కకవీంద్ర! హాయిఁగన్.

చ. అలతిరుతంబు గద్గదసమాకులమై నిను బిల్చుచున్న నా
పలుకులు నిన్ను జేరక నభఃస్థలి లీనములైన నౌను గా
క లఘుగుణాఢ్య! జిహ్వాతనియన్ నిను బిల్చి త్వదీయరూపమే
దలఁచెద డెందమం దిఁకఁ గృతార్థుఁడనయ్యెద వేయునేటికిన్.

ఇత్యాది మహాకవిస్తోత్రమును ఆంధ్రసారస్వతమున లిరిక్కవిత్వమున కుత్కృష్టనిదర్శనములు.

### ప్రాకృతజనులజీవితము

ప్రాచీనాంధ్రకవులు మహారాజులకథలనే కాని సామాన్యుల కథలను కావ్యసామగ్రులుగా గ్రహింపలేదు.

వారు రాజాశ్రయులు. అట్లగుట వారి భావప్రపంచమున నంతఃపురసంవాసితులైన రాజదంపతుల విరహాగ్నికే కాని పల్లెటూరి పాటకపుజనుల నిసర్గరమ్యప్రణయజీవితములకుఁ జోటులేకపోయినది. వారు 'పల్లెటూరితొయ్యలుల నిసర్గరమ్యదరహాసవిలోకనచేష్టలందు గుబుల్కొను నిష్కలుషపు గ్రామ్యజీవనపుఁ గమ్మఁదనంబు' గ్రహింపలేకపోయిరి. 'రాచోరింటికైనా రంగూ తెచ్చే పిల్ల' లు ప్రాకృతజనులలో

నుందురని వారు కలలోనైన నూహింపలేదు.

నవీనాంధ్రకవుల కట్లు కాదు——

ప్రేమకురియించు మోహనరాగాలాపములు గావించెడి కాపుపడుచు కలికివలపు విద్యావంతులగు నవీనాంధ్రకవుల 'విరజాజిబజారు'లోని సరిక్రొత్త సరకు.

ఈ తరగతి కవిత్వమును బెంపొందించు రసికావతంసములలో శ్రీ నండూరి వేంకటసుబ్బారావు మేటి. ప్రణయస్వరూపిణియగు యెంకిద్వారా ప్రాకృతజనుల సాంసారికపు ముచ్చటలను అనువగు కవితాసంభారములతో మేళవించి భోగ్యద్రవ్యముగా నొనర్చిన యీ కవిప్రతిభకు 'అంజలిసేయక తీర దేరికిన్.'

ప్రాకృతజనుల సాంసారికపు ముచ్చటలు భోగ్యద్రవ్యముగా నొనర్చిన ప్రతిభయే కాక వానికి శిష్టత్వ మాపాదించి సభాపూజ్యతఁ గొనితెచ్చిన గౌరవముకూడ సుబ్బారావుకే చెందును.

'యెంకిపాటల'లోని శ్లాఘ్యమైన మఱియొక విశేషము:

హిందూదేశము కర్మభూమి; జ్ఞానభూమి. అందుఁ బుట్టువుఁగన్న విద్యాగంధహీనుఁడగు కడజాతివానినుండి 'తపస్స్వాధ్యాయనిరతుఁ'డగు మునీశ్వరుని వఱకుఁగల ప్రతివానికిని బూర్వోత్తరజన్మజిజ్ఞాస తల్లిపాలనాఁటినుండి యుండునదే.

హిందూదేశౌన్నత్యము కలకాలము చిరస్థాయియై యుండుటకు వేరుదుంప యనఁదగిన దీవిజ్ఞానము. అది భారతీయుల కెల్లరకు ఉమ్మడిసొమ్ము.

కావుననే నాయుఁడుబావయు

'యెనకజల్మములోన యెవరమో' యంటి
సిగ్గొచ్చి నవ్వింది సిలక నా యెంకి!

'ముందు మనకేజల్మ ముందోలె' యంటి
తెలతెల్లపోయింది పిల్ల నాయెంకి!

అని నివేదించుచున్నాఁడు.

ప్రాకృతజనుల జీవితవిశేషములను వర్ణించుటలో విశేష వ్యాసంగము చేయుచున్న ఆధునికాంధ్రకవులలో శ్రీ కవికొండల వేంకటరావు అగ్రిసరుఁడు. ఆతని భావమంజులమగు కైతను ఆధునికాంధ్రలోకము ఇంకను లెస్సగ ఆకళింపలేదు. ఆకళింపనే లేదనుచుండగా ఆధునికాంధ్రలోకము వార్తగల అతని కవితను అనుభవించి ఆనందింపనేరకున్నదని వేఱ చెప్పనక్కఱ లేదు. ఇట్లు ఆనందింపలేకపోవుటకుఁ గారణమేమి? అతని భావవాహిక తెలియని తెన్నులఁబడి సాగుచుండుటచేతనా? నవ్యభావవర్ణనమునకు అంతగా ఒదుగని ప్రాచీనవృత్తములను దిగనాడి నూతనఛందముల సృష్టింప నావేదనపడుచున్న వేంకటరావు విశేషకృషి శ్లాఘనీయమే కాని ఆతని నూతన ఛందములఁ బఠింపవలసిన ధోరణి పలువురకుఁ దెలియకున్నది.

## గోపకావ్యములు

గోపకావ్యము (Pastorals) లనఁబడు నొకతరగతి కావ్యములు ఆంగ్లసారస్వతిసంపర్కమువలన మన వాఙ్మయము లోనికి దిగుమతినొందుచున్నవి.

గోపకావ్యనిర్మాత యనఁదగిన థియోక్రిటసు (Theocritus) శాద్వలస్థలములు, నదీతీరవిహారములు, పామరజన వ్యవహారములు- ఇత్యాది విషయముల వర్ణించెను. కాలక్రమమున కవులు గోపకావ్యములను మతసాంఘికసారస్వత రాజకీయాది విషయములపై తమ అభిప్రాయముల వ్యక్తీకరించుట కుపయోగించిరి.

భాగవతములోని గోపాలకృష్ణుని వనవిహారవర్ణన మీ తరగతి సారస్వత మనవచ్చును. ఇంతికుమించి మనలోఁ బ్రాచీన గోపకావ్యములు ప్రత్యేకించి లేవు. ఇప్పుడిప్పుడు ఆంగ్ల సారస్వత సాహచర్యమువలనఁ గొలఁదిగ బయలుదేరుచున్నవి.

శ్రీ దువ్వూరి రామిరెడ్డి 'వనకుమారి' తెనుఁగులోని గోపకావ్యములలోఁ జేర్పఁదగినది. ఇందు గోపకావ్య సంప్రదాయము లన్నియు సమకూరినవి.

కథానాయిక యగు 'వనకుమారి' గొఱ్ఱెల కాచు కొనుచు

'సీ. కొండనెత్తమ్ములఁ గోరాడు మబ్బుల
గమనసౌందర్యంబుఁ గాంచి కాంచి;
మేఘోదయంబున మినమినఁ బురివిచ్చి
యాడు నెమ్మలయొప్పు లరసి యరసి;
యమృతధారలరీతి నచ్ఛమై ప్రవహించు
సెలయేళ్ళలోఁ గ్రీడ సలిపి సలిపి;
ప్రకృతిమంజులమైన పక్షుల గానంబుఁ
దమిదీఱ వీనులఁ ద్రావి ద్రావి;
గీ. యెండవేళలఁ బూఁబొదరిండ్లఁ దూరి
హరిణగర్భిణులకుఁ జివురాకు లొసఁగి
ప్రసవమాలల ధరియించి ప్రతిదినంబుఁ
గానవంబుల రాణియై గ్రాలుచుండు.'

ఇట్లు నాయికచేఁ బ్రకృతివర్ణన చేయించుటయే కాక రామిరెడ్డి నాయకునిచే నంతఃపురజీవితము, పరలోకవృత్తాంతము మున్నగు విషయములను వర్ణింపించి లౌకికజీవితముపైఁ గల తన యభిప్రాయములను వెల్లడించెను.

కావుననే గోపకావ్యలక్షణములు 'వసుకుమారి'యందుఁ గొంతవఱకు ఏకీభావ మొందిన వనుట.

ఈ గోపకావ్యనిర్మాణమునం దాంధ్రకవులు విశేష మైన యభినివేశ మగపఱచుటలేదు.

### మృతస్మృతులు

నెనర్లైన చుట్టములుగాని, దేశారాధనతత్పరులైన మహానుభావులుగాని మరణించినపుడు కలిగిన దుఃఖావేగముచే రచింపఁబడిన శోకగీతికలు ప్రాచీనాంధ్రసారస్వతమునం దంతగాఁ గన్పట్టవు.

'సీ. ఎఱుకైనచోఁ దన మదకరీంద్రము నిల్పి
కేలూత ఇచ్చి ఎక్కించుకొనియె
మనుచరిత్రం బందుకొనువేళఁ బురమేఁగఁ
బల్లకి తన కేలఁ బట్టియెత్తె
బిరుదైన కవిగండపెండేరమున కీవె
తగుదని నాఁగుపాదమునఁ దొడిగెఁ
గోకట గ్రామాద్యనేకాగ్రహారము
లడిగిన సీమలయందు నిచ్చె
'నాంధ్రకవితాపితామహ! యల్లసాని
పెద్దన కవీంద్ర!' యని నన్నుఁ బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేఁగలేక
బ్రదికియున్నాఁడ జీవచ్ఛవంబ నగుచు.'

అని పెద్దన్న చెప్పిన చాటుపద్యము ప్రాచీనాంధ్రసారస్వతమునఁ గల శోకగీతములలో నొకటి.

ఈ కాలమున నిట్టి మృతస్మృతుల రచనము విస్తృతిఁ జెందుచున్నది.

సుతస్మృతులు, మిత్రస్మృతులు, పేరుప్రతిష్ఠలుగల పురుషులు మరణించినపుడెల్ల పత్రికలలో మనము గాంచు స్మరణగీతములు మొదలైనవి శోకగీతికావాఙ్మయమును పెంచు చున్నవి; కాని సారవంతము చేయుటలేదు.

శోకగీతములను- ఆత్మీయులు మరణించినపుడు చెప్పునవి, మహాపురుషులు మరణించినపుడు చెప్పునవి అని రెండువిధము లుగా విభజింపవచ్చును.

ఆత్మీయులు మరణించినపుడు చెప్పు శోకగీతికలకు శ్లాఘ నీయమైన నిదర్శనముగా శ్రీ దువ్వూరి రామిరెడ్డి 'ప్రియా వియోగము' అను ఖండకావ్యము ('భారతి: సంపు ౨-సంచిక ౯- పుట ౨౮:౨౯) చేకొననగును.

మహాపురుషుల మృతస్మృతులకు నిదర్శనముగా శ్రీ నిడ మర్తి సత్యనారాయణమూర్తి 'దామెర్ల రామారాయస్మర ణము' అను క్రిందిగీతమును చేకొననగును.

'తూర్పు దిక్కున కాంతికిరణము
మార్పు దెచ్చెను గగనతలమున
తీర్పరమ్మిక దిశల పుటలను
మాతృబింబము
తమ్ముఁడా!
ఉదయగిరి శిఖరానికపయి
బాలభానుఁడు తెలుఁగుచిత్రము
రచనచేసెను ప్రజలు మెచ్చిరి
చూడ రమ్మట
తమ్ముఁడా!
నింగి వీథుల రంగు లలరెను
భృంగరాజము లలరి పాడెడి

పొంగి పొరలెడి సంతసార్ణవ
మదియె కను మటు
తమ్ముఁడా!

ఆంధ్రదేశమునందు మొదటగ
గౌతమీవాఃకణము నందున
మొలక లెత్తెను తెలుఁగుపలుకులఁ
దియ్యదన మది;
తమ్ముఁడా!

ఆంధ్రదేశమునందు మొదటగ
గౌతమీవాఃకణము నందున
చిగురుపట్టెను చిత్రకళల ప్ర
వాళరక్తిమ
తమ్ముఁడా!

కంటకావని కమ్మతావుల
మింట బరపెడి మృదులసుమముల
జంట మెరసెను సలుప రమ్మిక
మాతృపూజల
తమ్ముఁడా!

ఆకసమ్మున వెలుగు తారలు
గతులు దప్పియు రాలుచున్నవి
కాంతిపుంజము గదలఁ జిమ్ముచుఁ
జూడుమీ యిటు
తమ్ముఁడా!

వెలుగు వెలిగెను వెఱ్ఱితారక
యేమి యెఱుఁగును రాలిపడునని

కాలకర్మము లొకటి కూడఁగఁ
దప్ప శక్యమె?
తమ్ముఁడా!
క్రూరకర్ముఁడు కాలపురుషుఁడు
చూచినంతనె మార్పు తెచ్చును
జరుగనీయఁడు జగము మెల్లఁగ
నేమి చోద్యము
తమ్ముఁడా!
విడిచివిడువని కన్నె మొగ్గల
వెడల చిదిమియు పాలకన్నీ
రొడలు ముండఁగ చూచినప్పను
చిత్రమేమిరొ
తమ్ముఁడా!
ఏది యేమయియుండునో మది
పాదుకొల్పదు హృదయమందున
నలము కొంతులె యాస్తమానమున
నలము కొనుటను,
తమ్ముఁడా!
చూచి దుఃఖము ననుభవించుట
చూడకుండుటకంటె మేలది
చూడుమీ యిటు వేడియూర్పుల
తొలఁగు కొంతుల
తమ్ముఁడా!

### మర్మకవిత్వము

మర్మకవిత్వ (Mystic Poetry)మనఁబడు ఆధ్యాత్మిక కవిత్వ మీకాలమున విస్తృతినొందుచున్నది.

నోబిలుబహుమాన మందిన రవీంద్రుని గీతాంజలిని వంగీయులకుఁ బోరుగువారైన ఆంధ్రయువకవులు ఆలించి అందలి మేలెంచి మిన్నందినారు. గీతాంజలి సాహచర్యమున తెనుఁగుకవులు జయదేవుని గీతగోవిందము, లీలాశుకుని కృష్ణకర్ణామృతము మొదలగు వైష్ణవభక్తిప్రతిపాదకములగు గ్రంథరాజములపైఁ దమ కవితాదృష్టిని బ్రసరించినారు. అందుతో భక్తుఁడు ప్రణయినీరూపమున భగవంతునిఁగొల్చునట్లు కవిసంప్రదాయము మనలో నేర్పడినది.

ఈ మర్మకవిత్వరచనమున యువకులగు నవీనాంధ్రకవులు విశేషవ్యాసంగముఁ జూపుచున్నారు. అట్టి విశేషకృషికి అమృతఫలముగా వేంకటపార్వతీశ్వరుల 'ఏకాంతసేవ' ఉదయమొందినది.

ఆధునికాంధ్రకవులు ఆంధ్రభారతికి ఉపాయనముగ నర్పించుచున్న గ్రంథరాజములలో 'ఏకాంతసేవ' ఉత్తమమైనది. ఇందుఁ బ్రణయినీప్రణయులకును, బ్రకృతిపురుషులకును, భక్తపరమేశ్వరులకును గల పవిత్రప్రణయలీల యభివర్ణితమై యున్నది.

### వేణుగానవర్ణనము

వైష్ణవభక్తిప్రతిపాదకములగు గ్రంథములను బఠించుటవలన నేఁటి యువకవులలో శ్రీకృష్ణుని వేణుగానవర్ణనము హెచ్చుమీఱినది. సంస్కారులును, సనాతనమార్గగాములును గూడ నిట్టి వర్ణనమొనర్చి ఆంధ్రకవితాసతిచేత గుడుగుడుకుంచము లాడించుచున్నారు. ఇఁకనైన నిట్టిది విరమించుట మంచిపని.

## జాతీయభావము

నేఁటి తెనుఁగుకవులలో జాతీయభావము పెల్లుబ్బి వెల్లువయై ప్రవహించుచున్నది.

నవీనాంధ్రకవులలో కొందఱు స్వదేశీయోద్యమాంధ్రోద్యమములచే నుత్సాహతరంగితులై కవన మల్లుచున్నారు. అట్టిచో వారి కవనములందు సమకాలీనమైన ఉత్సాహబీజములు అప్రయత్నముగనైన ఉరణింపక మానవు.

'ఆంధ్రావళి మోదముంబొరయు' గ్రంథరచనోద్యుక్తుండైన తిక్కనకూడ ఆంధ్రకీర్తిని ప్రత్యేకించి సంకీర్తనము చేయలేదు.

కాకతీయాంధ్రచక్రవర్తి ప్రతాపరుద్రుఁడు ముష్కరు యవనవీరులను తెలుఁగుమాగాణినుండి తఱిమివైచిన ఆ విజయలక్ష్మీప్రసాదాంకవిభవదినములలో నాఁటి తెనుఁగు కవులయందు జాతీయభావము పాలసముద్రమువలె పొంగిపొరల వలసినది. కాని ప్రాచీనాంధ్రకవులలో జాతీయభావము అంతగా లేదనవలసి యున్నది.

'లోకమంతయుఁ గాఁకవెట్టిన' ఆనాఁటి 'కాకతీయుల కదనపాండితి'ని 'చీకిపోవని చేవపాటలలో' నిరువదియవ శతాబ్దిలోనున్న శ్రీరాయప్రోలు సుబ్బారావు ప్రస్తావించెనే కాని సమకాలికు లందఱును మూఁగలై యుండిరి.

ఇవి జాతీయపునరుద్ధారణదీక్షాదినములు.

'ఉ. జారిన దేశగౌరవముఁ జక్కనఁ దిద్ది, మహాంధ్రమండలీ
భారము శ్లాఘనీయముగఁ బాలనఁజేసి, సమానరాష్ట్రముల్
కూరిమి నాసఁజేయ, తెలుఁగుం బుడమిన్ గయిసేసి...'

—రాయప్రోలు సుబ్బారావు

ఔన్నత్యశిఖరమునకుఁ గొంపోవలయునను దీక్షతో దేశారాధకులగు కవులు

'సీ. తనగీతి యఖిలజాతిని పాటకులనుగా
దిద్ది తీర్చిన తెనుఁగువాణి
తన పోటులు విరోధితండంబులకు సహిం
పనివిగా మెరసిన తెనుఁగుకత్తి
తన యందములు ప్రాంతజనుల కభిరుచి వా
సన నేర్ప నలరిన తెనుఁగురేఖ
తనవేణికలు వసుంధరను సస్యశ్యామ
లనుజేయఁ జెలఁగిన తెనుఁగుభూమి

గీ. అస్మదార్ద్రమనోవీథి నావహింప
జ్ఞప్తి కలయించుచున్నాఁడ చావలేదు
చావలేదు ఆంధ్రుల మహోజ్జ్వలచరిత్ర
హృదయములు చీల్చి చదువుఁ డోసదయులార!'

—రాయప్రోలు సుబ్బారావు

అని ప్రాక్తనవైభవ పునశ్స్మరణము చేయుచున్నారు. రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, శేషాద్రి రమణకవులు మొదలైనవారు జాతీయభావసముద్దీపితములగు కావ్యముల గొన్నిటిని రచించుచు ఆంధ్రకీర్తి సంకీర్తనము చేయుచున్నారు.

ప్రత్యేకమైన ఆంధ్రజాతీయాభిమానమే కాక నవీనాంధ్రకవులలో సాముదాయకమైన భారతజాతీయాభిమానముకూడ వెల్లివిరియుచున్నది. శ్రీ నండూరి బంగారయ్య

'రక్షరా! శ్రీరామ రక్షరా! తండ్రి
మాతృభూమికి గాను మహితాత్ముఁడగుచు

తన ప్రాణములనెల్ల ధారగా నిడిన
మీ తాత తపనుచే మీకు రక్షణలు
దిక్కుమాలిన తల్లి దీనతను బాపఁ
బద్ధకంకణుఁడైన ప్రభువగు గాంధి
సత్య సంకల్పంబె సంరక్ష నీకు.
ఆత్మీయదేశార్థ మఖిలంబు నిచ్చి
పశువులసాలలో వసియించుచుండి
సుకుమారదేహంబు స్రుక్కిపోవంగ
కాటికిఁ గాళ్ళను కడఁజాచుకొన్న
కడువృద్ధు డయ్యును నెఱజవ్వనాన
చెఱసాల వాసంబు చేపట్టినట్టి
నెహ్రూ మహాత్ముని త్యాగసంసిద్ధి
నీకన్న డబ్బునో నా చిన్నికూన!
నీతండ్రి మార్గంబు నీకు బోధించి
గాంధిమానికి నిన్ను కరమప్పగించి
నీదేశభక్తియు నీవర్తనంబు
నేఁజూచి ధన్యనౌ నిముసంబుకొఱకు
వేచియుంటిని సుమ్మి వెఱ్ఱినాతండ్రి!
ఆంధ్రజాతీయుల యాత్మగౌరవము
భారతీయులయొక్క భావిభాగ్యంబు
నీచేత నున్నవి నా చిన్నిబాబు!

అను రచన మిందు కుదాహరణము.

ఇందులో నొక విశేషము:

కవి సమకాలీనమైన చారిత్రకాంశములను కావ్యవస్తువులుగా స్వీకరించియున్నాఁడు.

ప్రబంధకవులు కృతిపతి నభినందించు ఘట్టమునఁ దప్ప మిగిలిన తావుల సమకాలికాంశములను గ్రంథస్థ మొనర్ప లేదు.

సమకాలికాంశములను గావ్యసామగ్రులుగా నంగీకరించు నాచారము నవీనులలోమాత్రమే యెందుకొన్నది. నవీనాంధ్ర కవులందుఁ జూపట్టు జాతీయభావవిజృంభణమే ఇట్టి ఆచార స్వీకరణమునకు ముఖ్యకారణము.

చిన్నికథలు

పూర్వాంధ్రకవులు ప్రత్యేకించి చిన్నికథలను రచింప లేదు.

మహాకావ్యసృష్టిలో నెడనెడఁ బొడతెంచు ఉపాఖ్యానములు వారికి ఏదేని ఒకవిషయమును సమర్థించుటకో, లేక ఏదేని ఒకనీతిని ఉపదేశించుటకో కొనితేఁబడిన అప్రధానవిషయములు.

నవీనాంధ్రకవులు పెక్కురు ఖండకావ్యరచయితలు గావున స్వల్పేతివృత్తముల నెత్తికొని వానికిఁ దగిన ఎత్తుగడ, నిర్వహణము, సమాప్తి హత్తించి చిన్నికథలు విరచించుచున్నారు.

నేఁటి ఖండకావ్యములలో నేదే నొకభావముకాని, అవస్థకాని ఉల్లేఖింపఁబడి, మథింపఁబడి, పరామర్శింపఁబడునట్లే నేఁటి చిన్నకథలలో నేదే నొక సాంఘికదురాచారముకాని, చిత్తవిభ్రమముగొల్పు విచిత్రసంఘటనముకాని ప్రస్తరింపఁబడును.

నిదర్శనముగా చిర్రావూరి కామేశ్వరరావు 'ఏకాంత ప్రేమ', 'వేంకటపార్వతీశ్వరుల 'జలజమాలిక', అబ్బూరి రామకృష్ణారావు 'మల్లికాంబ' చేకొననగును.

## వృత్తములు

ఈ కాలమున వృత్తరచనము వెనుకపాటు నొందినదని చెప్పవచ్చును.

వేంకటపార్వతీశ్వరకవులు వెలయించిన తేటగీతముల సమ్మోహనమే ఇందులకు ముఖ్యకారణము.

ప్రబంధవాసన పట్టనీయక వృత్తములను నవ్యసంప్రదాయముతో నడపించు యువకవులు కొందఱున్నారు. వారిలో రాయప్రోలు సుబ్బారావు, దువ్వూరి రామిరెడ్డి, వేదుల సత్యనారాయణశాస్త్రి, పెమ్మరాజు లక్ష్మీపతి మొదలగువారు ముఖ్యులు.

ఇందుఁ బెమ్మరాజు లక్ష్మీపతి వృత్తములలోఁ జూపు లిరిక్కు అందము అసాధారణముగా నున్నది.

## బాలవాఙ్మయము

బాలబాలికాలీలలు విరివిగ వర్ణించుటకు, వారికొఱకై ప్రత్యేకించి వాఙ్మయము సృష్టించుటకు ఇక్కాలమున సత్ప్రయత్నము జరుగుచున్నది.

ఇందు బాలబాలికాలీలలు విరివిగ వర్ణించు సారస్వతమునకు నిదర్శనముగా 'అమ్మణ్ణి' అను శీర్షికగల

గంధము మెడకూ పూసుకొని
పసుపు కుంకుం రాసుకొని
కంటికి కాటుక పెట్టుకొని
ఆడవె ఆడవె అమ్మణ్ణీ !

జడలో పువ్వులు తురుముకొని
తిలకము నుదుటా దిద్దుకొని
బుగ్గను చుక్కా పెట్టుకొని
ఆడవె ఆడవె అమ్మణ్ణీ !

కాళ్ళకు గజ్జెలు కట్టుకొని
చేతికి గొలుసులు పెట్టుకొని
దండలు మెడలో వేసుకొని
ఆడవె ఆడవె అమ్మణ్ణీ !
నోట్లో బూరా పెట్టుకొని
చేత్తో ఢక్కా పట్టుకొని
పూవుల చొక్కా తొడుక్కొని
ఆడవె ఆడవె అమ్మణ్ణీ !
గాజుల చేతులు తట్టుతును
బోసినవ్వులూ నవ్వుతును
చిటపటఅడుగులు తొక్కుతును
ఆడవె ఆడవె అమ్మణ్ణీ !
ముద్దులు కులికే నీ ఆట
త్రిభువనమోహనకరమమ్మా !
సూర్యచంద్రులూ ఉండేదాకా
ఆడవె ఆడవె అమ్మణ్ణీ !

అను శ్రీ చింతా దీక్షితులు రచనము స్వీకరింపనగును.

ఇఁక బాలబాలికలకుఁ బ్రత్యేకముగ సృజింపఁబడు వాఙ్మయమునకు ఉదాహరణముగ 'దొంగాట' అను శీర్షికగల

ఉత్తుత్తి పళ్ళు
ఉత్రాణీ పళ్ళు
నేరేడీ పళ్ళు
నిమ్మా పళ్ళు
కోడి పిల్లల్లార! దొంగైన పిల్ల
తన మొగుడి పేరేమొ తానె చెప్పాలి !

ఉత్తుత్తీ పళ్ళు-ఉత్రాణీపళ్ళు
నేరేడీ పళ్ళు-నిమ్మా పళ్ళు. (లలితదొంగ)

ముద్దులలితా! నీమొగుడి పేరేమి?
నామొగుడి పేరొచ్చి నారింజపండు!

ఉత్తుత్తీ పళ్ళు-ఉత్రాణీ పళ్ళు
నేరేడీ పళ్ళు-నిమ్మా పళ్ళు. (రమణమ్మదొంగ)

చిట్టిరమణా! నీ చెల్వు పేరేమి?
నాచెల్వ పేరొచ్చి-నే చెప్పనమ్మ!
చెప్పవా? దొంగైతె తప్పదో యమ్మ!
నాచెల్వ పేరైతె నాచిట్టిమొగుడు!

ఉత్తుత్తీ పళ్లు-ఉత్రాణీ పళ్లు
నేరేడీ పళ్లు-నిమ్మా పళ్లు. (అన్నపూర్ణదొంగ)

అన్నపూర్ణా! నీ చిన్ని మొగుడెవడే?
నాచిన్ని మొగుడొచ్చి ఆ చందమామ!

ఉత్తుత్తీ పళ్లు-ఉత్రాణీ పళ్లు
నేరేడీ పళ్లు-నిమ్మా పళ్లు. (సీతమ్మదొంగ)

సొగసు సీతా! నీమొగుడి పేరేమి?
పాలసంద్రమ్మీది బాలకృష్ణుండు

అను శ్రీ అధికార్ల సూర్యనారాయణరావు రచనము చేకొననగును. శ్రీ మునిమాణిక్యము నరసింహారావు 'కాకమ్మ' అను రచనముకూడ నీతరగతికే చెందును.

## ప్రేమ

ప్రబంధములలో వర్ణితమైన ప్రేమ 'పూతపసిండి' వంటిది. ఇప్పుడు పెక్కురు యువకవుల లేఖినినుండి జాలువాఱు ప్రేమ విశుద్ధమైనది. అది హృదయగతమైనది.

'ప్రణయతపస్సు' లోని నాయికను గమనింపుఁడు:

ఉ. చిత్తములోని ప్రేమరసశీకరము ల్పయిఁ జిల్కరింప రే
కెత్తిన భావపుష్పముల జేర్చి, హృదీప్సితమాలగూర్చి యా
యుత్తమునైతి వీవు హృదయాధిపు కంఠ మలంకరింపఁగా
నిత్తరికైన రాఁడు హృదయేశ్వరుఁ డో ప్రణయైకజీవనీ!

—పెమ్మరాజు రాజగోపాలము

హృదయోద్గారితమగు నిట్టి విశుద్ధప్రేమ వర్ణింపఁబడు ఈ నాగరికయుగమునఁగూడఁ గేవలము ప్రబంధధోరణిలోఁ గాముకప్రేమ వర్ణించు కవులు లేకపోలేదు. 'నిరీక్షణము' లోని భోగలాలసయగు నాయికను గాంచుఁడు:

చ. కురులను దువ్వి పూల్ముడిచి, గొజ్జగిపూవుల శెమెరుంగుటం
బరము ధరించి, గంధకలపంబుల మేన నలంది, కమ్మక
స్తూరి తిలకంబు కన్నుదుట సొంపుగ దిద్ది, సువర్ణభూషణో
త్కరములదాల్చి, నీకొరకు, ద్వారముఖంబున, నిల్చియుండితిన్.

ఉ. విచ్చినయట్టి బండిగురువిందపువుల్ గొనితెచ్చి, మాలికల్
గ్రుచ్చితి, పూలకన్న నతికోమలమైన భవచ్ఛరీరమే
నొచ్చునొయంచు, చక్కఁగ కనుంగొని విచ్చిన బొండుమల్లెలన్
దెచ్చియె పాన్పుపై పరచితిన్ సకలంబును సిద్ధబెట్టితిన్.

—వేదుల సత్యనారాయణశాస్త్రి

## ఉపసంహారము

అభినవాంధ్ర కవితారథ మిట్లు హుటాహుటినడలతో నూతనజీవలావణ్యకళ్యాణపథములఁ బఱతెంచుచున్నది.

# 3

# ఆంధ్ర సారస్వతము - హాస్యరసము

నవ్వు జనింపఁజేయునది హాస్యము. అది ఆనందప్రదము. ఆనంద మారోగ్యదాయకము. హాస్యము నవరసములలో నొకటి.

అపారమగు ఆంధ్రసారస్వతమున ఈ రసము చాలఁ గొలఁది. మృగ్యమని చెప్పుటకూడ సాహసముకాదేమో!

శృంగారరస మేమిపుణ్య మొనరించెనో కాని ఆంధ్రకవి పుంగవులచే నదిగన్న మన్ననలో సహస్రాంశమైన మిగిలిన రసములు నోఁచియుండలేదు. మన సారస్వతమున నున్నంత పిచ్చిగాఁ బచ్చిగా సుకుమారశృంగారప్రబంధములు మఱియే సారస్వతమున నుండవు.

ముచ్చటకుఁగాని, మచ్చునకుఁగాని కన్నుపొడుచుకొని చూచెదమన్నను ఆంధ్రవాఙ్మయమున కేవల హాస్యరసప్రధానమైన గ్రంథ మొక్కటియుఁ బ్రబంధయుగమందుఁ బొడసూపలేదు. ఆంధ్రకవితల్లజుల కెల్లరకు శృంగారరసస్రవంతిలో 'మునుఁగానాం, తేలానాం'తో సరిపోయినది, పుణ్యకాలము కాస్తయు.

చిల్లపెంకులలోఁ జింతామణు లన్వేషింపదొరకొనినట్లు ఆంధ్రప్రబంధములం దౌషధప్రాయముగనైన హాస్యరస మువలబ్ధమగునేమో తడుముకొందము.

భారతము నవరససంపోషిత మనికదా పండితనిర్వచ

నము. అట్టి భారతమునందు సయితము గాలించిచూచిననే ఒక్కటిరెండు తావుల తప్పిజాతి హాస్యముండినట్లు గుర్తింప నగును.

ప్రథమాంధ్ర కవిగ్రామణియగు నన్నయభట్టారకుఁడు హృద్యమగు హాస్య మక్కడక్కడ చిలుకరించియున్నాఁడు. ఈతని హాస్యము చదివినవెంటనే మనమునకుఁ దట్టినను కడుపు చెక్కలుచేయునంత అతికాక సరళమును, సరసమును ఐ చిఱునవ్వుఁ బుట్టించునదిగా నుండును.

'నలుని కలకించితిరా?' యని సార్థవాహులను దమ యంతి ప్రశ్నింపఁగా వారు:

క. నలుఁ గాన మిద్వనంబున
గల వెప్పుడు గాంతు ముగ్రకరులను సింహం
బుల ఋక్షంబుల నిదిమ
ర్త్యుల కవిషయ మాతపంబు దూఱదు దీనిన్.

—అరణ్యపర్వము

అని చెప్పిరనుటలో నెంతటి చమత్కారహాస్యము!

అర్జునుఁడు ద్రుపదరాజును గట్టి తన కాళ్ళముందర నుంచ, ద్రోణుఁడు ఆతనిఁ గాంచి

క. వీ రెవ్వరయ్య, ద్రుపద మ
హా రాజులె? యిట్లు కృపణులయి పట్టువడన్
వీరికి వలసెనె? యహహా! మ
హారాజ్యమదాంధకార మది వాసె నొకో!

—ఆదిపర్వము

అని మొగము తగులబెట్టినట్లు చేసిన దెప్పిపొడుపులు చదువరుల కెంతయైన ఆనందము సంపాదించును.

కవిబ్రహ్మయగు తిక్కనసోమయాజి హాస్యరసపరిపోషణము లెస్సగాఁ జేయలేదని నాతలంపు. ఉత్తర గోగ్రహణ వర్ణనాసందర్భమున ఈ రసప్రయోగమున కెంతయేని అవకాశము కలదు. కాని ఈఘట్టమున తిక్కకవి నిజమైన హాస్యరసనిష్పత్తి కలిగింపలేకపోయినాఁడు.

నాచన సోమనాథుఁడు సరసహాస్యప్రయోగమున దిట్ట. నారదునకుఁ 'గయ్యమన్న సంభావనఁగిన్నరీతి'నుండునని వర్ణించియున్నాఁడు. ఇట్టి లలితహాస్యము మనగ్రంథములం దుండుట అరుదు.

ఈ యుగపువాఁడే యగు గౌరనమంత్రి హరిశ్చంద్రోపాఖ్యానమందలి కాలకౌశిక వీరబాహు వర్ణనలో మనోరంజకమగు హాస్యము కలదు. ఈ కవి నవనాథచరిత్రయందును ఈ రసమును రమ్యముగా పోషించియున్నాఁడు.

ఈనాఁటి కవులలో శ్రీనాథుఁడు మేలుచేయి హాస్యరసప్రయోగమునకు. జామాతయగు శివునిపైఁ గోపము పెట్టి యాతని విశేషగుణములను హిమవంతుఁడెట్లుగాఁ దీసికొనెనో చమత్కారముగా వర్ణింపఁబడినది. పరికింపుఁడు:

సీ. తలమీఁది చదలేటి దరిమీలఁదినజేరు
కొఁగలు చెలఁగి కొంగొంగు రనఁగ
మెడఁదన్ను పునుకల నిదుపేరు లొండొంటిఁ
బోరిఁబోరిఁ దాఁకి బొన్ బొణుగురనఁగఁ
గట్టిన పులితోలు కడకొంగు పోఁకి యూఁ
బోతు తత్తడి చిబ్బుబుబ్బు మనఁగఁ
గడియంపుఁ బాములు కకపాలలో నున్న
భూతి మైఁ జిలికిన బుస్సురనఁగ

తే. దమ్మి పూఁజూలి పునుకకంచమ్ము సాఁచి
దిట్టతనమున బిచ్చము 'దేహి' యనుచు
వాడవాడల భిక్షించు కూడుగాని
యిట్టి దివ్యాన్నములు మెచ్చు? వుండు.

—హరవిలాసము

వినువుచేఁ గల్గిన ఈ విరోధభావములు పాఠకులకుఁ గొంతవైన నవ్వుఁ బుట్టింపఁజేయును.

శ్రీనాథుని మఱియొక గ్రంథములో వర్ణనసమయమందు జరిగిన ఈ చమత్కారమును జూడుఁడు:

తే. ఓమె యేమి యిదేమేమె లేమయేమె
మేఘపుష్పంబు దేఠంచు మేలమాడ
మేమె మేమేలు దఱచయ్యె మేలు మేలు
'మేఁక మేఁక'న సభవారు మిగుల నగిరి.

—శృంగారనైషధము

శ్రీనాథునిది రుచికరమగు హాస్యము సరళహాస్యరస ప్రయోగమున శ్రీనాథుఁడు చతురుఁడు. ఈతని గ్రంథములందు హాస్యము చిప్పిలు పద్యములు తెఱచు. చాటువులందును శ్రీనాథుఁడు చక్కని హాస్యమును నవదరించియున్నాఁడు.

భారతిమండలి ఉత్తరకుమారప్రజ్ఞలు తిలకించి- అనుకరించి పల్నాటివీరచరిత్రమునందు శ్రీనాథుఁడు తంబళకొమ్మయ్య డచ్చీలు చొప్పించినాఁడు. కాని యవి శ్రీనాథునకు హాస్యరసప్రయోగకుశలత్వమునం దావగింజంతయు అధికకీర్తిగౌరవములు దేనేరవు సరికదా మీఁదుమిక్కిలి ఆతనికున్న కుశలత్వప్రతిష్ఠనే కుంచించునంతి అసభ్యములుగనున్నవి.

శ్రీనాథునిదని అనుమానాస్పదముగు ప్రతీతిగల 'క్రీడాభిరామ' రూపకమందలి హాస్యము తరచినకొలఁదిని ఆభాస పాత్రముగ నున్నది.

ఏది ఎటులున్నను- గ్రుడ్డిలో మెల్ల మేలనునట్లు- చమత్కారహాస్యరసప్రయోగమునందు శ్రీనాథుఁ డాంధ్రప్రబంధ కవిసార్వభౌముఁడే. సరససరళహాస్యమున కీతని గ్రంథములందును, చాటువులందును ఉపలబ్ధములగు నన్ని ఉదాహరణములు మఱి యే ఆంధ్రకవి గ్రంథములందును అనుపలభ్యములనుట సత్యమునకుఁ గాసంతయు దూరము కాదు.

శ్రీనాథుని యనంతరమునుండి ప్రబంధములు జడవాఱి ఓరీపాతమువలె నెడతెఱపి లేకుండ వర్షించినవి. ఈ ప్రబంధములందు హాస్యము 'కొత్తిమిరిప్రాయముగ'నైన లేదు.

ఆంధ్రలోకమున అంధపరంపరగా తెనాలి రామలింగని గూర్చి హాస్యకథలు పెక్కు జనాదరణము వడసి విశేషవ్యాప్తిలోనున్నవి. రామలింగఁడు హాస్యకవిజాణయని జనశ్రుతియే కాని ఆతని 'పాండురంగమాహాత్మ్యము'లోఁ బ్రౌఢకవిత్వమే కాని కేవల హాస్యరసప్రధానములగు పద్యములు చమత్కారము లేనివారికైనను గానరావు

దూష్యశృంగారము చిప్పిలు పద్యములన్నియు శ్రీనాథుని మెడఁగట్టుట ఆంధ్రకవిపండితులకు వృద్ధాచారమైనట్లే మోటుసరసమును, ముతుక హాస్యమును గల కథలు తెనాలి రామలింగనికి ముడిపెట్టుట ఆంధ్రకవిపండితులకు అనుస్యూతాచారమై ఉన్నదని నా నిశ్చితాభిప్రాయము.

'పాండురంగమాహాత్మ్యము'లోని 'నిగమశర్మ మెత్తుగడలు' మందహాసజనకములని రామలింగని వెనుక వేసికొని

వచ్చి కొందఱు సర్దుబాటుగా చెప్పవచ్చును. హాస్యకవితా ధురంధరుఁడని ఆంధ్రప్రపంచమున అపారయశముగాంచిన తెనాలి రామలింగనికి 'నిగమశర్మ యెత్తుగడలు' హాస్యరస పోషణవిషయమున పిసరంతైన యశోగౌరవము లాపాదింప వని అట్టివారికి నా చేయుమనవి. 'నిగమశర్మ యెత్తుగడ'లలో నిజమైన హాసనము మఱుఁగుపడియే యున్నది.

ప్రౌఢకవి మల్లన 'రుక్మాంగదచరిత్ర'లో సంభావన బ్రాహ్మణులకు వికారనామము లొసంగి తక్కువరకపు హాస్యము వాడియున్నాఁడు.

'నిరంకుశోపాఖ్యాన' మను ప్రబంధము రచించిన కందుకూరి రుద్రకవి హృదయంగమమగు హాస్యము పోషించి యున్నాఁడు. పరికింపుఁడు:

చ. కలశపయోధిమీఁదఁ దరఁగల్ మఱి హోయనిమ్రోయ వేయుభం
గుల తలపాన్పు పాము బుసకొట్టఁగ నేగతి నిద్రచెందెదో
యలసతఁ దండ్రి! చీమ చిటుకన్నను నిద్దుర రాదు మాకు నో
బలవదరీ దరీ కుహరభాస్వదరీ యదరీ దరీ హరీ!

—శతకము

'చీమ చిటుక్కుమనిన మాకు నిద్రరాదుగదా, అట్టి స్థితిలో క్షీరసాగరమునుండి నిరంతరము వెల్వెడలు ఉత్తుంగ తరంగమాలికల హోరులో- తలపాన్పు పాము కస్సుబుస్సు లలో నీకెట్లు సుప్తికల్గును?' యని సందేహనివారణార్థము బాలునివలెఁ గవి విష్ణుమూర్తిని అడుగుచున్నాఁడు.

ఇందలి హాసనము అనుభవైకవేద్యమే కాని విడమర్చి చెప్పఁజాలము. దేవతాపరమైన యిట్టి హాస్యము నిర్బాధక మగుట సర్వజనసమ్మతమును, సర్వవిధముల శ్లాఘాపాత్రమును,

ఈ కాలపువారగు సారంగు తమ్మయ్య, చెదలువాడ మల్లయ్య అను కవులు తమగ్రంథములందు ఉండీఉండనట్లుగా హాస్య ముపయోగించిరని చెప్పుకొని సంతోషింపవచ్చును.

కదరీపతి శుకసప్తతిలో, నారాయణకవి హంసవింశతిలో ఎడనెడ హాస్యరసపు ఛాయలు ఉన్నవి. శుకసప్తతిలోని ప్రతిబంధపుఁబేరఁటాలికథలో చక్కని హాస్యమున్నది,

ఉండుఁగాక! ఆంధ్రప్రబంధములందు హాస్యరసాన్వేషణమునకుఁ గడఁగుట ఏరుపిడకలలో హీరమణు లారయుటే అని మాత్రము అందరును అంగీకరించి తీరవలయును.

'అసలే సోమిదమ్మ, అందులో వేవిళ్ళ'ని నట్లు, ఇంత వఱకు నంజుకొనుటకైన చాలీచాలనట్లుగా నున్న హాస్యరసమునకు ఇప్పుడు మఱియొక రోగము తగిలినది.

పచ్చిబూతులే హాస్యరసపరిపోషణమునకు ముఖ్యపరికరములను దురభిప్రాయము ఈనాఁటి ఆంధ్రకవులలోఁ దాడువాఱినది. చంద్రరేఖావిలాపము; కవిచౌడప్ప, వేణుగోపాల, రామలింగేశ శతకములు చవిఁజూచినవారలకుఁ బై విషయమనుభవపునరుక్తమగును.

కుంటికి గూను తోడైనట్లు రానురాను బూతులు హాస్యరససంపోషణమునకు అవశ్యపరికరములని దురభిప్రాయపడుటయేగాక వానిని సుగుణములుగాఁ గూడఁ బరిగణించిరి,

అట్లగుటనే జగ్గకవి 'బూతులన్ బూర్ణుఁడ'వని కృతిపతి తన్నుగ్గడించిన ట్లాడంబరముగాఁ జంద్రరేఖావిలాపమునఁ జెప్పికొన్నాఁడు; బూతులబుంగయగు తన ప్రబంధమునకు సాదృశ్యముగా నేకవులును కృతిఁజెప్ప నేరరని తన్ను మిన్నగా శ్లాఘించుకొన్నాఁడు.

'హాస్యకవిజాణ' యని రఘునాథరాయల పేరోలగమం దును- 'కొంటి కోణంగి' యని ఆంధ్రపండితప్రకాండులచేతను మెండుగాఁ గొండాడఁబడుచున్న కవిచౌడప్ప ఈ సందర్భమున నేమనెనో చూడుఁడు:

క. పది నీతులు పదిబూతులు
పది శృంగారములు గల్గు పద్యములు సభం
జదివినవాఁడే యధికుఁడు
గదరప్పా కుందవరపు కవి చౌడప్పా!

క. నీతులకేమి యొకించుక
బూతాడక దొరకు నవ్వుపుట్టదు ధరలో
నీతులు బూతులు లోక
ఖ్యాతులురా కుందవరపు కవి చౌడప్పా!

బూతాడఁగూడదనువారిని దలవాఁచ చీవాట్లుపెట్టి వారినోళ్ళ నీతెఁడెట్లు నొక్కెనో చూచితిరా:

క. బూతు లెగడుదురు తమతమ
తాతలు ముత్తాత మొదలు తత్తరముల వా
కే తీరున బూతెతిఁగిరి
ఖ్యాతిగ మతి కుందవరపు కవి చౌడప్పా!

కంటిరా?

'పదిబూతులు సభలోఁ జదివినవాఁడే యధికుఁడఁట- బూతాడక నవ్వు పుట్టదఁట- బూతులు లోకఖ్యాతులఁట'- పాపము! ఇది కేవలము కాలదోషము.

నీతిబాహ్యవర్తనమునెడ సామాన్యజనులకు దోఁకు పుట్టించుట కిట్టి బూతు లావశ్యకమని వారూహించిరి కాబోలు!

ఈ రోగము మన ఆంధ్రమునకే పట్టలేదు. సంస్కృత

మునకును గల అంటురోగమే. ప్రతాపరుద్రీయమందలి హాస్య రసలక్ష్యములు తిలకించినవారికే నావచనములందలి సత్యము సకలము విదితమగును. ఇంకను అనుమానము వీడనివారు కాళిదాసప్రహసనమని నామాంతరముగల లంబోదరప్రహసన మొక్కసారి చిత్తగించిన నిజము తేటతెల్లమగును.

బూతులమాట మఱచితిమేని చంద్రరేఖావిలాపము నిజముగా హాస్యరసప్రబంధరాజము. ఇందలి హాస్యము చాల వఱకు సంఘదురాచారతిరస్కారప్రతిపాదకము.

ఈర్ష్యచేతనే యనుకొనుఁడు, జగ్గకవి యీ గ్రంథము రచియించినది. ఎట్లయిననేమి దీనిని వెల్వరించి ఆంధ్రసారస్వతమున నూతనమార్గగామి యైనాఁడతఁడు. అనుకరణము మన కవులకు గోణముకట్టుటాదిగల గుణమే యైనను ఏలకో చంద్రరేఖావిలాపమునకుఁ బ్రతిబింబములు బయలుదేఱలేదు. అది ఒకవిధముగా మన యదృష్టమే.

ముప్పదియేండ్ల అమ్మాయియగు చీపికన్నుల చంద్రి (చంద్రరేఖ) నలుబదియేండ్ల అబ్బాయియైన చిడుముపొక్కుల సింగరాజును వలచి- వలపించి- వలఁగొనుటయే ఇందలి ఇతివృత్తము.

ఇందపూర్వవిషయ మొకటి కలదు. వీరభద్రతెంబళికి నరసింగార్యనంబి వాక్రుచ్చినదఁట యీ వృత్తాంతము. ఆంధ్ర కవులు కనివిని యుండని విచిత్రమిది! దేవాలయపు టర్చకులు విధ్యుక్తవిధుల విడిచి పడుపుముచ్చట్లతోఁ గాలక్షేపము చేయుచుండిరనికదా ఇందు గర్భితమైయున్న అధిక్షేపము.

తమ కాలమునాఁటి జనతాస్థితిని గావ్యదర్పణములందుఁ బ్రతిఫలింపఁజేయుట ప్రతిభావంతులగు కవుల చమత్కారము.

ఇట్టి విషయములు మన సారస్వతమునం దరిది. మొన్న మొన్నటి బొబ్బిలిచరిత్రమునందు నారదుఁడే ఇంద్రునకు నివేదించి నట్లు రంగరాయచరిత్రమునఁ గలదు. ఇది ఎంత అసంభవముగా నుండునో పాఠకమహాశయులే యూహించుకొందురు గాక! జగ్గకవి ఈ అపూర్వవిషయప్రతిపాదనమునందు విశేష ప్రతిభాప్రాగల్భ్యముఁ జూపి సంఘదురాచారతిరస్కారము చమత్కారముగా, నాగరకముగాఁ బనివానితనముతోఁ జేసియున్నాఁడు.

కవికాలమునాఁటికే పూర్వపుఁ గట్టుబాట్లను బాసి దేశమున గౌరవమును గోల్పోయిన బ్రాహ్మణసంఘమును కవి ఒకానొక పాత్రముచే నెట్లు హాస్యజనకముగా తిట్టించినాఁడో తిలకింపుఁడు:

క. ఓంభూలు చేసికొంచును
జంభంబులు గొట్టుకొంచు జడమతి నశుభా
రంభము లరయుచుఁ దిరిగెడి
దంభపు విప్రునకు నీకుఁ దగ దిది చనుమా.

సంఘవిషయకమును, అట్లయ్యు అబాధకమును నగు నిట్టి చమత్కారహాస్యము పరిపోషించిన జగ్గకవి బుద్ధివైశద్యమసదృశము, అపారము, విశేషించి శ్లాఘాపాత్రము.

హాస్యరసపోషణమునకు బూతులే ప్రధానములని యూహించిన కవిచౌడప్ప సయితి మొక్కొక్కచోఁ బ్రసాదమైన హాస్య ముపయోగించియున్నాఁడు. మచ్చునకు:

క. అడిన మాటలు దప్పిన
గాడిద కొడుకంచుఁ దిట్టఁగా విని మదిలో

వీఁడా కొడుకని యేడ్చెను
గాడిదయును కుందవరపు కవి చౌడప్పా!

అనుదానిని చేకొననగును. ఇందలి హాస్యము మనోహరమై ఇంపునింపుచున్నది.

పిండిప్రోలు లక్ష్మణకవి మొదలగువారు శ్లేషకవిత్వము స్వార్థమునకు, శత్రుదూషణమునకు, ప్రతిపక్షతిరస్కారమునకు వాడుకొన్నట్లే అడిదము సూరకవి, కూచిమంచి తిమ్మకవి, జగ్గకవి మున్నగువారు హాస్యమును తమకుఁ గిట్టనివారలను తిట్టుటకుఁ బనిముట్టుగా నుపయోగించిరి. నిదర్శనముగా వేణుగోపాల, రామలింగేశ, కుక్కుటేశ్వర శతకములను బరిశీలింపనగును.

ఆధునికయుగమందలి హాస్యరసపరిపోషణము విమర్శింప దొరఁకొనుటకు మున్ముందు భామకలాపములు, యక్షగానములు మున్నగు వీధినాటకములందును; చాటువులందును; శతకములందును గల హాస్యము మన సందర్శనమును, విమర్శనమును వాంఛించును.

పగటి భాగవతులు అసభ్యమైన హాస్యమునకుఁ బుట్టినిండ్లు. 'గొల్లకలాపము' వినిపించు వేశ్యాంగనల వెనువెంటఁ దప్పక విదూషకుఁ డొకఁడుండును. ఇట్టి విదూషకులు చెప్పు వినోదములు సాధారణముగాఁ బచ్చిబూతులతోఁ దెప్పలు తేలుచుండును. పామరజనసమ్మతమగును గాని ఈ బూతుహాస్యము నాగరికులకు, రసికులకు అనిష్టజనకమై, హేయమై భావించుటకుఁగూడ నాభాసపాత్రమై, జుగుప్సాకరమై యుండును.

కమ్మని పప్పులో ఘాటైన పచ్చిమిరియపుఁగాయ కొఱి

కించినట్లు నిద్రాదేవికిఁ దమదేహముల ధారాదత్తముచేసి మాగన్నుఁగొన్న ప్రేక్షకులలోఁ జుఱుకు పుట్టించుటకుఁ గల్పింపఁబడియుండును ఈ హాస్యము. అగుటనేకాఁబోలు నాటకములందు హాస్యనిర్వాహణమునకై విదూషకుఁ డను ప్రత్యేక పాత్ర ననుసంధించుట.

ఇఁక చాటుధారల నెత్తికొందము:

తెలుఁగు చాటువులలో సాత్త్వికమును, సరసమును, సరళమును నగు హాస్యము చిలికి చిమ్ము పద్యరత్నములు పరశ్శతములుగా నున్నవి.

ఈక్రింది చాటుధార నారయుఁడు:

క. 'మీరుం బాగఁ ద్రాగుదురా?
వారిజభవ! వామదేవ! వైకుంఠహరీ!'
'ఓరీ! నారద! వినురా
యీరేడు జగంబులందు నిది ముఖ్యమురా!'

'మీరుగూడఁ బాగ త్రాగుదురా?' యని నారదుల వారు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను బ్రశ్నించినాఁడఁట. బ్రహ్మ మానసపుత్రుఁడు సృష్టిస్థితిలయకారుల నెంతటి ఉత్కృష్ట విషయమునుగూర్చి పృచ్ఛించినాఁడు! వా రాతనితో 'ఈరేడు జగములలోఁ బాగాకు ముఖ్య'మనిరఁట. ఔరా! ఎట్టి చమత్కారహాస్యము, ఆ రసమున కవధియో యనిపించున్న దీ పద్యము.

అసలుకు మించిన కొసరు. దిగువ కందమును కనుగొనుఁడు. శివుఁ డద్రి శయనించుటకు, విష్ణువు శేషశాయి యగుటకు, రవిచంద్రులు మింటనుంటకుఁ గారణము మీకుఁ దెలి

యునా! తెలియకున్న ఈపద్యము చదివి తెలిసికొనుఁడు. బాగు పడియెదరు.

క. శివుఁ డద్రిని శయనించుట
రవిచంద్రులు మింటనుంట రాజీవాక్షుం
డవిరళముగ శేషునిపైఁ
బవళించుట వల్లి బాధ పడలేకసుమీ!

మర్యాదకు మఱియొకటి చిత్తగింపుఁడు:

చాఁకలివానిపైఁ జమత్కారముగాఁ జెప్పఁబడిన దీ దిగువ గీతము:

ఆ. వె. చాకివానితోడ జగడాలు పడలేక
సిరిగలాఁడు పట్టుచీరఁ గట్టె
శివుఁడు తోలుగప్పె సీయాని మదిరోసి
భైరవుండు చీర పాఱవైచె.

వైద్యహాస్యమను పేర మదరాసు ప్రాచ్యలిఖితపుస్తక శాలలో గల ఒకానొక అముద్రితగ్రంథములోని క్రిందిపద్యములు చక్కని హాస్యమును పుట్టించునవిగా నున్నవి,

క. వాతం బధికంబైనను
నూతంగల నీరు దెచ్చి నూరు ఘటంబుల్
సాతతముగ జలమార్చిన
వాతంబులుగొట్టు దొడ్డవార్తలు బుట్టున్.

గీ. అర్ధసేరు సీస మమరంగఁ దెప్పించి
గరిటెలోను చమురు కాగఁబోసి
చెముడువాని బిలిచి చెవులోను బోసితే
గూబ గాలి చెముడు కుదురుచుండు.

సీ. దాహంబునకు బంటు దాడిమామిడికాయ
మేహంబునకు బంటు మిరపకాయ

వాతంబునకు బంటు తేతగుమ్మడికాయ
శ్లేష్మంబునకు బంటు చికుడుకాయ
పైత్యంబునకు బంటు పచ్చిబొబ్బరికాయ
శైత్యంబునకు బంటు చింతకాయ
రోగంబునకు బంటు తీగబచ్చలికాయ
యారోగ్యములకెల్ల నరటికాయ
గీ. శ్వాసలకు బంటు పందిరిదోసకాయ
గండుతీటకు బంటు దూలగొండికాయ
జిహ్వారోగంబులకు బంటు చెమ్మకాయ
విషములకు బంటు తొలకరిముషిణికాయ.

'తీఁటగల భాగ్యశాలికిఁ' గ్రింది కందమందలి సమాచార మనుభవపునరుక్తమే:

క. తీఁటగల భాగ్యశాలికి
నీటుఁగలుగు గోళ్లు వేఁడినీళ్లు లభింపన్
దాటించి బఱుక సాగినఁ
దీఁటయె దేవేంద్రపదవి తిరముగ జగతిన్.

ఇందలి హాస్యము నిరుపమానముగదా!

'నానాఁటికిఁ దీసికట్టు నాగంభట్లూ' అన్నసామెత చతురతగాఁ బద్యమం దిమిడ్చి ఒకచాటుకవి ఎట్లు హాసము కలుగఁజేసెనో అరయుఁడు:

క. ఏనాఁటి యగ్రహారమొ
మానాఁటికి కండ్రికాయె మాపని దీరన్
మీనాఁడు మాన్యమాయెను
నానాఁటికిఁ దీసికట్టు నాగంభట్లూ.

అబాధకములును, అతిసుకుమారసుందరములును నగు

నిట్టి హాస్యపు జాటువులు ఆంధ్రసారస్వతమున మెండుకొని యున్నవి.

శతకముల నొకటి రెండింటి మన మీసందర్భమున సమీపించి పరామర్శింపవలయును, హాస్యరసాన్వేషణపరుల మై.

మనలో విశేషప్రచారముగల 'వేణుగోపాల, కుక్కుటేశ్వర, రామలింగేశ్వర' శతకములు కొంతవఱకు ముతుక హాస్యముతో, జుగుప్సాకరములగు బూతులతో కూడియున్నవి. ఐనను ఆ శతకములలో నెడపదడప ప్రసాదహాస్యగర్భితములగు పద్యములుకూడ నున్నవి.

'మూర్ఖహృద్భయాభ్యాగతశూలమా' యన రచింపఁబడిన 'చంద్రశేఖరశతకము'నందు రుచ్యమగు హాస్యము కలదు. తమాషాకథలు గ్రామ్యభాషలోఁ జెప్పుచుఁ గవి యిందు హాస్య ముజ్జీవింపఁ జేయును. మాదిరికి నొక్కటి:

ఉ. సంగితకాడ పాడ కిక సాలిమ నీవది పాడినందుకున్
యింగితమెంచి నేను మరి యిన్నదుకున్ సరిపోయె వింటివా
అంగున నే కలూపినటి అప్పుకు తంబుర యీడ మెట్టిపో
బంగుడు బాపనాడ యని పల్కును మూర్ఖుఁడు చంద్రశేఖరా!

ఈ హాస్యమున కాధారము 'నీవు పాడినందుకు, నేను విన్నందుకు సరిపోయింది, పైఁగా నేను తల ఊఁపినందుకు తంబుఱ యిచ్చిపో' అనెడి సామెత. ఇట్టివింకను ఆ శతకమునఁ బెక్కులున్నవి.

విస్తరభీతిచే నీ విషయ మింతటితోఁ గట్టిపెట్టి ఆధునిక యుగ హాస్యరసపరిపోషణస్వభావపరీక్షణమునకుఁ గలమున కనుజ్ఞనిత్తము:

ఆధునికయుగారంభముతో నాంధ్రభాషాయోష కదృష్టపు రేఖ బయలుపడినదని జనవాక్యము. ఈ యుగమున తొలుదొల్త స్మరింపవలసినవారు వీరేశలింగముపంతులు.

ఆంధ్రభాషాపురోభివృద్ధి నాశించి సారస్వతమున నూతన మార్గముల నవలంబించి పలుత్రోవలు త్రొక్కిన పంతులు వారు సంఘదురాచారతిరస్కారప్రతిపాదక మగు హాస్యమును నెలకొల్ప నుద్యమించిరి. నూతనపథ మగుట వీరి యుద్యమ మెంతయు నభినందనీయ మైనను నిది ఆంధ్రభారతికి అంగ వికారము దెచ్చిపెట్టెనే గాని అలంకార మొడఁగూర్పలేదు. వీరి గ్రంథములలో హాస్యరసప్రధానము లైనవి ప్రహసనములు, అభాగ్యోపాఖ్యానము; సత్యరాజపూర్వదేశయాత్రలు మొదలగునవి.

వీరి ప్రహసనములు సంఘదురాచారదూషణమునకు వ్రాయఁబడినవని ఇంతకుముందే నివేదించియున్నాను. దూషింపఁబడిన దురాచారములు క్రుంగిపోయినతోడనే వీనివ్యాప్తి తగ్గును. మఱియు నిట్టివి సర్వజనామోదకములు గావు. అట్లగుట వానికి సారస్వతమున బలుకుఁబడియు, చిరస్థాయిత్వము లేదన్నమాట. స్టీలు, ఎడిసను వ్రాసిన సాంఘికవ్యాసములాంగ్లసంఘసంస్కరణాభివృద్ధి యొనర్చినంతగా వీరిగ్రంథములాంధ్రసంఘసంస్కరణ మొనర్పలేదు.

పంతులవారి 'అభాగ్యోపాఖ్యానము' బూతులు లేసి 'చంద్రరేఖావిలాపము'నకు అచ్చుబొమ్మ. ఇందు వీరు వికృతాకారములును, వికారచేష్టలును వర్ణించుటచే హాస్య ముజ్జీవింపఁ బ్రయత్నించిరి. కాని ఇది సర్వోత్కృష్టమైన హాస్యము కాదు.

సత్యరాజపూర్వదేశయాత్రలందలి హాస్యముకూడ నించుమించుగా నీ కుదుటిలోనిదే.

పంతులవారి ప్రహసనము లాదర్శములుగ నిడుకొని చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు కొన్ని ప్రహసనములు రచియించిరి. సంఘాచారములందలి విపరీతములను, వింతయైన అలవాటులను వినోదవిషయములుగా మార్చి, వెక్కిరించి సంఘదురాచారములను వెలార్చుటే వీరి ఆశయమైనను ఈ ప్రహసనములు వ్రాయఁబడునప్పటికే ప్రాఁతపడి త్రుప్పుపట్టిన సాంఘికాచారములను కెక్కిరించి వెక్కిరించుటచే నివి ఆంధ్ర జనాదరణమును అంతగాఁ బడయలేదు.

జనాదరముఁబడసినను వీరి 'వినోదము'లందు సయితము స్వతస్సిద్ధమును, నవ్యమును నగు హాస్యము యిల్ల.

వీరి నాటకములందుఁగూడ సర్వోత్కృష్టమైన హాస్యము నాస్తి. వీరి నాటకములందలి విదూషకపాత్రలు వచించు హాస్యవచనములు జనపరంపరగా ముదుసళ్ళనోళ్ళనుండి వెల్వడుచుండు సామాన్యహాస్యవచనములే. వీరి నాటకములలోఁ జతురచంద్రహాసమున కొంచెము మెఱుఁగైన హాస్యము కలదు.

రూపకములందలి వీరి హాస్యము రుచిరమును, లలితమును, నవీనమును గాకపోయినను వీరి నవలలయందు సర్వోత్కృష్టము, సర్వజనాహ్లాదకరము నగు హాస్యము తాండవించుచుండును. ఆంగ్లనవలాకారులలో పేరుమిగిలిన ఛార్లెస్సు డికెన్సువలె వీరు నవలలందు ప్రసాదమైన హాస్యమును ఎడనెడ వాడి చదువరుల డెందమున కమందానందము సంధానింతురు. వర్ణనలయందును, సంభాషణలందును హాస్యరసము మేళవించి పండితకోటిని మెప్పించుటయే నవలారంగమున వీరి ప్రతిభ.

వీరు 'హేమలత' – 'రామచంద్రవిజయము' – 'రాజ

రత్నము' లందు రుచిరము, లలితము, నవీనమునగు హాస్యరస మసదృశముగాఁ గూర్పు నేర్పుతోఁ బోషించియున్నారు. వీరి 'గణపతి' హాస్యరసమున కవధి.

సంఘవిషయములఁగూర్చి అబాధకములగు చమత్కార కావ్యములు వ్రాసిన ఆంధ్రకవులలో దాసు శ్రీరాములుగా రగ్రగణ్యులు. వీరి 'తెలుఁగునాడు' లోనిది లలితమైన హాస్యము. మచ్చునకై :

ఉ. లేవరు రెండురెండయిన లేచినవారయినం దటాలునం
 బోవరు పోవుచున్ నిలిచి 'పోదుము-పోదుము క్రోయకుం'డటం
 చీదరుసందు గోస్తు నలయింతురు పెండిలిలో సదస్యకం
 భావన నాఁడు చూడవలె బాపనపాముల సాములన్నియున్.

అనునది చేకొనఁదగును.

ఇట్టి లలితరమ్యహాస్యమున కెంతయేని తావుకలదు, ఆంధ్రసారస్వతమున.

ఈ సందర్భమున తిరుపతివేంకటకవులను మన మెన్నఁ టికిని మఱవరాదు. శ్రీనాథుని తరువాత, అతనికంటె మిన్నగా, విరివిగా హాస్యముపయోగించి ప్రబంధములు రచించినవారు ఆంధ్రకవీశ్వరులలో వీరే. శత్రుతిరస్కారమునకు హాస్యమాయుధముగ నెడపడప నుపయోగించినవారేయయ్యు వీరు పలుతావుల మనోహరహాస్యరససంపోషణ మొనర్చి ఆంధ్ర భారతికి అలంకారమును, ఆరోగ్యమును చేర్చి కూర్చినారు.

ఉదాహరణముగా రెండుమూఁడు పద్యరత్నములు చేకొననగును.

మ. ఒకయోగానికిఁ జిన్నికుఱ్ఱనికి నాయుష్కర్మ చేయించి దా
 నికిపై కాని యొసంగి 'తక్క సగమున్ దమ్మున్న' నాచేతికి

దళటా!' నాఁగను క్షౌరపుంగ్రుతికిఁ దా నంగీకృతింజొన్ప లా
భ్యకులాయమ్మగు ముద్దరాలి చరితం బాలించితే తిర్పతీ!

ఉ. గారెల పిండివంటకయి కొంతుఁడు కొంతను బృచ్ఛసేయ నా
సారసనేత్ర వ్రేలొకటి చయ్యనఁజూపి 'యిదొక్కఁడున్న దా
ధార! మటన్న నా మెతగ......

—గిరతము

శ్రీ బాలజనైకవేద్యములగు నిట్టి కథలు సంభాషణ శైలికి మిక్కిలి సమీపమగు శైలిలోఁ జెప్పి మందహాసము కల్గించుటయే వీరి ప్రతిభ. అదియే వీ రొనర్చు చమత్కారము.

ఇట్టి వినోదకథలఁ జొప్పించి హాస్య ముజ్జీవింపఁ జేయుటయే గాక 'వైదికవాదస్తము' - 'కుండలలోఁ బాండిత్యము' - 'యంత్రబ్రహ్మ' - 'కొండుభొట్లుకుఁ బరీక్షా' - 'గడే కారు' మొదలగు నవ్వుతాలిమాటలు వాడి వీరు లలిత హాస్యము పోషించియున్నారు.

ప్రబంధములలో నింత సొంపుగా, నిండుగా హాస్య ముపయోగించినవారు ఆధునికాంధ్రకవులందు మఱిలేరు.

'ప్రతాపరుద్రీయము'- 'కన్యాశుల్కము'- 'వరశుల్కము' ఈమూఁడును హాస్యరసప్రధానములగు ఆంధ్ర నాటకరాజములు. ఇవి ఆంధ్రజనాదరణము బడసినవి. అయినను వీనియందలి హాస్యము సర్వోత్కృష్టమను పాపమునకు నే నొడిఁగట్టఁజాలను.

సులభసుందరగ్రాంథికభాషనడుమ స్వైరయుక్తమగు గ్రామ్యభాషను, తురక 'కి' షష్ఠినిఁ జొన్పి మాటలాడించి నవ్వించుటయే ప్రతాపరుద్రీయమందలి హాస్యము.

తెలుఁగుముక్కలలో వచ్చీరాని ఇంగ్లీషుముక్కలు

గుచ్చెత్తి దొర్లించి పాత్రలచే మాట్లాడించి హాసప్రహాసముల జనింపఁజేయుట కన్యాశుల్కమునందలి నవ్వునకుఁ గారణము.

అరవ తెలుఁగువలన వరశుల్కనాటకమున హాస్యము పోషింపఁబడినది.

మూఁడు నాటకములలోఁగూడ హాస్యము గ్రామ్యభాషవలనను, 'నానాభాషల సంకరసోమయాజుల' కలగాపులగవుఁదెలుఁగువలనను కలుగుచున్నది. అంతియేకాని గ్రంథకర్తల రచనాసామర్థ్యముచేఁ గాని, హాస్యరసప్రవీణతచేఁ గాని, ప్రజ్ఞాచమత్కారముచేఁ గాని కల్గుటలేదని ఘంటాపథముగ వాకొని వాదింపవచ్చును.

ఆంధ్రసారస్వతమున హాస్యరసక్షేమమును బోఁద్రోలిన వారు పానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులు. హాస్యరస తారాపథమున మనకు వారు శుక్ర తార.

పంతులవారు హాస్యరసప్రయోగమున కూలంకష ప్రజ్ఞాధురీణులు. హాస్యరసమును వీరు సర్వతోముఖముగ వాడియున్నారు. ఈవిషయమున వీరు చొఱబాఱని దారులు లేవు; నాట్యముచేయని సారస్వతరంగములు లేవు; ముట్టని విషయములు లేవు. ఎత్తికొనని ప్రస్తావనలు లేవు. హాస్యరస విషయమున వా రన్నియు నుచ్ఛిష్టముగావించి వదలివేసిరనుట అత్యుక్తి కాదు.

వీరి హాస్యరసమును విభాగించి విమర్శించుట ఈచిన్ని వ్యాసమున తలకుమీఱిన పని యగును.

నవ్వు జనింపఁజేయుటకు మార్గములు తలవెంట్రుకలన్ని. అందు కొన్నిటిని చేకొని పరామర్శింతము.

గ్రంథమునందు వచ్చుపాత్రములు చేయు కార్యములచే

హాసము జనింపఁజేయుట యొకమార్గము. ఈమార్గమును వీరు 'కంఠాభరణము'- 'సరస్వతి' నాటకములందుఁ బ్రోక్కి-యున్నారు.

గ్రంథకర్త వచనరచనాచమత్కారముచే, కలగాపులగపు భాషచే నవ్వించుట వేఱొకమార్గము. ఇట్టిది వీరి గ్రంథములందు సర్వత్ర సాధారణముగాఁ గానిపించుచునే యుండును. ఒక నిదర్శనము: వంటలవాఁడనై పొట్ట నెట్టట్లో గడుపుచున్నా ననుటకు బదులు డొంకతిరుగుడుగా 'మహాన సాంతరచిత్రాన్నదధ్యోదనరచనాసమర్థుఁడనై ' యున్నా ననుటచే నెవనికి నవ్వురాదు ?

సంఘదురాచారములఁ బరిహసించి హసింపఁజేయుట యింకొక మార్గము. ఇది వీరి 'సాక్షి' వ్యాసరాజములందుఁ గావలసినంత.

ప్రతిపక్షులపైఁ బగదీర్చికొనుటకు వారిగ్రంథములను బరిహాసపాత్రములుగఁ జేసి నవ్వించుట వేఱొకమార్గము. ఇది వీరి 'విమర్శాదర్శవిమర్శాదర్శము'న గాననగును.

ఈప్రతిపక్షదూషణవిషయికహాస్యము మనకు అడిదము సూరకవి, కూచిమంచి సోదరకవులు నేర్పినది. దీనినే వీరేశలింగముపంతులు కొక్కొండవారిపైఁ బ్రయోగించి ఆధునిక యుగమున ఇట్టిహాస్యప్రయోగమునకుఁ బితామహులైనారు. ఈవిషయమున అతిశఁ బరుగిడక మోతాదుగా నుండినందులకు లక్ష్మీనరసింహారావుపంతులుగారు స్తుత్యులు.

సర్వతోముఖమగు వీరిహాస్యము ప్రత్యేకించి విపులముగా విమర్శింపవలయునే కాని ఇట్టి చిన్నివ్యాసమున అంటీ అంటనట్లుగా, నామామాత్రీగా తాఁకి వదలవలసినది కాదు.

# ౪

# కవి తిక్కన వంశ కథ

తిక్కనకవి సోమయాజి, నియోగిబ్రాహ్మణుఁడు, గౌతమ గోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు. అతని వంశీయులు లౌకికాధికారధూర్వహులై, కీర్తివిస్తారులై వెలుఁగొందిన శక్తిమంతులు.

కొట్టరువు మా వెనమంత్రి తిక్కనవంశమునకు మూల పురుషుఁడు. ఈతఁడు 'త్యాగవ్రతశీలుఁడు'; 'అమలినాచారుఁడు'; 'నానాగుణమణి': 'ఆగమకోవిదుఁడు.'

మా వెనమంత్రినందనుఁడు కేతన; ఈతఁడు శూరుఁడు. ధీరుఁడు; 'తేజోవిభవాభిజాత్యముల' గణనకెక్కిన సుప్రసిద్ధ పురుషుఁడు, కేతన కమ్మనాటిని బరిపాలించిన త్రిభువనమల్ల దేవచోడునకమాత్యుఁడు.

ఈ కేతనమంత్రి నాచమాంబయందు ౧. గుండన, ౨. భాస్కరుఁడు, ౩. మహేశ్వరుఁడు అను మువ్వురు కొమాళ్లఁ బడసెను.

ఇట్లు పడసిన పుత్రత్రితయమునందు రెండవవాఁడగు

### భాస్కరమంత్రి

ఆంధ్రమహాపురుషులగు కవితిక్కన, ఖడ్గతిక్కనలకుఁ బితామహుఁడు. భాస్కరమంత్రి 'ఆర్యశిరోమణి'; గుంటూరి విభుఁడు; 'సారకవితాభిరాముఁడు'; 'శాపానుగ్రహశక్తి యుక్తుఁడు'; 'సాహిత్యవిద్యాపారీణుఁడు'; 'విబుధశ్రేయస్క

రుఁడు'; 'అర్థార్థిలోకావనవ్యాపారవ్రతుఁడు'; 'అమలాచారుఁడు'; 'గౌరీపతిశ్రీపాదప్రవణాంతరంగుఁడు'; 'ధర్మమార్గపథికుఁడు.'

పండ్రెండవ శతాబ్దాంతమున నాంధ్రభూమి పూర్వచాళుక్యచోడచక్రవర్తుల పాలనలో నుండెను. చందవోలు రాజగు పృథ్వీశ్వరమహారాజు పూర్వచాళుక్యచోడచక్రవర్తులకుఁ బేరునకుమాత్రము ప్రతినిధియై విక్రమసింహపురము మొదలుకొని సింహాచలపర్యంత మాకాలమునఁ దెలుఁగుమాగాని నేలుచుండెను.

మన భాస్కరమంత్రి ఈపృథ్వీశ్వరమహారాజు నధికారముక్రింద గుంటూరుసీమను బరిపాలించి ప్రథితకీర్తి సముపార్జించెను. కావుననే ఈతఁడు దశకుమారచరిత్రమునందును, నిర్వచనోత్తరరామాయణమునందును గుంటూరివిభుఁడుగాఁ బేర్కొనఁబడినాఁడు.

ఈ మంత్రిభాస్కరుఁడే ఆంధ్రమునఁ దొలుఁదొల్త రామాయణము రచియించెననియు, ఆపుస్తక మాయనపేరనే భాస్కరరామాయణ మని వ్యవహరింపఁబడుచున్నదనియు, ఏకారణముననో ఆగ్రంథమునం దరణ్యకాండముతప్ప తక్కినకాండము లన్నియు నుత్సన్నము లయ్యెననియు, ఆ యుత్సన్నభాగములను హుళక్కి భాస్కరాది కవిపుంగవులు పూరించిరనియుఁ గాల్లులేని కథయొకటి మనలో వ్యాపించియున్నది.

సత్యప్రియు లీకథన మంగీకరింపఁజాలరు.

భాస్కరమంత్రి తాతతండ్రులు కృష్ణామండలములోని వెల్లటూరిలో నివసించిరి. ఉద్యోగధర్మమున భాస్కరా

మాత్యుఁడు తననివాసము వెల్లటూరినుండి గుంటూరునకు మార్చుకొనియెను.

భాస్కరమంత్రికి కొమ్మాంబయందు ౧. కేతన, ౨. మల్లన, 3. సిద్ధన, ౪. కొమ్మన అను సుతచతుష్టయము కల్గెను.

(వంశవృక్షము)

గౌతమ గోత్రమున
|
కొట్టరువు మాచనమంత్రి
|
కేతన=నాచమాంబ
|
కుండన — భాస్కరుఁడు=కొమ్మాంబ — మహేశ్వరుఁడు
|
౧. కేతన — ౨. మల్లన — 3. సిద్ధన — ౪. కొమ్మన

భాస్కరమంత్రియొక్క ఈనలుగురు పుత్రుల వంశాభివృద్ధుల విడిగాఁ దెలిసికొందము.

## 1
## కేతన

ఇతఁడు భాస్కరమంత్రి జ్యేష్ఠపుత్రుఁడు. కేతన పితామహునకువలెఁ గమ్మనాటిచోడరాజాస్థానమునందు గొప్ప కొలువులు చేసి ప్రభుసన్మానములంది ప్రసిద్ధిచెందినవాఁడు. అభినవదండి విరచితమైన దశకుమారచరిత్రమందీ కేతనమంత్రి ఇట్లభివర్ణింపఁబడినాఁడు:

చ. కవితకు ముఖ్యుఁ డితఁ డనఁ గామితవస్తువు లిచ్చువాఁడు నా
నవరసభావకుం డితఁ డనన్ బురుషార్థపరాయణుండు నా
నవునన రాజనీతివిషయజ్ఞుఁ డితం డనఁ గీర్తిచంద్రికా
ధవళితదిక్కుఁడై నెగడె ధన్యుఁడై కేతనమంత్రి యిమ్మహిన్.

—ఆ. ౧., ప. 3౭.

ఇతఁడు బ్రహ్మమాంబయందు ౧. భాస్కరుఁడు, ౨. గుండన, 3. నల్లసిద్ధన అను మువ్వురు సుతులఁ బడసెను. అభినవదండి వర్ణనమునుబట్టి కేతనామాత్యుని పుత్రులును, పౌత్రులును అఖండితశౌర్యదానములచేఁ గీర్తిగౌరవములు పొంది వెలుగొందిరని నిర్ణయించుట సాహసమును, సత్యదూరమును గానేరదు.

(కేతన వంశవృక్షము)




## 2

### మల్లన

మల్లన భాస్కరమంత్రిద్వితీయపుత్త్రుఁడు, ఇతఁడును

అగ్రసోదరునకువలెనే కమ్మనాటిచోడులయొద్ద మంత్రిత్వము వహించినవాఁడు.

మల్లనమంత్రి మిక్కుటమైన దేహదార్ఢ్యము కలవాఁడు; ప్రతాపశాలి; 'భాగ్యసమగ్రుఁడు'; 'పరమదయాపరతంత్రుఁడు'; 'హరిపూజాపరుఁడు.'

ఈతఁడు మాచమ్మయందు మనుమసిద్ధి యను పుత్రరత్నమును బడసెను. దశకుమారచరిత్రమం దీమనుమసిద్ధి ఇట్లు వర్ణింపఁబడినాఁడు:

సీ. సుకవి జిహ్వాచకోరికలకుఁ దనకీర్తి
పదనైన చంద్రాతపంబు గాఁగ
నాపదార్తజనసస్యములకుఁ దనకృపా
దానాంబు వమృతంపుసోన గాఁగ
వనితాజనుల చూపులను తూఁపులకుఁ దన
ప్రసన్ననిమేను లేపంబు గాఁగ
మహనీయ నృపనీతిమణులకుఁ దనమాట
లాలితశాణోపలంబు గాఁగ
ఆ. వె. వినుతి కర్హుఁడయ్యె వివిధవిద్యాభ్యాస
చరితుఁ డభవచరణ సరసిజాత
మధుకరాయమానమానసుం డప్రతి
మానవిమలబుద్ధి మనుమసిద్ధి.

—ఆ. ౧., ప. ౩౦.

(మల్లనవంశవృక్షము)

మల్లన—మాచమ్మ
|
మనుమసిద్ధి

# 3

## సిద్ధన

సిద్ధన భాస్కరామాత్యుని తృతీయపుత్రుఁడు. అన్న దమ్ములు నలువురిలో నితఁడు మిక్కిలి ప్రయోజకుఁడు.

విక్రమసింహపురవిభుఁడగు తిక్కజననాథాగ్రణికి ఆప్త మంత్రియు, సేనాపతియు నై కీర్తికెక్కిన దీసిద్ధనామాత్యుఁడే. ఉదాత్తనృపనీతియం దితఁడు బృహస్పతిసమానుఁడు, 'సామాద్యుపాయపారగుఁడు.' ఇతనిసాయమున తిక్కజననాథుఁడు తన రాజ్యమును గాంచీపురముపర్యంతము విస్తరించెను.

సిద్ధనామాత్యునకుఁ బ్రోలాంబయం దేడ్వురు తనయులు జననమొందిరి.

(సిద్ధన వంశవృక్షము)

సిద్ధన=ప్రోలాంబ

(ఖడ్గ) తిక్కన=చానమ్మ | భాస్కరుఁడు | కేతన | మల్లన | నారాయణ | పిన్నభాస్కరుఁడు | పెమ్మన

(తిక్కన=చానమ్మ:) సిద్ధన | కొమ్మన | ఇమ్మడి | ముమ్మడి

సిద్ధనామాత్యుని అగ్రనందనుఁడగు

## తిక్కన

కొట్టరువువారి వంశములో సుప్రసిద్ధపురుషుఁడు. ఈతఁడు వీరధర్మము నెఱపి రణతిక్కన, ఖడ్గతిక్కన అను పౌరుషనామము లందినాఁడు.

ఈ తిక్కన అన్వయోద్ధారకుఁడు. తిక్కజననాథాగ్రణి

యనంతరమందు విక్రమసింహపురమున రాజ్యమేలిన మనుమసిద్ధిరాజునొద్ద ఇతఁడు సేనాని; మంత్రిమణి.

ఎఱ్ఱగడ్డపాటిరేయేలికయగు కాటమరాజునకును, మనుమసిద్ధిరాజునకును పసులమేపుబీళ్లవిషయమై పొసఁగిన పోరునందు విక్రమపౌరుషాదులు నెఱపి వీరస్వర్గము చూఱలాడిన దీధన్యచరిత్రుఁడే. ఈతనిభార్య వనితాశిరోమణియగు చానమ్మ.

దశకుమారచరిత్రమందీ రణతిక్కన ఇట్లు వర్ణింపఁబడినాఁడు:

సీ. వేఁడిన వర్థార్థి వృథపుచ్చ నేరని
దానంబు తనకు బాంధవుఁడు గాఁగ
నెదిరిన జముఁడైన బ్రదికిపోవఁగ నీని
శౌర్యంబు తన కిష్టసఖుఁడు గాఁగ
శరణుచొచ్చిన శత్రుజనుఁడైన రక్షించు
కరుణయె తనకు సంగడము గాఁగఁ
బలికినఁ బాండవప్రభుఁడైన మెచ్చని
సత్యంబు తనకు రక్షకుఁడు గాఁగ
తే.గీ. జగతి నుతికెక్కె రాయవేశ్యాభుజంగ
రాజ్యరత్నాకరమూర్తి రాజమూర్తి
గంధవారణ బిరుద విఖ్యాతకీర్తి
దినపతేజుండు సిద్ధయ తిక్కశౌరి.

—ఆ. ౧., ప. ౨౨.

ఖడ్గతిక్కనభవనము నొకకవి కమనీయముగ వర్ణించియున్నాఁడు. చూడుఁడు:

సీ. పరవివాదంబు వేదనినాదంబు
పాయక రేయుఁబ్రొద్దు మ్రోయుచుండు

భూసురప్రకరంబు సేసలు చల్లఁగఁ
 బాయ కెన్నిరో కుటుంబములు బ్రదుకు
బ్రాహ్మణావళికి ధారలు వోసిన జలంబు
 సతతంబు ముంగిట జాలువాఱు
రిపులొసఁగిన పత్రికలపుత్రికలను
 బాయక కరణముల్ వ్రాయుచుంద్రు
తే. గీ. మానఘనుఁడైన తిక్కనమంత్రి యింట
 మదనసముఁడైన తిక్కనమంత్రి యింట
 మహితయశుఁడైన తిక్కనమంత్రి యింట
 మంత్రిమణియైన తిక్కనమంత్రి యింట.

—చాటుధార.

'నెల్లూరుప్రాంతమునఁ గల పట్టుపురాయిగ్రామానకుఁ దూర్పుభాగమునఁ బినాకినీనదీతీరమునఁ దిక్కనపాడను స్థలము గలదు. అస్థలమందు గుట్టమువిూఁద రాతిను జెక్కిన శిల యొకటి నేఁటికిని గలదు. అది తిక్కనప్రతిమ యని స్థలజ్ఞులు చెప్పుదురు. ఈవిషయము ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమందలి చారిత్రకసంపుటములం దున్నది.'

(చాటుపద్యమణిమంజరి. ౧-వ భాగము)

## 4

### కొమ్మన

కొమ్మన భాస్కరమంత్రి కడగొట్టుతనయుఁడు; కేతన, మల్లన, సిద్ధనల 'కూరిమితమ్ముఁడు.' తండ్రియనంతరమం దీకొమ్మన గుంటూరిసీమను బరిపాలించెను. ఈతఁడు 'దండాధీశుఁడు;' 'పవిత్రశీలుఁడు;' 'సాంగవేదవేది.'

గుంటూరిసీమను బరిపాలించు సమయమున నీతఁడు

చందవోలురాజగు పృథ్వీశ్వరరాజు అధికారముక్రింద నుండెను. పదమూఁడవశతాబ్దాదిని విక్రమసింహపురాధీశ్వరుఁడు, తెలుఁగు చోడుఁడు నైన తిక్కరాజు ఉక్కుమిగిలి పృథ్వీశ్వరరాజు నోడించెను. అట్లగుట నాపృథ్వీశ్వరరాజు తెలుఁగుచోడుల కొలువులోఁ బ్రవేశించుటయు, నేలికతోఁబాటు కొమ్మనదండ నాథుఁడుకూడ తిక్కరాజుకొలువులోఁ జేరుటయు, నిజస్థానము గుంటూరినుండి నెల్లూరుకు మార్చుటయు సంభవించెను.

కొమ్మన లౌకికాధికారధూర్వహుఁ డగుటయే కాక వైదికాచారనిష్ఠాపరుఁడై వేదములను సాంగోపాంగముగ నభ్యసించిన ప్రాజ్ఞుఁడు.

(కొమ్మనవంశవృక్షము)

కొమ్మన=అన్నమాంబ
|
కవి తిక్కన
|
కొమ్మన

దశకుమారచరిత్రయం దీతఁ డీవిధముగ నభివర్ణింపఁ బడినాఁడు.

సీ. స్వారాజ్య పూజ్యుఁడో కౌరవాధీశుఁడో
నాఁగ భోగమున మానమున నెగడె
రతినాథుఁడో దినరాజతనూజుఁడో
నాఁగ రూపమున దానమున నెగడె
ధరణీధరేంద్రుఁడో ధర్మసంజాతుఁడో
యనఁగ ధైర్యమున సత్యమున నెగడె
గంగాత్మజన్ముఁడో గాండీవధన్వుఁడో
యనఁగ శౌచమున శౌర్యమున నెగడె

తే. గీ. సూర్యవంశజ భూపాల సుచిరరాజ్య
వనవసంతుండు బుధలోకవత్సలుండు
గౌతమాన్వయాంభోనిధిశీతకరుఁడు
కులనిధానంబు కొట్టరు కొమ్మశౌరి.

—ఆ. ౧., ప. ౮౧.

సదాచారసంపన్నయు, సుగుణశీలయు, మహాపతివ్రతయు నగు అన్నమాంబ ఈతని కులవధూరత్నము. ఆమెను గేతనకవి ఇట్లని వర్ణించినాఁడు:

సీ. పతిభక్తి నల యరుంధతి పోలె నేనియు
సౌభాగ్యమహిమ నీసతికి నెనయె
సౌభాగ్యమున రతి సరియయ్యె నేని భా
గ్యంబున నీయంబుజాక్షి కెనయె
భాగ్యంబునందు శ్రీ ప్రతియయ్యె నేనియుఁ
దాలిమి నీలతాతన్వి కెనయె
తాలిమి భూదేవి తగ సాటియగు నేని
నేర్పున నీపద్మనేత్ర కెనయె
తే. గీ. యని య నేకవిధంబుల నఖిలజనులు
పొగడ నెగడెఁ గృపాపరిపూరితాంత
రంగ కొమ్మనామాత్యు నర్ధాంగలక్ష్మి
యఖిలగుణగణాలంకృతి యన్నమాంబ.

—ఆ. ౧., ప. ౮౪.

కులనిధానమైన కొట్టరు కొమ్మశౌరి, అఖిలగుణగణాలంకృతయగు అన్నమాంబల పుత్త్రుఁడు మహాకవియైన తిక్కన సోమయాజి.

## క వి తి క్క న

తిక్కన సోమయాజిని అభినవదండి ఇట్లు అభివర్ణించు చున్నాఁడు:

సీ. సుకవీంద్రబృందరక్షకుఁ డెవ్వఁ డనిన వీఁ
డను వాలుకకుఁ దోడమైనవాఁడు
చిత్తనిత్యస్థితశివుఁ డెవ్వఁ డనిన వీఁ
డను శబ్దమున కర్థమైనవాఁడు
దశదిశావిశ్రాంతయశుఁ డెవ్వఁ డనిన వీఁ
డని చెప్పుటకుఁ బాత్రమైనవాఁడు
సకలవిద్యాకళాచణుఁ డెవ్వఁ డనిన వీఁ
డని చూపుటకు గుఱియైనవాఁడు
తే. గీ. మనుమసిద్ధిమహీశ సమస్తరాజ్య
భారధౌరేయుఁ డభిరూపభావభవుఁడు
కొట్టరువు కొమ్మనామాత్యు కూర్మిసుతుఁడు
దీనజనతానిధానంబు తిక్కశౌరి.

—దశకుమారచరిత్ర: ఆ. ౧., ప. ౮౮.

ఈతఁడు భారతములోని విరాటపర్వముదొట్టి పదేను పర్వములను 'ఆంధ్రావళి మోదముం బొరయ,' 'బుధసంతోషంబు నిండార' నాంధ్రీకరించిన కవిబ్రహ్మ, కావ్యశిల్పి. 'భారతీసుస్థితిసంభావితవదనసదనుఁడు;' 'నిఖిలకళాసంవేది'; 'పండితపుండరీకనవపంకజబాంధవుఁడు'; 'దానపయోధారాపల్లవితవిప్రధాత్రీజుఁడు.' తిక్కన శుభచరిత్రుఁడు; నృపమాన్యుఁడు; చతురాననసన్నిభుఁడు; బలసూదనవిభవుఁడు; అమాత్యశేఖరుఁడు.

తిక్కనసోమయాజి నిజస్థానము నెల్లూరుపురము. అతని

తాతయుఁ దండ్రియు గుంటూరిపురవాసులే. అయినను తిక్కన తండ్రి కొమ్మనదండనాథుఁడు తన యేలికయగు పృథ్వీశ్వరరా జపజయ మొందిన బదంపడి నిజస్థానము గుంటూరనుండి నెల్లూరుకు మార్చుకొనియెను.

మఱియు దశకుమారచరిత్రయందు మూలఘటిక కేతనకవి 'నా రచింపంబూనిన కృతి కధీశ్వరుండైన కొట్టరువు తిక్కనామాత్యునకు నిజస్థానంబగు విక్రమసింహపురంబు వర్ణించెద' నని విస్పష్టముగ వ్రాయుచున్నాఁడు.

అట్లగుట నెల్లూరే తిక్కనసోమయాజి నిజస్థానమనుట యం దసత్యతాసంశయమునకుఁ దావులేదు.

అభినవదండిచే వర్ణింపఁబడినట్లు తిక్కన 'అభిరూప భావభవుఁడు.' అతని తల్లియగు అన్నమాంబయు, తండ్రియగు కొమ్మనయు సురూపయుతులు. సుందరదంపతులకుఁ బుట్టిన తిక్కకవిరాజు స్ఫురద్రూపి యగుటలో విరుద్ధ మేమున్నది?

కేతనవచనములలో తిక్కన- 'కనకగిరితటీసంకాశవక్షస్థలీభాగుఁడు'; 'శ్రీరమణీరమణీయమహోరస్థలివిజితకాంచనోర్వీధరవిస్తారితబలుండు;' 'కల్పకపరాభవకరణధురీణదీర్ఘబాహుండు'; 'జలజసుభగనేత్రుఁడు'; 'వియన్మణితేజుఁడు'; 'పవిత్రమూర్తి.'

వీనినిబట్టి తిక్కనామాత్యుఁడు విశాలవక్షుఁడనియు, బలకాయుఁడనియు, అజానుబాహుఁడనియు, సువిశాలనేత్రుఁడనియు, తేజోమూర్తి యనియు మనము నిర్ణయింపవచ్చును.

తిక్కన కవిమాత్రుఁడే కాఁడు. అతఁడు యోధుఁడు. గంటము బట్టుకొని కవితారంగమున నెంత స్వేచ్ఛగా విహరింపఁగల్గునో కరవాలము గీలించి కదనరంగమున నంత

స్వేచ్ఛగా విహరింపఁగల్గిన పరాక్రమశాలి, తిక్కన పితృపితామహులవలె వాహినీపతిత్వము వహించిన వీరుఁడు. 'తిక్క దండాధీశా!;' 'తిక్కచమూపా!' అని అభినవదండి అనుసంధించిన సంబోధనలబట్టి మన మావిషయము నిశ్చయమని నమ్మవచ్చును.

తిక్కన బొడ్డుమాణిక్యముతోఁ బుట్టిన యదృష్టశాలి. ఆతని పితృపితామహులు రాజాస్థానములందు గొప్పకొలువులు చేసి ప్రభుసన్మానము లంది సిరిసంపదలతోఁ దులఁదూగిన భోగదేవేంద్రులు. తిక్కకవినాథాగ్రణియు మనుమసిద్ధిమహీవల్లభునకుఁ గరుణాపాత్రుండై నిజకులక్రమాగతముగు మంత్రిపదవి నధిష్ఠించి,

గీ. అందలంబు గొడుగు లడపంబు మేల్కట్టు
చామరములు జమలిశంఖములును
గంబగట్లు భూమి కానికగాఁగఁ బెం
పెసఁగు రాచపదవు లెల్లఁ బడసి.

—దశకుమారచరిత్ర: ఆ. ౧., ప. ౨౧.

సంపన్నమేతుండై రాజ్యసుఖము లనుభవించిన సుఖవాసి.

మన్మభూపాలునివలనఁ బొందిన ఐశ్వర్యమును మాత్రమే కాక కవితిక్కన గణపతిదేవచక్రవర్తివలన నెనిమిదిగ్రామములను, విశేషమైన యైశ్వర్యలాభమును బొందినాఁడు.

కావుననే, ఆతఁడు అష్టైశ్వర్యములఁ జూఁఉలాడిన అనుభోగి యనుట.

కవితిక్కన నెఱదాత; 'సతతదానవినోది;' పితృపితామహులవలె దానధర్మము లొనర్చి ఆశ్రితభరణుండై పేరు

పొందిన విద్వద్భోగభాగ్యుఁడు. యాగాదిబహువిధకర్మ లొనర్చి భూరిదక్షిణలచే సద్బ్రాహ్మణులఁ దనిపిన ఈవికాఁడు తిక్కనకవి. అతఁడు 'కావ్యరసముం గొనియాడి' విద్వద్గరిష్ఠులకుఁ బెక్కుల్లు అగ్రహారములుగా నొసఁగిన 'బుధారాధనవిరాజి,' విశేషించి 'కవిసరోజమార్తాండుఁడు.'

తిక్కన 'సుకవీంద్రబృందరక్షకుఁడు.' ఆనాఁటి ఆంధ్ర సారస్వతప్రపంచమునంతను నిరంకుశముగఁ బరిపాలించిన కవి రాజు.

ఉభయకావ్యప్రౌఢిఁ బాటించు శిల్పమునఁ బారగుఁ డగుటచేఁ గవిత చెప్పి యీయుభయకవిమిత్రు మెప్పింప నాఁటివారు తపస్సు ధారపోసిరి. సోమయాజి తాను గావ్య శిల్పియుఁ, గవిబ్రహ్మయు నగుటయేగాక సమకాలమువారల కవితారసమును గ్రోలి హృదయపూర్వకముగ వారలకు మెప్పు లందించి రసపిదుఁడుకూడ నైనాఁడు.

అతఁడు కేతనామాత్యవిరచితమైన దశకుమారచరిత్రకుఁ గృతిభర్త. భోజరాజీయము రచించిన యనంతామాత్యుని ప్రపితామహుఁడగు బయ్యనమంత్రికి 'భవ్యభారతి' అను బిరుద మిచ్చి గౌరవించిన కవితారసజ్ఞుఁడు. మార్కండేయపురాణము రచించిన మారనకు గురువు.

ప్రథమాంధ్రమహాకవియగు నన్నయభట్టారకుని 'ఆంధ్ర కవిత్వవిశారదుఁ'డని, 'విద్యాదయితుం'డని కొండాడిన విశాల హృదయుఁడు. వ్యాసభగవానుని 'భవ్యకవితావేశుఁ'డని నుతించిన 'కళావిదుఁడు.' తిక్కన శిష్యులఁ జేరఁదీసి కవితాభిక్ష పెట్టిన సారస్వతాభిమాని.

తిక్కన మనుమసిద్ధిమహీవల్లభుని మంత్రిమాణిక్యము.

అతఁడు 'సామాద్యుపాయవిదుఁడు;' 'నీతిచాణక్యుఁడు;' విశేషించి 'నీతినిపుణమతిజితపురుహూతామాత్యుఁడు.'

ఒకప్పుడు మన్మభూపాలుఁడు రాజ్యరమఁ బోఁగొట్టుకొనఁగాఁ దిక్కన తన ప్రతిభావిశేషముచేఁ దిరిగి దానిని సంపాదించినాఁడు.

అక్కనబయ్యన లను సిద్ధిరాజుజ్ఞాతులు పోటుగులై నెల్లూరిపై దాడినడచి మన్మభూపాలు నోడించి రాజ్యము నాక్రమించి తముకుఁదామే పరిపాలన చేయఁదొడఁగిరి.

తిక్కన 'రాజనయవిధాప్రయోజనవిశారదుఁ' డగుట మనుమసిద్ధిపక్షము వహించి కాకతిగణపతిదేవచక్రవర్తిసమక్షమునకుఁ బోయి సకలము నివేదించి 'నయవచస్సమగ్రతాచతురాస్యుఁ' డనిపించుకొనియెను. సోమయాజుల పటువాక్యశక్తికి మెచ్చి, యతనిని బహుప్రకారంబులఁ బూజించి, యెనిమిదిగ్రామము లొసఁగి, నవలక్షధనమును యజ్ఞకుండలములు నిచ్చి, ఆతని రాయబారమును శిరసావహించి కాకతీయాంధ్రచక్రవర్తి అపారసైన్యసమేతుఁడై దాడివెడలివచ్చి, అక్కనబయ్యనల నుక్కడించి మనుమసిద్ధిని బునరభిషిక్తుని గావించెను.

బళిరా! తిక్కనసోమయాజి స్వామిభక్తి, కార్యదక్షత! చేజారిపోయిన రాజ్యమునే తిరిగి సంపాదింపఁగల్గెను. సర్వజ్ఞుఁడగు మంత్రి సవదరించిన రాజ్యము సుస్థిరమై యుండుననుటలో నాశ్చర్యమేమి!

అట్లగుటనే తిక్కనను 'మన్మభూపతిప్రాజ్యరాజ్యాంబునిధిశశి' యని కేతన సంబోధించియున్నాఁడు.

తిక్కన బ్రహ్మవేత్త. అతఁడు 'వేదాదిప్రకటవివిధ

విద్యాభ్యాసాపాదితమహత్త్వుఁడు'; 'సకలాగమార్థతత్త్వవిచారోదారుఁడు'; 'నానా వేద వేదాంగతత్త్వజ్ఞుఁడు.' భారతమందలి యాశ్వాసాద్యంతపద్యములం దిముడ్పఁబడియున్న ఉపనిషదర్థములఁ బరికించుచో తిక్కన 'వేదాదిసమస్తవిద్యావిభాసి' యని తెల్లమగును. శాంత్యానుశాసనికపర్వపాఠకులకు వేదాంతము, సాంఖ్యయోగము లందు సోమయాజికిఁ గల కుశలప్రవేశము తెలియవచ్చెడిని.

తిక్కన హిందూమతమును ఉద్ధరించినవారిలో నొకఁడు. ఆతఁడు గణపతిదేవచక్రవర్తి సభాభవనమున నద్వైతవాదమును సలిపి అనుమకొండనివాసులైన బౌద్ధులఁ జుక్కనగ నోడఁగొట్టి, బౌద్ధదేవాలయములఁ గూలఁద్రోయించిన హిందూమతాభిమాని.

తిక్కన కర్మిష్ఠి. కర్మకాండయం దాతనికి గాఢవిశ్వాసమున్నట్లు కనఁబడుచున్నది. 'మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుఁ' డాతఁడు. 'ఉదాత్తశ్రౌతస్మార్తకర్మతత్పరమతి;' 'వేదోదితకర్మవ్రతుఁడు;' 'సతతాధ్వరక్రియాకర్మఠపాణిపద్ముఁడు;' 'అధ్వరాబ్జదిననాథుఁడు;' 'సతతస్వాహాస్వధాదిశబ్దద్వయసంస్కృతహవ్యకవ్యసంతర్పితముఖశిఖిముఖనిలింప పితృవర్గుఁ' డై, 'వైదికమార్గనిష్ఠమగు వర్తనముం దగ నిర్వహించిన' మహనీయచరిత్రుఁడు తిక్కన.

తిక్కన వినయనిధి. ఆతని సౌజన్యమును, వినయమును మెచ్చఁదగినవి. నాలుగుముక్కలు నోటఁబట్టగనే కన్నుమిన్ను గానక మా కుపమ మేమేయంచు గర్వించు దుర్విదగ్ధులవలెఁ గాక తిక్కన తాను కవిబ్రహ్మ, కావ్యశిల్పి యయ్యు సౌజన్యమును, వినయమును గోల్పోవని గభీరుఁడు.

ఈతని వినయసౌజన్యముల కీతనిగద్యయే ప్రబలనిదర్శనము. 'బుధారాధనవిధేయ;' 'బుధారాధనవిరాజి' అని వ్రాసికొనియున్నాఁడు. నిర్వచనోత్తరరామాయణమునందలి 'నూత్నసత్కవీశ్వరులను భక్తిఁ గొల్చి వారికృపన్ కవితావిలాసవిస్తరమహనీయుఁడైన నను' అనువాక్యమే సోమయాజి వినయసౌజన్యములను జాటిచెప్పు బూరగొమ్ము.

తిక్కన కుమారుఁడు కొమ్మన. కొమ్మననుండి యీతని వంశీయులు పాటూరివా రైనారు. తిక్కన బహువిధయాగము లొనర్చి అర్థార్థులకు ధనము విరఁజిమ్ముటచే నాతని సంపద క్రమముగా నీడఁబోయినది. కావుననే కొమ్మన జీవయాత్రార్థము పాటూరికరణీకము సంపాదింపవలసినవాఁ డయ్యెను. ఈ పాటూరు నెల్లూరున కైదారుమైళ్లదూరములో నున్న పల్లెటూరు. తిక్కనసంతతివా రిప్పటికిని ఆ గ్రామమున నున్నారు.

తిక్కన ఆంధ్రమహాపురుషుఁడు; కూలంకషప్రజ్ఞాధురీణుఁడు; శ్రీమంతుఁడు; నిరర్గళధీమంతుఁడు; ఆముష్యాయణుఁడు; విశ్రుతప్రశాణుఁడు, కావ్యకళాడఃభూమి; సారకవితానిర్మాణచాతుర్యుఁడు; నిరతిశయవివేకోన్నిద్రుఁడు; అన్వయోద్ధారుఁడు

అతఁడు ఆంధ్రఋషి; సోమయాజి; రాజ్యాంగవేత్త; బ్రహ్మవేత్త; కృతికర్త; కృతిభర్త; దండాధీశుఁడు, మంత్రిమాణిక్యము.

వేయేల? తిక్కన ఆంధ్రలోకమున అవతరించిన లోకోత్తరపురుషుఁడు; సర్వాంధ్రలోకపూజనీయుఁడు. కావున నతని నిట్లు కీర్తింతము:

సీ. సరసకవీంద్రుల సత్ప్రబంధము లొప్పఁ
గొను నను టధికకీర్తనకుఁ జెరువు
లలితనానాకావ్యములు చెప్ప నుభయభా
షలయందు ననుట ప్రశంసస్తోత్ర
యర్థిమైఁ జెక్కి శ్రీ నగ్రహారంబులఁ
గా నిచ్చుననుట పొగడ్తపాలము
మహితదక్షిణలైన బహువిధయాగంబు
లొనరించుననుట వర్ణనము దారి
తే. గీ. పరుని కొక్కని కిన్నియుఁ బ్రకటవృత్తి
నిజములై పెంపుసొంపారి నెగడునట్టి
కొమ్మనామాత్యుతిక్కని కొలఁది సచివుఁ
డింక నొక్కరుఁ డెన్నంగ నెంచఁ గలఁడు?
—దశకుమారచరిత్ర; ఆ ౧., ప. ౯౨.

౫

# తిక్కన నవ్వులు

కవిబ్రహ్మ తాను రచియించిన నిర్వచనోత్తరరామాయణములో, భారతములో అనేకవిధములైన 'నవ్వుల'ను ప్రయోగించియున్నాడు.

పలువిధములైన పరిస్థితులలో పలువిధములైన 'నవ్వులను' ఆ కవిగ్రామణి వ్రాసియున్నాడు. ఆ పలువిధములైన నవ్వులతో నాతడు తన పాత్రల వ్యక్తిత్వమును లెస్సగ బరిపోషించుకొనినాడు.

నిదర్శనములను బరికింపుడు:

ప్రబలశత్రువు తనచేతులలో మడిసినను అర్జునుడు నవ్వడు. యుద్ధము ప్రారంభించు ప్రతిసారియు నతడు నవ్వును.

ఇక ధర్మరాజుసంగతి. అతడు గంభీరముగ నుండును. కాని తఱచు నవ్వడు.

'దుస్తరబలభాసి' యైన భీముడు తిక్కనరచనలో 'హర్షావేశలఘుచారిత్రుడు.' అతడు ఎప్పుడు నవ్వినను 'పెలుచ' నవ్వును.

శ్రీకృష్ణుడు అర్జునునితో సంభాషించునపుడు తఱచు నవ్వును.

శృంగారఘట్టములందు తిక్కన స్త్రీపాత్రలకు ప్రాయికముగా 'ఎలనవ్వు,' 'అల్లనవ్వు' మొదలయిన మృదహాసములు హత్తించును. అనుశాసనికపర్వమున చతుర్థాశ్వాసమున

కై కేయీశాండిలీసంవాదమున తిక్కన ఒకపాత్రచేత స్త్రీలు 'పెలుచనవ్వరా' దని చెప్పించినాఁడు.

తిక్కన్నను చూచి తరువాతి తెలుఁగుకవులు పలువురు అతని నవ్వులను తమకావ్యములందు చక్కఁగా సంతరించుకొనినారు. ఆముక్తమాల్యదలోని అంకురితస్మితము, కాశీఖండములోని కటికినవ్వు, ద్విపదహరిశ్చంద్రలోని మంచివెన్నెలవంటి మందహాసము మున్నగువానికి తిక్కన ఒరవడి పెట్టినాఁడనవలయును.

గౌరనమంత్రి విశేషప్రచారములోనికిఁ దెచ్చిన 'పకపక నవ్వు' కాని, శ్రీనాథుఁడు విరివిగా వాడిన 'ముసిముసినగవు' కాని తిక్కన వాడియుండలేదు.

తిక్కన రచియించిన మహాభారతములోని పదునైదు పర్వములును, నిర్వచనోత్తరరామాయణమును చదివినవారికి అతఁడు ముప్పదిరెండురకముల నవ్వులను వాడియుండుట స్పష్టమగును.

ఆ ముప్పదిరెండునవ్వులు ఏవి యనిన:

౧. పిన్ననవ్వు
౨. చిఱునవ్వు
౩. అల్లన నగవు
౪. అలతి నవ్వు
౫. మందస్మితము
౬. హర్షమందస్మితము
౭. అంతస్స్మితము
౮. జనితమందస్మితము
౯. ఉద్గతమందస్మితము
౧౦. అనాదర మందస్మితము
౧౧. సాదర దరహాసము
౧౨. తిన్నని నవ్వు
౧౩. లేఁతనవ్వు
౧౪. కొండొకనవ్వు
౧౫. పెలుచనవ్వు
౧౬. ఉబ్బుమిగిలిన నవ్వు
౧౭. గేలిగొను నవ్వు
౧౮. ఒత్తిలి నవ్వు

౧౯. అపహాసము
౨౦. రోషకలితవంచాహాసము
౨౧. ఉద్భటహాసము
౨౨. కలకల నవ్వు
౨౩. ఎలనవ్వు
౨౪. ప్రౌఢస్మితము
౨౫. బెట్టునవ్వు
౨౬. కన్నుల నవ్వు
౨౭. కన్నుల నిప్పులు రాల నవ్వు
౨౮. కినుకనూనిన నవ్వు
౨౯. కినుకమునుంగు నవ్వు
౩౦. కటికినవ్వు
౩౧. నవ్వుగానినవ్వు
౩౨. ఎఱ్ఱనవ్వు

ఇందులో మొదటి పదునాలుగు చిన్ననవ్వులుగాను- ౧౫, ౧౬, ౧౭, ౧౮, ౧౯, ౨౦, ౨౧, ౨౨, సంఖ్యలుగలవి పెద్దనవ్వులుగాను- మిగిలిన పదియు గొప్పనవ్వులుగాను మనము విభజింపవచ్చును

ఈనవ్వులలో ప్రతిఒకదానికిని తిక్కనకావ్యమున పరమ ప్రయోజన మున్నది. ఆ ప్రయోజనగ్రంథము ప్రస్తరింపఁ దగినది.

పైనఇచ్చిన ముప్పదిరెండురీతుల నవ్వులలో ఒక్కొక్క దానికి రెండుమూడు ఉదాహరణములను పరామర్శించుటవలన కావ్యమున ఆ నవ్వులమూలమున సాధితమైన పరమప్రయోజనము అవగత మగును.

# 1

## చిన్న నవ్వులు

### —: ౧. పిన్న నవ్వు :—

కర్ణార్జునుల ద్వంద్వయుద్ధమున

చ. అలిగి కడంగి సూతసుతుఁ డచ్యుతపార్థులఁ దీవ్రబాణపం
క్తులఁ బొదవం బరాక్రమకుతూహలి యవ్విజయుండు పిన్నన

వ్రాలని ముఖాంబుజంబునకు నొప్పఁగ దద్రథరథ్యకేతు సూ
తులను దదీయగాత్రమును దూపులవెల్లి మునుంగఁజేసినన్.

—కర్ణ. ప. ౧౧౮, ప. ౨౮౫.

కర్ణుఁడు అలిగి కడంగి తీవ్రబాణపంక్తులతో పొదవినాఁడు. పరాక్రమకుతూహలి ఐన అర్జునుఁడు కర్ణుని పోటును పిన్ననవ్వుతో ఎదుర్కొనినాఁడు. శత్రుయుద్ధనైపుణ్యాతిరస్కారసూచకమైన ఈ పిన్ననవ్వు అర్జునుని వీరత్వమునకు ఒక మానదండమై ఉన్నది.

ఉద్యోగపర్వము తృతీయాశ్వాసము ౫౨-వ పద్యము, భీష్మపర్వము ప్రథమాశ్వాసము ౧౨౫-వ పద్యము, ద్వితీయాశ్వాసము ౨౮౯-వ పద్యము, తృతీయాశ్వాసము ౭౫-వ పద్యము, చతుర్థాశ్వాసము ౪౨-వ పద్యము మున్నగు తావులందు ఈ పిన్ననవ్వు ప్రయోగింపఁబడినది.

—: ౨. చిఱునవ్వు :—

పిన్ననవ్వు, చిఱునవ్వు ఇతరకవుల రచనలలో పర్యాయపదములు కావచ్చును. కాని తిక్కనరచనములో ప్రత్యేక ప్రయోజనములను కలిగియున్నవి.

భారతమున శ్రీకృష్ణునిపరముగా ఉన్న రెండు చిఱునవ్వుఘట్టములను ముందుగాఁ బరామర్శింతము:

గాంధారి శ్రీకృష్ణునకు శాప మిచ్చుచు

1. తే. అరయ దిక్కెవ్వరును లేని యగ్గలంపుఁ
గుత్సితంపుఁ జెఱంగునఁ గూలువాఁడ
విట్లు మాకధూజనములు నేడ్పువారు
పతుల సుతులను బంధులఁ బనిచి పనిచి,

క. అని ఘోరంబుగఁ బలికిన
విని విపులమనస్కుఁడైన విష్ణుఁడు చిఱున

ప్వన వానన వెుప్పఁగ న
క్వనితకు నిట్లనియె గౌరవస్తుత్యముగన్.

—స్త్రీ. ఆ. ౨., ప. ౧౫౬.

2. అయోమయంబగు భీమప్రతిరూపంబు భగ్నంబుచేసి యది నిజమైన భీముఁడే యని పెంపున నెడఁద నిర్భర హర్షంబు నొందియు ధృతరాష్ట్రుండు మెదురు మెచ్చు నకై భీమునిం బేర్కొని హాహాకారంబు లెసంగ రోదనంబు చేసినఁ జిఱునవ్వునం దన వదనకమలంబొప్ప త్రికాలవేదియగు కమలనాభుఁ డతని కిట్లనియె:

తే. అడల నేటికి నీ చేతఁబడఁడు భీముఁ
డిప్పుడు భంజింపఁబడినది యినుపరూపు

—స్త్రీ. ఆ. ౧, ప. ౧౩౯.

విరాటపర్వము పంచమాశ్వాసము ౧౭౪-వ పద్యము; భీష్మపర్వము ద్వితీయాశ్వాసము ౧౨౨-వ పద్యము; ద్రోణపర్వము చతుర్థాశ్వాసము ౫౬-వ పద్యము; కర్ణపర్వము ద్వితీయాశ్వాసము ౨౩౦-వ పద్యము; తృతీయాశ్వాసము ౩౦౦-వ పద్యము; శల్యపర్వము ప్రథమాశ్వాసము ౧౩౯-వ ౧౬౦-వ పద్యములు; ద్వితీయాశ్వాసము ౯౫-వ పద్యము; శాంతిపర్వము ద్వితీయాశ్వాసము ౩౪౧-వ పద్యము; సౌప్తికపర్వము ప్రథమాశ్వాసము ౧౧౬-వ పద్యము; నిర్వచనోత్తరరామాయణము చతుర్థాశ్వాసము ౯౨-వ పద్యము మున్నగు తావులయందు ఈ చిఱునవ్వు ప్రయోగింపఁబడినది.

చిఱునవ్వును తిక్కన కొన్ని తావులయందు చిఱుతనవ్వు అని కూడ వాడియున్నాఁడు. 'సెలవిపై చిఱునవ్వు చిలికెడు మోము' అనియు, 'చీఁకటి విరియించు చిఱునవ్వు' అనియు గౌరనమంత్రి హరిశ్చంద్రలో ఈనవ్వును ప్రయోగించినాఁడు.

## —: 3. అల్లనగవు :—

ఈరీతి నవ్వునే 'అల్ల నవ్వు,' 'అల్లని నగవు' అని కూడ తిక్కన పేర్కొనియున్నాఁడు.

ఈ అల్లనగవునకు కొన్ని నిదర్శనములు:

ఆ. కౌరవేశ్వరుండు గనువిచ్చి దిక్కులు
గలయఁజూచి పార్థుఁ గాంచి కడఁగి
యదరఁజూచుటయును నమరనదీసూనుఁ
డతని కిట్టు లనియె నల్లనగుచు.

క. ఇంత యెఱుంగవు సైన్యము
లింతవడిం దలలు చీరలెఱుఁగక మోహా
క్రాంతంబులయ్యెఁ బనిదెగుఁ
గాంతేయుఁడు సారఁడుగాని క్రౌర్యంబునకున్.

—విరాట: పు ౧౦౫. ప. ౨౧౮.

భీష్మపర్వము ద్వితీయాశ్వాసము ౧౪౯-వ పద్యము, తృతీయాశ్వాసము ౨౬౬-వ పద్యము, ౩౯౪-వ పద్యము, ద్రోణపర్వము ప్రథమాశ్వాసము ౩౬౧-వ పద్యము, ద్వితీయాశ్వాసము ౧౦౮-వ వచనము, కర్ణపర్వము తృతీయాశ్వాసము ౧౬౦-వ పద్యము, శల్యపర్వము ప్రథమాశ్వాసము ౨౧౭-వ పద్యము, సౌప్తికపర్వము ప్రథమాశ్వాసము ౧౦౦-వ వచనము, ౧౬౦-వ పద్యము, నిర్వచనోత్తర రామాయణము అష్టమాశ్వాసము ౩౬, ౮౨ పద్యములు, దశమాశ్వాసము ౫౦-వ పద్యము, అనుశాసనికపర్వము ద్వితీయాశ్వాసము ౧౬౯-వ వచనము, తృతీయాశ్వాసము ౨౮౩-వ వచనము, అశ్వమేధపర్వము ప్రథమాశ్వాసము ౯౮-వ వచనము, ద్వితీయాశ్వాసము ౯౫-వ పద్యము, తృతీయాశ్వాసము ౩౪-వ పద్యము, చతుర్థాశ్వాసము ౭౪-వ వచనము, విరాటపర్వము ద్వితీయాశ్వాసము ౮౫-వ పద్యము, చతుర్థాశ్వాసము ౧౪-వ పద్యము మున్నగు తావులందు ఈనవ్వు ప్రయోగింపఁబడినది.

స్త్రీపాత్రలకు సాధారణముగ తిక్కన ఈనవ్వును హత్తించును. నిదర్శనములు:

(1) నారదపంచచూడాసంవాదమున నారదుండు వనితా స్వభావమేర్పడ చెప్పుమనఁగా అవ్వనిత అల్లనగుచుఁ 'దగునయ్య వనితకు వనితల దుశ్చేష్టితములు వాక్రువ్వంగన్' అనియె.

—అనుశాసనిక. ఆ. ౨, ప. ౧౬౯.

(2) శునస్సఖునికి అరుంధతి పతివ్రతాధర్మము చెప్పుచు అల్లనవ్వె.

—అనుశాసనిక. ఆ. ౩., ప. ౧౪౬.

—: ౪. అలతి నవ్వు :—

స్థూలదృష్టితోఁ జూచువారికి అల్లననగవు, అలతినవ్వు ఒక్కకుదుటికిఁ జెందినవిగాఁ దోఁచును. కాని తిక్కనరచనలో ఈరెండురకముల నవ్వులకును ఎంతో అంతరువు ఉన్నది.

అలతినవ్వుకు నిదర్శనము:

ద్రోణుని ఐదవనాఁటి యుద్ధమున దుర్యోధనుఁడు పాండవబలమువలన చీకాకునొందిన కురుసైన్యంబును రక్షింపుమని కోరఁ గర్ణుఁ డుబ్బి 'నేఁడు నాకెంపును బెంపునున్' అని బీరములు పల్కె. అది చూచి కృపాచార్యుండు అలంతినవ్వుతో 'నీవు ఘోషయాత్రను బడంపడి గోగ్రహణంబునందుఁ బేరుగొనిన నీకు నిట్లనుట దగు, కొవ్వులు దక్కుము.' అని కర్ణుని ఉపాలంభించెను.

—ద్రోణ: పుట ౨౭౭. ప. ౬౮.

భీష్మపర్వము ద్వితీయాశ్వాసము ౧౭౩-వ పద్యము, శల్యపర్వము ప్రథమాశ్వాసము ౨౯౨-వ పద్యము, ద్వితీయాశ్వాసము ౩౧౭-వ వచనము, అనుశాసనికపర్వము చతుర్థాశ్వాసము ౪౯౬-వ పద్యము, అశ్వమేధపర్వము తృతీయాశ్వాసము ౧౪౫-వ పద్యము మున్నగు తావులందు ఈనవ్వు వాడఁబడియున్నది.

## —: ౫. మందస్మితము :—

మందస్మితము సౌందర్యవర్ధక మని తిక్కన నిశ్చితాభిప్రాయము. రామాయణమునందును, భారతమునందును తిక్కన తన ఈనిశ్చితాభిప్రాయమును వెల్లడించియున్నాఁడు.

నిర్వచనోత్తరరామాయణము సప్తమాశ్వాసమున రావణుని దిగ్విజయము వినిపింపఁగా విని రాముఁడు:

మ. అనినం జిత్తము చోద్యమంద రఘువంశాధీశ్వరుం డిట్టులా
తనికిన్ వీరము సెల్లెఁగాని యొనటం దద్విక్రమక్రీడ మా
న్ప నొకం డైనను జాలఁ డీయనుడు భూపాలాగ్రణిం జూచి య
మ్ముని మందస్మితసుందరుండయి మనోమోదంబుతో నిట్లనున్.

భారతము కర్ణపర్వము ద్వితీయాశ్వాసము (పద్యము ౩౭౯)న

మ. ......రాధేయుండు దివ్యబాణనిహతిం గౌంతేయసైన్యంబు వె
ల్లను నొప్పించిన భీమునోరి యని యుల్లాసోద్గుఁడై ధర్మనం
దనుఁ డమ్మేటి మగండు గిట్టుటయు నాతం డల్గి పెల్లేసినన్
విను మందస్మితసుందరుండగుచు నవ్వీరుండు ధీరోద్ధతిన్.

అనియు తిక్కన మందస్మితసుందరసమాసమును వాడియున్నాఁడు.

మందస్మితముతోడనే సుందరశబ్దమును సమాసించుట విశేషమైనది. తిక్కన్న సుందరపదప్రయోగము ఉపజ్ఞామహితమైనది. కొన్ని నిదర్శనములు చూడుఁడు:

'ఉగ్రసుందరమైన రణము'
'అల్పకోపసుందరమైన వదనము'- అశ్వమేధ. ఆ4. ప31.
'సన్నాహసుందరమైన సేన'- ని. రా. ఆ 6–ప 24.
'వినయసుందరుఁడు'- ని. రా. ఆ 9- ప 97.

మందస్మితమునకు మఱియొక నిదర్శనము:

కర్ణుని ధాటికి ఓర్వలేక శిబిరముచేరిన ధర్మరాజు సేమం బరయుటకు కృష్ణార్జునులు పోయిరి. వారు రాధేయు వధించి వచ్చిరని తలంచి ధర్మరాజు డెందం బలర మందస్మితంబుతో నభినందించె.

—కర్ణ. పుట ౮౭ ప. ౧౮.

మందస్మితమునకుఁ బర్యాయపదములుగా మందహాసము, దరహాసము, దరస్మితము, కొంచెపునగవు మున్నగునవి తిక్కన వాడియున్నాఁడు. ఈరకపునగవును గౌరనమంత్రి 'మంచివెన్నెల వంటి మందహాసము' అని అభివర్ణించినాఁడు.

తిక్కన రచనమున శృంగారలలితమైన మందహాసము నకు ఒకమంచి నిదర్శనము:

చ. అలసత యొప్ప నల్లన రతాంతమునం బ్రియునొద్దఁ బాసి నె
చ్చెలికడ కేగుదెంచు సరసీరుహనేత్రవిలోచనంబులం
దలఁకెడు మందహాసము...

—ని. రా ఆ ౬., ప ౫౮.

హాసము, మందహాసము, దరహాసము, మందస్మితము, దరస్మితము, కొంచెపునగవు మున్నగు పర్యాయపదములతో వ్యవహరింపఁబడిన మందస్మితమునకు తిక్కన రచనములలోని ఇతర నిదర్శనములు:

7

మందహాసము

మందస్మితము

శాంతి. ఆ ౫. ప ౨౦౪.
భీష్మ. ఆ ౪. ప ౧౫౪.
ని. రా. ఆ ౩. ప ౮.
ని. రా. ఆ ౧౦. ప ౧౯.
అను. ఆ ౫. ప ౩౪౧.
ఆశ్వ. ఆ ౨. ప ౫.
విరా. ఆ ౧. ప ౧౯౨.
విరా. ఆ ౫. ప ౩౧౯.

*

కొంచెపునగవు

శాంతి. ఆ ౨. పు ౧౧.
ని. రా. ఆ ౩. ప ౫.

*

హాసము

దరహాసము

దరస్మితము

శాంతి. ఆ ౧. ప ౭౪.
కర్ణ. ఆ ౨. ప ౨౪౪.
కర్ణ. ఆ ౨. ప ౨౮౫.
కర్ణ. ఆ ౩. ప ౧౯౪.
శల్య. ఆ ౨. ప ౪౩.
ని. రా. ఆ ౩. ప ౨౭.
ని. రా. ఆ ౪. ప ౧౧.
విరా. ఆ ౧. ప ౬౦౭.
విరా. ఆ ౨. ప ౨౭౦.
ఉద్యో. ఆ ౧. ప ౧౦౩.
ఉద్యో. ఆ ౩. ప ౫౪.

—: ౬. హర్ష మందస్మితము :—

మందస్మితమునకు హర్షశబ్దము ఉపసర్గగాఁ జేర్చి తిక్కన కల్పించిన వైశిష్ట్యము క్రింది నిదర్శనమువలన అవగతము కాఁగలదు.

తే. హర్షమందస్మితముతోడ నమ్మురారి
యప్పుడ హయముల మెయివెట్టునట్లు సేసి
తతిమి నీరులు ద్రావించి తడవి మగుడఁ
దెచ్చె మునయోధు లెల్లను విచ్చలింప.

—ద్రోణ. పుట ౪౧౯. ప. ౧౬౩.

—: ౪. అంతస్మితము :—

'శుచిస్మిత'మని నన్నయ ఒకచో అపూర్వముగ ప్రయో-

గించియున్నాఁడు. తిక్కన ప్రయోగించిన అంతస్స్మితము, జనిత మందస్మితము, ఉద్గతమందస్మితము అను మూఁడును కూడ ఇట్టి అపూర్వమైనవే.

అంతస్స్మితము తరువాతిది జనితమందస్మితము. ఈ జనిత స్మితమునే ఆముక్తమాల్యదకారుఁడు (చతుర్థాశ్వాసము 3౫-వ పద్యమున) అంకురితస్మిత మని వాడియున్నాఁడు. జనితమందస్మితము మీఁదటిది ఉద్గతమందస్మితము.

అంతస్స్మితమునకు నిదర్శనము:

తే. కన్నియల కాటఁగఱపుచు నున్న నీకు
నకట సైరంధ్రి యిప్పు డేమయ్యె నేని
ఖేద మెద నించుకయును లేమిఁ గాదె పస్త్రి
తానసంబుతో నన్నిటు లడుగు టెల్ల.

అని ద్రోవదియనఁగా రిపుమర్దనంబు తనకు వెరవు గాకునికి గుప్తసాభిజ్ఞానంబుగాఁ దెలిపిన బలసూదన సూను పలుకులు విని పాంచాలి యంతస్స్మితకమనీయ కపోల యగుచు...

—విరాట. ఆ 3. ప ౮౯.

గుప్తసాభిజ్ఞానపు మాటలకు ఈ యంతస్స్మితము ఎంతయు అర్హమై ఉన్నదికదా!

—: ౨. జనితమందస్మితము :—

పాత్రల సంభాషణావసరముల ఇది పలుచోట్ల వాడఁబడినది. 'నవ్వు ఆననసీమ తోఁప' మున్నగు ప్రయోగము లన్నియు ఈ కుదుటికిఁ జెందినవే.

జనితమందస్మితమునకు ఒక చక్కని నిదర్శనము:

జనకసులభాసంవాదసందర్భమున

క. తన లోచనదీప్తుల న
మ్మనుజపతి మొగంబునందు మల్లడిగొనఁ జే
సిన నమ్మహాత్ముఁ దప్ప
ద్మనయనతలఁ బెఱిఁగి జనితమందస్మితుఁడై.

—శాంతి. ఆ. ౬. ప. ౧౭౨.

—: ౯. ఉద్గతమందస్మితము :—

ద్రోణుని నాలవనాఁటియుద్ధమున అర్జునుఁడు సైంధవుని తలఁదునిమి కురుబలముల ధాడరి గెలిచినపుడు కృష్ణమూర్తి ఇట్లే కర్ణునికూడ నోర్చితివయేని నాకు ప్రీతియగు ననియె. అప్పుడు అర్జునుఁ డిట్లనెను:

చ. ..............మహాత్మ! భవత్కరుణం బ్రతిజ్ఞ యే
ను నెఱపఁగంటిఁ బాండవమనోరథసిద్ధి భవద్దయాసమృ
ద్ధి యగుట వింతయే భవదధీనులకున్ విజయంబు ప్రాఁతె నీ
పను పొనరించువార మట భారము నీయది గాదె యెప్పుడున్.

ఆ. అనుడు నుద్గతమందస్మితాస్యుఁ డగుచు
దనుజమర్దనుఁడు...

—ద్రోణ. ఆ. ౫., పుట. ౨౬౮., పద్యము ౧౦.

—: ౧౦. అనాదరమందస్మితము :—

పాంచాలీపాండవులు విరటుపాలఁ దమ మెలంగవలయు పనుల నిశ్చయించుకొను సమయమున ధర్మనందనుఁడు ద్రుపదనందన కిట్లనియె—

క. మన వంశంబును వృత్తం
బును పెంపును గావఁజాలు పుణ్యసతివి దు
ర్జనులగు కులుకల తలఁపులు
గనుఁగొని యేమఱక మెలఁగఁ గావలయుఁ జామా!

వ. అనిన విని యాజ్ఞసేని యనాదరమందస్మిత సుందరవదనారవింద యగుచు 'గౌరవభారం బెడలంగనీక పాతివ్రత్యాచారముమై వర్తింతురు సైరంధ్రీజాతి వారు' అనినది.

—విరాట: పుట. ౧౨., పద్యము ౧౧౧.

తిక్కనయొక్క ఈ అనాదరమందస్మితప్రయోగముతోఁ శ్రీనాథుఁడు శృంగారనైషధములో 'అయ్యంబుజాక్షి యక్షిభ్రూవిక్షేపవిభ్రమంబున ననాదరంబు దెల్పిన' దను ప్రయోగమును పోల్చవచ్చును.

—: ౧౧. సాదరదరహాసము :—

అనాదరమందస్మితమునకుఁ బూర్తిగా వ్యతిరేకమైనది సాదరదరహాసము. దీనినికూడ తిక్కన వాడియున్నాఁడు.

సాదరదరహాసమునకు నిదర్శనము:

అర్జునునకు ఉత్తరను అప్పగించుచు విరాటుండు
గాదిలికూఁతు నుపలాలించి బృహన్నలదెసం గనుంగొని
సాదరదరహసితరుచిరాననుండై యిమ్మగువ నీకు నాట
గఱపందగు పాత్రంబగునే యని అడిగి...

—విరాట. ఆ. ౧, ప., ౨౮౮.

—: ౧౨. తిన్ననినవ్వు :—

తిక్కయజ్వ కల్పించిన చిన్నినవ్వులలో 'తిన్ననినవ్వు' అనున దొకటి.

నిర్వచనోత్తర రామాయణము సప్తమాశ్వాసము ౯౭-వ పద్యమున కవితిక్కన ఈనవ్వును వాడియున్నాఁడు. చూడుఁడు:

క. లీల నటు లసురవల్లభుఁ
గేలిపాత్రంబుఁ జేసి క్రీడించిన య

వ్యాలి భవదస్త్రమున కర
పాలియుఁ జాలమి నుతింపఁజాలదె యెందున్.

క. అని మునిపతి యివ్విధమున
దనుజపతిం జెప్ప రామధరణీపతి తి
న్ననినవ్వు మెఱయ నాతని
వినితిమి యిఁక నొకటి వినఁగ వేడుక యనుచున్.

తిక్కన కల్పించిన ఈ తిన్ననినవ్వును గౌరనమంత్రి పుణికి పుచ్చుకున్నాఁడు. లోహితాస్యుని గురించి:

'తిన్ననినగ వామతించు నీమోము
కన్నులపండువుగాఁ జూడకున్న'

అని చంద్రమతి విలపించినట్లు ద్విపదహరిశ్చంద్రోపాఖ్యానమున గౌరన వర్ణించియున్నాఁడు.

ఈ తిన్ననినగవును తన తొలికబ్బమగు నిర్వచనోత్తర రామాయణములో వాడినంతగా తన మలికబ్బమగు భారతమున తిక్కన వాడియుండలేదు.

—: ౧౩. లేఁతనవ్వు :—

తిక్కన తన తొలికబ్బమున ఎక్కువగాను, మలికబ్బమున తక్కువగాను వాడిన చిన్ననవ్వులలో లేఁతనవ్వు ఒకటి.

సీ. అల్లన మధురంపు సల్లాపరచనకు
లేఁతనవ్వున నునుఁబూఁత పూయ

—ని. రా. ఆ ౧., ప ౫౫.

చ. ...వనపాలికాకరపుటీకలితస్తబకంబు పుచ్చె మె
ల్పున పతి లేఁతనవ్వునఁ గపోలతలంబులఁ గాంతి వింతగాన్.

—ని. రా. ఆ ౮, ప ౨౫.

ఉ. సిగ్గును లేఁతనవ్వుఁ గదిసెం గమలానన ముద్దుమోమునన్.

—ని. రా. ఆ ౮., ప ౧౭౭.

అని ఇత్యాదిగా తిక్కన తనరామాయణమున రసోల్లాసమధురముగా ఈలేఁతనవ్వును పలుతావులఁ బ్రయోగించి ఉన్నాఁడు.

ఈలేఁతనవ్వును తిక్కన భారతమున సకృత్తుగమాత్రము వాడినాఁడు. నిదర్శనము:

సైరంధ్రిఁ జూచి రాగరసమగ్నుఁడైన కీచకుని వారించి చూచెదగాక యని సుధేష్ణ

సీ. తెలిగన్నుఁగవకు నెచ్చెలియైన లేఁతన
వ్వొలయంగ సరసంపుఁబలుకు వలికి

—విరాట: ఆ ౨., ప. ౬౮.

—: ౧౮. కొండొకనవ్వు :—

ఈనవ్వును తిక్కన తన తొలి, మలి కబ్బముల రెండింటి యందును సమానముగా వాడియున్నాఁడు.

నిదర్శనములఁ బరికింపుఁడు.

భారతమున అర్జునుఁడు వీరావేశంబునఁ గౌరవానీకంబు నాలోకించునప్పుడు ఉత్తరుఁడు

ఆ. పుట్టినంతనుండి యిట్టివి యెన్నఁడుఁ
గాన నెందు నిట్లుగాన చోద్య
మంది యంతరంగ మధికతఁ బొందిన
కతన నింద్రియముల కడఁక దక్క.

తే. అనినఁ గొండొకనవ్వొలయంగఁ జూచి
యింద్రనందనుఁ డాతని కిట్లనియె

నేను గలుగంగ నీ కేమి యెలమి వాహ
నముల కుబ్బుగ సంచోదనంబు సేయు.

—విరాట. ఆ ౫., ప ౧౧౮.

అశ్వమేధపర్వము ప్రథమాశ్వాసము ౨౧౭-వ పద్యమునఁ గూడ ఈనవ్వు కూర్పఁబడియున్నది.

ఇఁక ఈనవ్వుకు రామాయణమునుండి ఒకనిదర్శనము:

రాముఁడు లోకాపవాదభీతుఁడై తన్ను విడనాడిన వృత్తాంతము లక్ష్మణునివలనఁ దెలిసికొని సీత చింతించి

క. పలుకు లుడిగి పెద్దప్రొద్దా
కులదృష్టి మఱందిఁ జూచుఁ గొండొకనవ్వుం
దలయూఁచు ముక్కుపై నం
గుళి నిడు వెఱఁగందు నగలకుం గొలువిమ్మన్.

—ని. రా. ఆ. ౬., ప. ౧౯.

## 2

## పెద్దనవ్వులు

ఇట్లు తిక్కన తనరచనలందుఁ బదునాలుగు రకములఁ చిన్ననవ్వులను ప్రయోగించిఉన్నాఁడు. ఇఁక ఆతఁడు వాడిన పెద్దనవ్వులను పరామర్శింతము. అతఁడు ఏడురకముల పెద్ద నవ్వులను వాడిఉన్నాఁడు. వానిని వివరించుకొందము.

### —: ౧౫. పెలుచనవ్వు :—

పెద్దనవ్వులలోఁ దొలుత చెప్పఁదగినది పెలుచనవ్వు.

తన గదాదండమునఁ దొడలు విఱిగిపడిన దుర్యోధనుని చూచి భీముండు ‘పెలుచనవ్వి’ తనవారిని నాలోకించి

ఆ. శంక లేక కడఁగి సభ కట్టు పాంచాలి
వంటరానిదాని నొంటిచీర

తోన యున్న సాధ్వి వేనలి వట్టి యీ
డ్చించి నతనిఁ జూడుఁ డంచుఁ బోదలి.

—శల్య. పుట ౨౦౭. పద్యము ౨౫౨.

ఈ పెలుచనవ్వునకు మఱియొక నిదర్శనము.

భీష్ముని యష్టమదివసయుద్ధమున సునాభుఁడు విక్రమోద్ధతితో భీముని

ఆ. ...దాఁకుటయు బకాంతకుఁ డంత్యకా
లాంతకుండువోలె నలిగి బాములు
ముడివడంగ నొక్క వెడఁదయమ్ముఁ దల
నతికిపైచి పెలుచ నవ్వె నధిప.

మఱిరెండు నిదర్శనములు:

కర్ణపర్వము ద్వితీయాశ్వాసము ౧౭౭-వ పద్యమున శాకి హంసను యుద్ధమునకు రమ్మనఁగా ఆ హంస పెలుచ నవ్వెను; నిర్వచనోత్తర రామాయణము చతుర్థాశ్వాసము ౧౬-వ పద్యమున రావణుఁడు వానరవదనంబు నట్టు లున్న నందిమొగ మవ్వు దేరకొనంగఁ జూచి కడుఁ బెల్చ నవ్వెను.

ఈ రెండు నిదర్శనముల కేమిగాని మొదట యిచ్చిన రెండునిదర్శనములలోను పెలుచనవ్వినవాఁడు భీముఁడే. అనుశాసనికపర్వము చతుర్థాశ్వాసము ౩౧౭-వ పద్యమున కైకేయీశాండిలీసంవాదమున తిక్కన స్త్రీలు పెలుచనవ్వరాదని తెల్పి ఆసంగతి శాండిలిచేఁ జెప్పించినాఁడు. స్త్రీలకుఁ గూడదని స్పష్టముగఁ దెల్పిన- ఇతర పురుషపాత్రలకు అంతగా హత్తింపని ఈ పెలుచనవ్వును తిక్కన భీమునకును, రావణునకును హత్తించుటలో విశేష మున్నది.

రావణుఁడు రాక్షసుఁడు. తిక్కనదృష్టిలో భీముఁడును ఇంచుమించు అట్టిఁడే. భీముఁడు 'వైరిని వ్రచ్చి పచ్చినెత్తురు త్రిక్కొని గ్రోలిన క్రూరాత్ముఁడు' అతనిది 'వృకవిధము. అసురభంగి.' అశేషబంధుమారణమునకు అతని కెప్పుడును విచారము కల్గలేదు. భీమునినవ్వు హింసాప్రియము; హింసాకరము, శత్రుమారకసంతోషసూచకము.

—: ౧౬. ఉబ్బు మిగిలిన నవ్వు :—

ద్రోణుని నాలవనాఁటి యుద్ధమున కురుకుమారుల నేవురఁ గూల్చిన భీము నొప్పించుటకై కర్ణుఁడు—

ఆ. కదిసి దెబ్బ రేను గాండంబు లాతని
మేనఁ బఱపి యుబ్బుమిగిలి నవ్వె.

—ద్రోణ. పుట ౨౫౨., పద్యము ౨౧౩.

—: ౧౪. గేలిగొను నవ్వు :—

హంసతో డీకొని పోరాడుచున్న కాకిని చూచి
ఇతర వాయసములు అధికస్వరంబుల మొఱయుచు
హంసంబుల గేలిగొని నవ్వె.

—కర్ణ. ఆ ౨. ప ౬౭.

—: ౧౫. ఒత్తిలిన నవ్వు :—

భారతయుద్ధానంతరము దుర్యోధనుఁడు అశ్వత్థామను పాండవులను పరిమార్పుటకుఁ బంపెను. అతఁడు కృతవర్మ కృపాచార్యులఁ దోడ్కొని పాండవశిబిరంబున కభిముఖముగా అల్పిటికెలని కనతిదూరంబుగాఁ జని యారథికవరు లాలించి

క. అందలివార లెల్లను జయంబునఁ బొంగుచుఁ బేరలుంగు లం
దంద చెలంగఁగాఁ బలుక నార్వఁగ నొత్తిలినవ్వ నాకసం

బందినయట్టి ప్రోఁత విని యక్కడవోవఁగ నుల్కి రప్డు ద
మ్ముం దడవన్ వడిన్ వెడలుమూఁకలు ప్రోయుటగాఁ దలంచుచున్.

—సౌప్తిక. ఆ ౧., ప ౫.

## —: ౧౯. అపహాసము :—

ఈ హాసమునకు కొన్ని నిదర్శనములు:

1. చ. కురుపతి భీష్మ కర్ణ కృప కుంభజముఖ్యులు మత్సముద్యమ
స్ఫురణము సూచి పార్థుఁ డనుబుద్ధిఁ గలంగఁగ......

అని ఉత్తరుఁ డనునప్పుడు తల్పి దేశంబున నునికిం జేసి

క. విని ద్రుపదధరణిపతి నం
దన సామర్షాపహాసతరళహృదయయై
చని తద్వృత్తాంతము మె
త్తని పలుకులఁ జెప్పె నింద్రతనయునితోడన్.

—విరాట ఆ ౪., ప ౧౩.

2. గీ. అమ్మహీనాథుఁ డయ్యపహాస మెఱిఁగి
బొమలు ముడివడఁ గనుఁగవఁ బొడమఁ గెంపు

—శల్య. ఆ ౨. ప ౯౮.

భారతములో ఉత్తరకుమారప్రజ్ఞలఘట్టము అతివేలమైన హాస్యమునకు ఆటపట్టు; కావున ఇక్కడ తిక్కన అపహాసము ద్విరుక్తిగఁ బ్రయోగించినాఁడు.

కౌరవసేనాబలమునుచూచి భయపడి పరుగెత్తు ఉత్తరుని పట్టుకొనబోవుచున్న అర్జునునిగాంచి కౌరవబలంబునందు

ఉ. అజ్ఞులు కొంద ఱప్పు డపహాసము సేయుచు గూఢరూపకే
ళాజ్ఞత లేమిఁ దద్వికృతకాయముమీఁదను దృష్టినిల్పఁగా

విరాట. ఆ ౪., ప ౭౪.

—: ౨౦. రోషకలితంబౌ హాసము :—

మ. ...గ్రక్కున లేచి రోషకలితంబౌ హాస మానూలు నె
మ్మన ముద్వేగముఁ బొందఁజేయు బలసామగ్రి సముజ్జృంభణం
బున వానిం దలపట్టి తంచుటయు నేపుం జేవయుం జూపఁ వాఁ
డనుమానింపక జెట్టిదల్పిగొని కోపాటోప దీప్తాంగుఁడై.

—విరాట. ఆ. ౨, ప., ౩౨౦.

—: ౨౧. ఉద్భటహాసము :—

గోగ్రహణమునాఁడు అర్జునుఁడు గౌరవసైన్యంబుల నుఱుమాడుమ నుద్భటహాసోల్లాసభాసురముఖుండగుచు.

—విరాట ఆ. ౫., ప. ౨౯.

—: ౨౨. కలకలనవ్వు :—

తిక్కన ఉపయోగించిన పెద్దనవ్వులలో ఇది చాల మనోజ్ఞమైనదిగ నున్నది.

ద్రోణుఁడు, భీష్ముఁడు మొదలగు పూజ్యార్హుల 'మాన్యులఁ జంపుట మగపాడిగాదు' అని అర్జునుఁడు 'భండనంబు సేయకుండువాఁడ'.........అనిన విని కలకలనవ్వి నారాయణుండు నగున కిట్లనియె—

చ. వగవఁగ నేమియుం దగనివారికినై హృదయంబు గుందఁగా
వగచెదు బుద్ధిమాటలును వావిరి నాడెదు నీవు పండితుల్
వగతురె యున్నవారికి నవశ్యవిధేయతఁ జన్నవారికిం
దెగు వగలెల్లఁ జిత్తము ప్రదీప్తవివేకమయత్వ మొందినన్.

—భీష్మ, పుట ౨౩., పద్యము ౧౯౪.

ఈ కలకలనవ్వును తిక్కన శ్రీకృష్ణపాత్రపట్ల ఎక్కువగా వాడిఉన్నాఁడు.

అర్జునునితో సంభాషణావసరమున శ్రీకృష్ణుఁడు కల

కల నవ్విన ఘట్టము పైన ఉదాహరితమై ఉన్నది. ఇఁక భీమునితో సంభాషణావసరమున శ్రీకృష్ణుఁడు కలకలనవ్విన ఘట్టమును ఒకదానిని పరామర్శింతిము.

రాయబారమప్పుడు శ్రీకృష్ణునితో భీముఁడు 'యెవ్విధమున నైనను సంధి సేయువలయు' నని అనును. 'అనుటయుఁ బిన్ననవ్వ నగి యంబుజనాభుఁడు పల్కె నెన్నఁడున్ విన నివి భీముపాలఁ గడువింతలు వింటిమి...

క. తెలి పెట్టిదియో యెన్నఁడు
నెఱుఁగని నీయట్టివాని కెవ్వారలో యీ
పిఱికితన మింత యలవడఁ
గఱపినవా రనుచు శౌరి కలకల నవ్వెన్.

—ఉద్యోగ. ఆశ్వా ౩, ప. ౫౨.

పిన్ననవ్వుతో ప్రారంభమై శ్రీకృష్ణుని భాషణము ఈ సందర్భమున కలకలనవ్వుతో పర్యవసిత మయ్యెను. ఈనవ్వులతోనే తిక్కన శ్రీకృష్ణపాత్రను తెన్నుగఁ బోషించినాఁడు. 'సహోదరు లాజి నాయాసపడుట కోర్వమియుఁ, గౌరవులఁ జంపనొల్లమియును గలుగు నెయ్యంబు పెంపునఁ గరుణ నార్ద్రుఁడైన పవనజుఁ బురికొల్ప నాత్మఁ దలఁచి' శ్రీకృష్ణుఁడు ఈ సందర్భమున తన సంభాషణమును పిన్ననవ్వుతో మొదలు పెట్టి కలకలనవ్వుతో ముగించినాఁడు.

ఇక్కడ భీముని పురికొల్పుటకు శ్రీకృష్ణుఁడు కలకల నవ్వినాఁడు. పైన ఇచ్చిన నిదర్శనములో అర్జునుని పురికొల్పుటకు శ్రీకృష్ణుఁడు కలకలనవ్వినాఁడు.

శ్రీకృష్ణునిచే కలకలనవ్వించుటే కాక తిక్కన శ్రీకృష్ణునిచే రెండు తావులయందు కలకలనవ్వును ప్రస్తావింపఁజేసినాఁడు.

తిలకింపుఁడు :

1. కృష్ణుఁడు ధర్మరాజుతోఁ గౌరవుల దుర్ణయంబు సెప్పుచు కపటనెత్తంబు నెపంబుగా మిమ్ము వెడల నడుచునప్పుడు దుర్యోధన దుశ్శాసన శకుని సూతనంద నులు పురిలోఁటదక్క కలకలనవ్వుచుం బలికిన పలుకు లుగ్గడింపవచ్చునే.

—ఉద్యోగ. ఆ. 3., ప 32.

2. శ్రీకృష్ణుఁడు ద్రౌపది నూరార్చుచు

క. అలనా! యేడుగుము నీ యే
డ్పులకొలఁదియె కురునృపాలపుత్రకళత్రం
బుల యేడ్పు లింక వానిం
గలకలనవ్వుచు వినంగ గాలంబయ్యెన్.

—ఉద్యోగ. ఆ 3., ప ౧౨౧.

ఇట్లు శ్రీకృష్ణునిచే రెండు తావులందు కలకలనవ్వును ప్రస్తావింపఁజేసిన, శ్రీకృష్ణునిచే రెండుఘట్టములందు కలకల నవ్వును ప్రయోగింపఁజేసిన తిక్కన భారతమున మఱియొక తావున (శల్యపర్వము-ఆ ౨. ప ౪౭), నిర్వచనోత్తరరామా యణమున ఒకతావున (ఆ ౭. ప 3౪) ఈ కలకలనవ్వును వాడినట్లు కనిపించుచున్నది.

# 3

## గొప్పనవ్వులు

ఇంతవఱకు తిక్కన వాడిన చిన్ననవ్వులను, పెద్దనవ్వు లను దృష్టాంతీకరించుకొని ఉంటిమి. ఇఁక తిక్కన గొప్ప నవ్వులను ఉదాహరించుకొందముగాక !

## —: ౨౩. ఎలనవ్వు :—

ఈఎలనవ్వు తిక్కనకు చాలప్రియమైనదిగాఁ గనిపించు చున్నది. శృంగారఘట్టములందును, సమరసందర్భములందును ఆకవిగ్రామణి ఈనవ్వును వాడియున్నాఁడు.

శృంగారఘట్టము లందలి ఈనవ్వునకు నిదర్శనము:

అష్టావక్రుని చిత్తశుద్ధిఁ బరీక్షించుటకు ఉత్తరదిశ స్త్రీరూపము దాల్చి అతనిం గవయ నూంకించెను. అతఁడు పోవ నుద్యమించె. అప్పు డామృగాక్షి ఎలనవ్వొలయ 'కార్య మగుటయు సరిగెమగాక' అనియె.

—అనుశాసనిక. ఆ ౨., ప ౧౬.

ఇఁక సమరసందర్భములందలి ఈనవ్వునకు నిదర్శనములు.

ఉత్తరునివలన శమీవృక్షంబునుండి దివ్యాయుధంబులు తీయించి ధరించి యెలనవ్వొలయంగ నెక్కె నేడ్తెఱ రథమున్.

—విరాట. ఆ: ౭, ప: ౧౬౫.

గోగ్రహణము నాఁటి యుద్ధమున తన్ను గవిసిన కౌరవ బలమును

క. కనుఁగొని యెలనవ్వొలయ ము
దమున గరువంపుఁజెన్ను దలకొనఁగా న
ర్జునుఁడు విరాటసుతున కి
ట్లనుఁ గేవలవీరరసమయాత్మకుఁ డగుచున్.

—విరాట. ఆ ౫., ప ౩.

భీష్ముని యష్టమదివసయుద్ధమున భీముఁడు గురుండగు ద్రోణాచార్యుని మూర్ఛ మునుంగ నేసిన

మ. ధనురాచార్యునిఁ జూచి తత్తనయుఁడున్ ధాత్రీశుఁడున్ భీము మా
ర్కొని రాతం డెలనవ్వు చెన్నుగ గదాఘోరాకృతిం దేరు డి
గ్గి......

—భీష్మ. ఆ. 3., ప. ౧౩౯.

ఇక్కడ ఎలనవ్వు నవ్వినవాఁడు భీముఁడు. భీముఁడు సాధారణముగఁ బెలుచనవ్వినట్లును, ఉబ్బుమిగిలి నవ్వినట్లును వర్ణితుఁడై ఉన్నాడు. అట్టి భీముఁడు ఇక్కడ ఎలనవ్వ నవ్వినట్లు వర్ణితుఁడు కావుటకుఁ గారణ మేమి? తేరు దిగి భీముఁడు ఇక్కడ గదాయుద్ధము చేసినాఁడు. గదాయుద్ధము భీముని అభిమానయుద్ధము. అగుటనే అతఁడు ఈఘట్టమున ఎలనవ్వు నవ్వినట్లు తిక్కన అభివర్ణించినాఁడు.

యుద్ధావసరమున ఈఎలనవ్వును భీమార్జునులకే కాక ధర్మరాజునకుఁ గూడ తిక్కన హత్తించినాఁడు. చూడుఁడు:

శల్యుఁడు, ధర్మరాజు యుద్ధము చేయునప్పుడు

చ. బరవస మొప్ప మద్రపతి పాండవముఖ్యునిమీఁదఁ గాండముల్
గురిసిన నానృపాలుఁడు నకుంఠితుఁడై పదునాల్గుతూపు ల
న్నరపతిమేనఁ గ్రుచ్చి యెలనవ్వున నొప్పిన నమ్మహీశు పే
రురమున నాటె సారథికిఁ ద్రొక్కసముజ్జ్వలబాణ మేత్తెఱన్.

—శల్య. పుట ౧౮౭., ప ౧౫౬.

—: ౩౮. ప్రౌఢస్మితము :—

తిక్కన వాడిన ప్రౌఢస్మితమునకు నిదర్శము నిర్వచనోత్తర రామాయణమునఁ గలదు.

వాలి రావణునిఁ జంకలో నిఱికించుకొని నాలుగు సముద్రములను ముంచి నిజపట్టణోపవనభూమికిఁ దెచ్చి సుఖోపవిష్టుఁడై

శా. కోపంబాఱినఁ జంక వాపి ధరణిం గూర్చుండఁగాఁ బెట్టి ని
ష్పాపోల్లాసకటాక్ష మల్ల నొలయం బ్రౌఢస్మితజ్యోత్స్నల
జ్జాపూరావృత తన్ముఖాబ్జములపై సాంద్రంబుగాఁ జూపి ని
ర్వ్యాపారామరసుందరీప్రకరగర్భస్రావణున్ రావణున్.

—ని. రా. ఆ ౭., ప ౮౭.

—: ౨౫. బెట్టు నవ్వు :—

భీష్ముఁడు నకులునకు ఖడ్గప్రభావంబు తెఱం గెఱింగించు ఘట్టమునఁ ఈనవ్వు అభివర్ణితము.

తే. హరుఁడు బెట్టుగ నవ్వి పెల్లార్చుటయును
విని సముద్ధత రయమున దనుజకోటి
మునుగఁ బఱతెంచి తాఁకిన మునుముకొని వ
ధించి యిల యెల్ల నెత్తుటముంచె నతఁడు.

—శాంతి. ఆ ౩., ప ౮౮౭.

—: ౨౬. కన్ను ల నవ్వు :—

భారతమున ఈ కన్నులనవ్వును తిక్కన రెండు, మూఁడు తావులయందు వాడినాఁడు.

భీష్ముని ప్రథమదివసయుద్ధమున

చ. సరభసుఁడై యుధిష్ఠిరుఁడు శల్యునిఁ దాఁకుటకు నాతఁ డమ్మహీ
శ్వరు మహనీయచాప మనివారణఁ ద్రుంచిన నొండు విల్లు భీ
కరతర శీఘ్రలీలఁ గొని కన్నులనవ్వుచుఁ బాండవాగ్రజుం
డరిబల ముక్కడఁగ వడి నాతనిపైఁ గురిసెన్ శితాస్త్రముల్.

—భీష్మ. ఆ. ౧., ప ౨౫౪.

మఱిరెండు నిదర్శనములు:

క. కన్నుమునుఁగఁ దివియఁగ లే
కున్నను ద్రావఁదగు నీరు లోఁదవిన హయముల్

నిన్ను గెలిపించు వనవుఁడుఁ
గన్నుల నగి యర్జునుండు గిల గిల యనుచున్.

—ద్రోణ. పుట ౨౧౯., ప ౧౬౨.

సీ. ..........................

...లోచనముల నవ్వు నెఱయఁ
గృపుని నాలోకించి క్రీడి తద్వక్షస్థ
లంబునఁ గ్రూరభల్లంబు నాట.

—విరాట. ఆ ౫., ప ౧౫౦.

—: ౨౪. కన్నులనిప్పులురాలనవ్వు :—

తనపాత్రలచే కన్నులతో నవ్వించుటే కాక కన్నుల నిప్పులురాలునట్లును తిక్కన నవ్వించినాఁడు. చూడుఁడు:

భీష్ముని చతుర్థదివసయుద్ధమున దుర్యోధనుఁడు

ఉ. తమ్ములు వీఁగినం బతి యుదగ్రత భీము నెదిర్చి యార్చుచుం
దొమ్మిది యమ్ములం దనువు దూఁటులు సేసిన సూతుఁ బిల్చి వే
గమ్మ రథమ్ము పై కరిగి కన్నులనిప్పులురాల నవ్వి యొ
క్కమ్మడి నాతఁ డేసె నృపు నుగ్రగతిం బది నారసంబులన్.

—భీష్మ. పుట ౫౭., ప ౨౩౨.

అమానుషగదాశక్తిసముద్దాముఁడగు భీమునకు ఈ నవ్వు ఎంతయు సముచితమై యున్నదికదా !

—: ౨౫. కినుకనూనిననవ్వు: —

ద్రోణుని నాల్గవనాఁటియుద్ధమున వృషసేనుండు లోనగుఁ నెనమండ్రు రథికు లొక్కపెట్ట పెల్లేసిన నర్జునుండు 'కినుక నూనిన నవ్వు రౌద్రరసంబు నలంకరింప' వారిని అందఱను నిలువరించె.

—ద్రోణ. ఆ. ౩., ప ౨౨౫.

ఈనవ్వును తిక్కన మఱియొకచోటకూడ వాడి యున్నాఁడు.

కంకుఁడు

చ. కురుబలమేల దైత్యసురకోటులు వచ్చిన గెల్వరాద యు
త్తరునకు వాబృహన్నల రథంబున దుర్దమలీల నుండఁగన్

వ. అనిన విని సక్రోధహాసోల్లాసవికృతాననుండై మత్స్యమహీనాథుండు

—విరాట ఆ. ౫., ప ౨౫౪.

కినుక నూనిన నవ్వుకు సక్రోధహాసము సంస్కృత భాషాపర్యాయపదము కదా!

—: ౪౯. కినుకమునుంగు నవ్వు :—

ద్రోణాచార్యుని రెండవనాఁటి యుద్ధమున భగదత్తుఁడు సుప్రతీక మను ఏనుఁగును బంపి పాండవసైన్యంబులం గలంచు చుండిన వానిపై అర్జునుండు ఎత్తిపోవుచుండ సుశర్మ అడ్డు వచ్చెను. అర్జునానుమతిని కృష్ణుండు తేరు మరల్చెను. అప్పుడు—

చ. ..................................................మోమునం
గినుక మునుంగు నవ్వొలయ గ్రీడి త్రిగర్తుని చాపదండకే
తనములు ద్రుంచి..........................యా
తని వరలీల నొంచిన నతండు వెసంబడి మూర్ఛవోయెను.

—ద్రోణ. పుట ౧౪౯. ప ౩౪౪.

కినుక నూనిన నవ్వుకును ఈనవ్వుకును ఉన్న భేదము గమనింపఁదగినది. ఆనవ్వు కినుకను పూసినది ఈనవ్వు కినుకలో మునిఁగిపోయినది. కినుక నూసిన నవ్వులో ప్రాధాన్యము నవ్వుది. కినుక మునుంగు నవ్వులో పై చేయి కినుకది.

## —: ౩౦. కటికినవ్వు :—

ధర్మరాజువలన అభిమన్యునిమరణము విని అర్జునుఁడు కొలఁదిఇడరాని దుఃఖమున పొగిలి

ఆ. అవుడు గఱచి యొఱ్ఱనగు నాననంబుతో
బొమలుముడిచి చెమట వొడమ మేను
కంప మొందఁ గనలు గదిరిన కటికన
వ్వొసక మెసఁగ నవ్వు కిట్టు లనియె.

మ. వినుఁడీ నాదు ప్రతిజ్ఞ నీవు నిఖిలోర్వీనాథులున్ సింధురా
జు నవశ్యంబును నెల్లి సంపుగు భయస్థుండై నినుం జొచ్చినన్
వనజాక్షున్ శరణంబు వేఁడినను గర్వంబేది నన్నుం డగం,
గనినం బోరు దొఱంగిపోయిన నెఱుంగంగాని సత్యవ్రతా!

—ద్రోణ. పు ౨౦౮., ప ౨౨౫.

అభిమన్యుమరణకారణమున ఉదయమునొంది సైంధవ మరణము సిద్ధిగాఁ గల నవ్వు కటికినవ్వుగాక మఱియొకటి యెట్లగును? ఈ కటికినవ్వు ఒకమరణమువలన మఱియొకమరణము గొఱకుఁ బొడమిన నవ్వు.

శ్రీనాథుఁడు కాశీఖండమున దీనిని వాడియున్నాఁడు.

## —: ౩౧. నవ్వుగాని నవ్వు :—

ద్రోణుని మూఁడవనాఁటి యుద్ధమున పద్మవ్యూహంబు భేదించుకొనిపోయి అభిమన్యుఁడు కురుసైన్యంబును పీనుంగు పెంటలుఁ సేసిన నప్పు డక్కుమారు నాలోకించి వికాసభాసిత వదనుం డగుచు గురుండు గురుపత్ని నెఱనుదాఁకఁ బలుకవలయునను తలంపున నతండు వినుచుండం గృపాచార్యుతో నిట్లనియె—

ఉ. తమ్ములు నన్నలుం జెలులుఁ దండ్రులు మామలు భృత్యులుం బ్రమో
దమ్మునఁ దేల నిట్లు వడిఁ దాఁకెడు నీ విజయాత్మజుండు ఘో
టమ్ములుఁ గుంజరమ్ములు బహల్పడఁ దేరులు నుగ్గుగాఁగ నా
నమ్మిన యోధవీరులు వినాశము భంగము నొంది నొక్కఁడున్.

ఆ. అనిన వెలుకఁబాఱి యతిదీనమగు నాన
నమున నవ్వుగాని నవ్వు నెఱయ
సౌమదత్తి కర్ణశల్యాదులగు యోధ
జనులతోడ నిట్టు లనియె విభుఁడు.

—ద్రోణ. పుట ౧౨౨, ప ౪౪.

దుర్యోధనుని 'వెలరుపాఱునట్టి వగ'కుఁ దగిన నవ్వే కదా ఇది. అతఁడు నవ్వినాఁడు. కాని అది నవ్వు అనిపించుకొనదు. కావుననే లోకజ్ఞుఁడగు తిక్కన దానిని నవ్వుగాని నవ్వు అన్నాఁడు.

"బలిమికోలున నవ్వు దళుకొత్తినను మొగం
బెల్లఁ దాసై యున్న వెల్లఁదనము"

—హరివంశము.

అను ఎఱ్ఱన వర్ణనమును,

సైరంధ్రియెడ కామాయత్తుఁడైన కీచకుని వర్ణించుచు

"కడువికారంబుగా నోఁడ లెల్ల విఱుచుచు
మలఁగి రిత్తకు రిత్త సెలఁగి నవ్వు"

—విరాట. ఆ ౨., ప ౨౫౦.

అను తిక్కనప్రయోగమును ఈసందర్భమునఁ దడవ నగును.

—: ౩౭. ఎఱ్ఱనవ్వు: —

ద్రోణుని మూఁడవనాఁటి యుద్ధమున పద్మవ్యూహము

భేదించుకొనిపోవుచున్న అభిమన్యుని కర్ణుఁడు కదిసిన ఆతని

తే. ...భుజవీర్య శౌర్య విశేషభంగి
సరకుగొనక యుబ్బాలుండు సమదలీలఁ
బెనఁగ నయ్యంగరాజు డస్సిన నెఱింగి
యతనితమ్ముఁ డయ్యర్జునసుతునిఁ దాఁకి

చ. హయములమీఁద సూతుపయి నాతనియంగములందు నస్త్రసం
చయ మడరించినం గమలచారుముఖంబున నెఱ్ఱనవ్వు చె
న్నయి విలసిల్ల భల్లమున నన్నరనాథుఁడు ద్రుంచె విద్విష
ద్భయదవిలాసబాహుసముదగ్రత వాని శిరంబు గ్రక్కునన్.

—ద్రోణ. పుట ౧౭౩., ప. ౫౪.

కవిచమత్కారమువలన నవ్వుకు రంగు హత్తింపఁబడినది. ఈ రంగునవ్వు ఇక్కడనేకాక తిక్కన రచనలో మఱియొకతావునఁ గూడ దొరకుచున్నది. చూడుఁడు:

ధర్మజుం డశ్వమేధదీక్షుం బూని పుడమిఁ దిరుగవిడచిన హయమును బట్టిన త్రిగర్తదేశాధిపతులను అర్జునుఁడు—

చ. బలపదు పొం డనంగ నిలువంబడ కేపున సూర్యవర్మ యు
బ్బలియునిమీఁదఁ గ్రూరశరపంక్తి నిగిడ్చినఁ ద్రుంచెఁ జిప్పయు
మ్ముల నది యెఱ్ఱనవ్వు తనమోమును దమ్మి! శేఁతఱయొండరై
చెలువము చెన్ను వింతలుగఁ జేయఁగ నావిజయుండు భూవరా!

—అశ్వ: పుట ౨౭౮., ప ౮.

ఇందులో ద్రోణపర్వములోని ఎఱ్ఱనవ్వు అభిమన్యునిది; అశ్వమేధపర్వములోని ఎఱ్ఱనవ్వు అభిమన్యుజనకుఁడయిన అర్జునునిది. పాండవవీరులలో అగ్రగణ్యులయిన అర్జునునకును, అతని కుమారుఁడైన అభిమన్యునకును విశిష్టమైన ఈఎఱ్ఱనవ్వును తిక్కన హత్తించుట ఒక విశేష మనక తీరదు.

చూడ్కికి ఎఱ్ఱరంగు హత్తించి ఎఱ్ఱనిచూడ్కి అనుట కవులకుఁ బరిపాటివిషయము. ఈపరిపాటివిషయమునకు తిక్కన్నయే మొదటిపేరై ఉన్నాఁడనినను సత్యదూరముకాదు. తిక్కకవి ఎఱ్ఱనిచూడ్కి వర్ణనమును తిలకింపుఁడు:

అర్జునుఁడు దుర్యోధనునితో యుద్ధంబు సేయుచుండఁగా వికర్ణుండు వచ్చి

ఉ. వీఁక నెదిర్చి యిట్లు కురువీరులకుం బ్రమదం బొనర్పుచాం
దాఁకినఁ గ్రోధవేగసముదగ్రత 'నెఱ్ఱనిచూడ్కిఁ' జూచి పే
రాఁకలితోఁడనున్న జము నాకృతి భీషణరేఖ యొప్పఁగా
గ్రేఁకని నారసంబుదొడి క్రీడి కరిన్ దృఢముష్టి నేసినన్.

—విరాట. ఆ. ౫, ప ౧౯౩.

చూడ్కికి ఎఱ్ఱరంగు హత్తించి ఎఱ్ఱనిచూడ్కి అని వర్ణించుటను తెనుఁగుకవులు పలువురు చేకొనిఉన్నారు. కాని నవ్వుకు ఎఱ్ఱరంగు హత్తించి ఎఱ్ఱనవ్వు అని వర్ణించుట తెనుఁగుకవులలో తిక్కనకు ఒక్కనికే చెల్లిన విషయ మన్నను అతిశయోక్తి అనిపించుకొనదు.

నవ్వు అనునది మానవుని అనన్యగుణములలో నొకటి. కావుననే ఆంగ్లకవి ఒకఁడు 'ఈప్రపంచములో మానవుఁడు తప్ప మఱి యేజంతువు కాని నవ్వలేదు' అనినాఁడు. ప్రాణులలో మానవునికి ఒక్కనికే గల వరప్రసాదములలో నవ్వు ఒకటి. అట్టి విశేషవరప్రసాదమైన నవ్వును ఆంధ్రకవిగ్రామణి తిక్కన సోమయాజి పలురకములుగా ప్రవచించియున్నాఁడు. ఈవిషయమును తలఁచినఁగొలఁదిని తిక్కనప్రజ్ఞ ఆహాపుట్టించునదిగా నున్నది.

నవ్వు ప్రేమభావము ధరించు రంగు అని ఫ్రెంచికవి ఒకఁడు అనినాఁడు. ఆంధ్రకవి తిక్కన వాడిన అన్ని నవ్వులను పరికించినవారికి నవ్వు ఒక్క ప్రేమభావమును ధరించు రంగు మాత్రమే కాక అది యుద్ధభావము ధరించు రంగుకూడ కాగలదనుట స్పష్టమగును. కవితిక్కన విశేషవిశిష్టత ఇందే కలదు.

మహనీయుఁడు కాలి స్తిసీసు నవ్వును గుఱించి ఇట్లు చెప్పియున్నాఁడు :

'మానవుని వ్యక్తిత్వప్రాచుర్యమునకు చిహ్నము నవ్వు; స్వాతంత్ర్యభావప్రకటనకు గుఱుతు నవ్వు; తనకుఁ ధారసపడు కష్టములకు దాను దాసుఁడను కానని మానవుఁడు చేయు సుందరసూచన నవ్వు.'

మహాభాగుఁడు హెన్రీవార్డుబీచరు నవ్వును గూర్చి ఇట్లు చెప్పియున్నాఁడు:

'పుష్పములు నవ్వలేవు. నవ్వు అను అలంకారము వానికి లేదు. కాని నవ్వలేని మొగమును- వికసింపలేక తొడిమలోనే ఎండిపోయిన మొగ్గవంటిది- అని మాత్రమే చెప్పవలసియుండును ...నవ్వు అనునది ముఖము అను గవాక్షములోని వెలుతురు. ఆ గవాక్షముమూలమున హృదయము తన ఆనందమును, ఆమోదమును చూపును, ...మణులు, వజ్రములు నేత్రములు మిఱుమిట్లుగొల్పునట్లు ప్రకాశింపవచ్చును. కాని నవ్వునప్పుడు మానవుని నేత్రములలోఁ గానవగు ప్రకాశమందలి దివ్యత్వము ఆ రాళ్ళకాంతిలో లేదు...హాసము పగటి వంటిది. గంభీరత రాత్రి వంటిది. మృదుహాసము ఆ రెండిటిని అనుసంధించు ఉషఃకాలమువంటిది.'

మహనీయుఁడు కాలిస్తనీసు, మహాభాగుఁడు బీచరు నవ్వును గుఱించి చెప్పిన ఈ మాటలు మాన్యములైనవి. కాని తిక్కనకవి వివరించిన ముప్పదిరెండురకముల నవ్వులను తిలకించినవారికి ఆ మాన్యవచనములు సామాన్యములైనవిగా, అసమగ్రమైనవిగాఁ దోఁచితీరును.

౬

# వరూధిని మాయలు

'కలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్'

మనుచరిత్రమందలి స్త్రీపాత్రములలో వరూధిని శృంగారపుఁ బ్రోవు. ఆమె గంధర్వాంగన. అందును వేశ్య. అట్లగుట హావభావశృంగారాదిసుకుమారచేష్టలచేఁ బురుషుని వశ్యము కావించుకొనఁగల్గిన చదురాలు.

వైషయికేచ్ఛావిముఖుఁడగు ప్రవరుని దన టోపీలోఁ బడవైచుటకై ఆమె సల్పిన మోహంపునటలు, చేసిన యుక్తివాదములు, పోయిన పోఁకలు, పచరించిన మాయలు వరూధిని శృంగారరసాలవాల మనుటకు నిదర్శనములు.

నలకూబరసన్నిభుఁడగు ప్రవరుని దిలకించినతోడనే 'ఝళంఝళత్కటకసూచితవేగపదారవిందయై' లేచినది. ఇది ముందు వరూధిని చేయఁబోవు మాయలకు మచ్చు.

తెచ్చికోలునునుసిగ్గుదొంతర లాందోళింప ఆమె వెనువెంటనే 'పూచిన యొక్క పోఁకనునుబోదియ మాటునఁ' జేరినది. తా నచ్చటనుండి తనివార 'విలోకనప్రభావీచికలం దదీయపదవీకలశాంబుధిని వెల్లిగొల్ప' వచ్చును. పైఁగాఁ బ్రవరుని ఊరింపవచ్చును.

త్రిలోకమోహనకరమగు సౌందర్యరాశి మెఱపువలెఁ గనిపించి అంతలో దృష్టిపథమునుండి తొలఁగుటచేఁ జూపఱకారూపరాశిని మఱలఁజూడ నాసక్తియు, నాతురతయు నెసరేఁగును.

అతిపరిచయముచే నెట్టిదాని విలువయైనను సన్నగిల్లు ననుట వరూథిని ఎఱిఁగిన పాడి. కావుననే ఆమె తనరూపము ప్రవరునకు ఊరించిఊరించి చూపవలెనని పోఁకబోదియుఁ జేరినది. ఊరీఊరని ఊరుగాయవలెఁ గనిపించియుఁ గనిపించని సౌందర్యరాశి అత్యంతసౌఖ్యావహముగదా!

తన్నుజూడఁ బ్రవరున కాసక్తియు, నాతురతయుఁ బుట్ట నాయొసపరిభాగులాడి వేసిన ఎత్తుగడ ఇది.

కొంతతడ వాతని రూపరేఖావిలాసములకుఁ జొక్కుట తోడనే ఆమెకు లజ్జాపరిత్యాగమునకు వలయు రసపారవశ్యము గల్గినది. 'కాముకస్య కుతో లజ్జా' అని కదా పండితోక్తి.

అట్లగుట నామె స్త్రీజనస్వభావసిద్ధమగు లజ్జ వీటిఁ బుచ్చి, 'అంఘ్రికటకంబుల్ మ్రోయ' నడచివచ్చి, అడ్డము నిల్చినది- ప్రవరుఁడు ముందుకు సాగిపోకుండుటకై. వచ్చిన వారికి నెదురుసన్నాహము చేయుట లోకమర్యాద.

ఎదురుగా వచ్చిన ఎమ్మెలాడిని విలోకించి విభ్రాంతుఁడై ప్రవరుఁడు తనకథ నెఱిఁగించినాఁడు. అంతట నామె ఒసపరివన్నెలు, చిన్నెలు నెఱపి సెలవివాఱ నవ్వినది. నూత్న పురుషునితో సంభాషింప నుంకించు మటుమాయలాడి పచరించు నెఱనీటులేకదా ఇయ్యవి!

నవ్వి ఆమీఁద ఆమె నర్మగర్భముగా నిట్లన్నది:

ఉ. ఇంతలు కన్నులుండఁ దెరు వెవ్వరి వేఁడెదు? భూసురేంద్ర! యే
కాంతమునందునున్న జవరాండ్ర నెపంబిడి పల్కరించు లా
గింతయు కాక, నీ వెఱుఁగవే మునువచ్చిన త్రోవచొప్పు; నీ
కింత భయంబులే కడుగ నెల్లిదమైతిమె? మాట లేటికిన్.

ఈవచనములచే నుత్తరకథావిస్తృతికి మూలసాధన మగు శృంగారరసోద్రేకము గల్గించుటకు బీజములు విత్త యత్నించినది.

'ఇంతెలు కన్నులు' అనుటచే నాతనిరూపుపైఁ దన చూపు నిలిచినదని సూచించినది. 'ఏకాంత' మనుటచే భయ సంకోచాదుల కిసుమంతయుఁ దావు లేకుండుటయు, 'జవరాండ్ర' ననుటచేఁ దనభోగ్యతాసౌభాగ్యమును దెలియఁ జేసినది.

అంతటితో నిల్వక నిజాభిజాత్యము నేకరువు పెట్టి తన అతిశయముల నభివర్ణింప నారంభించినది

పుట్టుక సుధాబ్ధిలో; చంద్రుఁడును, లక్ష్మియుఁ దోడఁ బుట్టినవారు; ఱాలనుగూడఁ గరఁగించు గాంధర్వము కులవిద్య; కళాశాస్త్రమర్యాద దొండాకుపసరుతో నేర్చినది; యజ్ఞ కర్మలు ఉంకువలు; మేరుపర్వతప్రదేశములందుఁ గల్పవృక్ష ములనీడఁ బచ్చరాచట్టుగమి రచ్చపట్టు; పద్మసంభవవైకుంఠ భర్గసభలు సాముగరిడీలు; ప్రాణసఖు లన్ననో! ఉదార గుణాఢ్యలు, శృంగారరసాలవాలములు నగు రంభాదులు; విహారవనసమూహములో! 'నభోవాహినీలహరీశీతలగంధ వాహపరిఖేలన్మంజరీసౌరభగ్రహణేందిందిరతుందిలంబులు.'

ఇట్లు అతిశయములు వర్ణించి తన అభిలాష నర్మగర్భ ముగా వెల్వరించినది.

ఈయతిశయవర్ణనము చొక్కపొడివలెఁ బనిచేయకుం డునా? కోరినదే తడవుగాఁ బ్రవరుఁడు తన ఇంట నాతిథ్యముఁ గైకొనకుండునా! అనుకొన్నది.

'కుసుమశరాసన !'– అని సంబోధించినది. ఇది సాభి ప్రాయమైన సంబోధనముగాని అటుకొటుమాట కాదు.

'సముదంచన్మణిభవనాసీనత' సేద దీఱుచున్నది. ఆహ్వానమునఁ గూడఁ దన అతిశయవర్ణనము మేళవించినది. 'మా యింటి విందవైతివి' అని కానే అనివేసినది. మఱియు

'తే. కుందనమువంటి మేను మధ్యందినాత
పోష్మహతిఁ గందె వడఁదాఁకె నొప్పులొలుకు
వదన మస్మద్గృహంబు పావనము చేసి
బడలికలు వాసి చనుము'

అని వేఁడికోలు.

'కుందనమువంటి మేను, ఒప్పులొలుకు వదనము.' అతిథి సత్కారముచేయు నపుడు అతిథిబ్రాహ్మణుని అంగసౌందర్య ప్రశస్తి యేలనో? ఏమో? గంధర్వాంగనల లోగుట్టు విమర్శకుల కెట్లు తెలియును?

ఎంతవఱకు నడుచుచున్నది వరూధిని వాక్యావసానము? తన అతిశయవర్ణనముచేఁ బ్రవరుని ఆశగొల్పం జూచినది. చక్కని మాటలాడి సత్కరింప నెంచినది. ఇంతెదనుక మాటలఁ దేటల మరపి మెప్పించి బుట్టలోఁ బెట్టఁదలఁచినది.

కాని ఈపలుకు లన్నియు సముద్రమధుబిందువు లయినవి. పరమశ్రోత్రియశిఖామణియగు ప్రవరుని చిత్తమునకు వరూధిని మహిమాతిశయము, అభిలాషవిశేషము, అత్యంతభోగత్వము- ఇవి యేమియు గ్రాహ్యము కాలేదు.

ఆతనిమనమున శృంగారరసము మొలకెత్తించుట ఇంతవఱకు కుంపటిలోఁ దామర మొలపించుటయే ఐనది. అగుఁగాక! వరూధిని అంతతో నిరుత్సాహము చెందినదా? లేదు.

వాని బేలతనమునకు లేఁతనవ్వాననసీమఁ దాండవింపఁ జేసినది, వరూధిని.

అక్కడి విశేషములఁ జూపి భ్రమపెట్టఁ దలంచినది. 'ఎక్కడి యూరు! కాలు నిలువ కింటికిఁ బోయెద నని కలవరించెదవు. ఇక్కడి రత్నకందరములు, నందనచందనోత్కరములు, గాంగసైకతములు, లవలీనికుంజములు- మీగాకటీర నిలయములకు సరిరాకపోయెనా!' అని చప్పుతెగవేసి అడిగినది. వీని కాశపడి బ్రాహ్మణుఁ డుండకపోఁడని ఆమె అభిప్రాయము.

వరూథిని అంతతో నూరకున్నదా! లేదు.

ఆమగఁబోయెడు అంగనకు సిగ్గెందులకు? లజ్జించిన కార్యము సానుకూలము కావలదా! చల్లకుం బోయి ముంతదాఁచిన లాభమేమి! వ్యవహారముపట్ల లజ్జ కూడదని నిర్ణయించి స్త్రీజనస్వభావసిద్ధమగు బెట్టుసరి తీసి గట్టునబెట్టికుండ బ్రద్దలుకొట్టినట్లు

ఉ. నిక్కము దాఁప నేల? ధరణీసురనందన! యింక నీపయిం
జిక్కె మనంబు నాకు......'

అని చెప్పివైచినది.

మాయమర్మములు చంకఁబెట్టి పల్కిన ఈమాటలకైన 'దమ్మఁడు చిక్కకుండునా?'

అబ్బే! ముదిగొమ్మ వంగునా?

'వ్రతులై దినములు గడపెడు విప్రులఁ గామింపఁజను నే? నేను ఆహితాగ్నిని. నేఁ డిల్లు చేరకుండిన సమస్తధర్మములు దూలును' అని ప్రవరుని ప్రతివచనము.

ఈయద్దుకట్టుమాట లామెకు రుచించునా?

వాని వైరాగ్యభావమునకు వరూథినికి వదనమున విన్నఁబాటు 'ఇంచుక' దోఁచినది.

విన్నఁబాటైనను 'ఇంచుకయే.' ఏలయందురా? ఎట్లయిన బాఁపని మోహసముద్రమున ముంచలేకపోవుదుమా అను ధైర్యముండఁబట్టి.

సాభిప్రాయసంబోధనలు, అతిశయవర్ణనలు, మర్మవచనములు ఇవి అన్నియుఁ జెవిటికి శంఖూదినట్లగుట . ఇఁక వానితోఁ బ్రసక్తియుఁ, బ్రయోజనము లేదయ్యెను.

కాఁగా నిప్పు డీఁక యుక్తివాదములో బోల్తా వేయించవలెను.

'ఉ. భావజరూప! యిట్టి యభిప్రాయము వైదికకర్మనిష్ఠలం
బోవఁగ నింక భోగములఁ బొందుటయెన్నఁడు? యజ్ఞకోటులం
బావను లౌటకున్ ఫలము మా కవుఁగిళ్ళ సుఖించుటేకదా!'

అని ముదలకించినది.

'అప్రయత్నలబ్ధమగు గంధర్వాంగన పొందే కాదు. కామోద్రేకకరములగు కస్తూరి, జవాజి, పచ్చకర్పూరము, పన్నీరు, ఫలపుష్పములు, రత్నభూషణములును గలవు. కావున భోగపరుఁడవై అనుదినము నన్నుఁగూడి రమింపుము' అని చాటుమాటు లేక వచించినది.

ఆపై నిందనమునకు దొరకొన్నది: 'గంధర్వాంగనల పొందు గాదని సంసారాంధువునఁ బడియెదవు' అన్నది.

అటుపిమ్మట విషయలోలత్వము మంచిదని నిరూపింప విశ్వప్రయత్నము లొనర్చినది. 'వెన్నవలెఁ గరంగు నలివేణులఁ గౌఁగిటఁజేర్చు భాగ్యములు ఎన్నిభవములఁ గలుగును?' అని ఊరించినది.

మీకర్మనిష్ఠలు, యజ్ఞకోటులును మా కవుఁగిళ్ల సుఖం

పనేకదా ?' అని ప్రచ్ఛించినది. 'సశరీరస్వర్గసుఖము' పోనా డకు మన్నది.

ఇహలోకమునందే ఇంద్రియవాంఛలు దనివిదీరం జూఱఁగొనువాఁడే ఉత్తముఁడని నిరూపింప సాహసించినది.

కంటిరా ? కాముకురాలి మిట్ట వేదాంతములు !

విషయాపేక్షఁ దగిలి 'బ్రహ్మానందాధిరాజ్యపదవీచ్యుతుఁ' డగుటకు ప్రతినిష్ఠ, వైరాగ్యము గల ప్రవరుఁ డొప్పుకో లేదు.

యుక్తివాదముకూడఁ జెడినది. ఇఁక నీ శ్రోత్రియ బ్రాహ్మణుని పట్టి కొట్టించుటకు శరణ్యము శాస్త్రవాదమే.

'బ్రాహ్మణుఁడు, అందును శ్రోత్రియుఁడు కదా ! ఒక్క సారి శాస్త్రవాదమునం దూఁపిచూచెదము; అప్పుడైన మన వలలోఁ బడకుండునా ?' అని ఆలోచించినది.

'డెందము నిశ్చలమై యెక్కడ నిర్వృతినొందునో యట్టి ఆనందమే బ్రహ్మముగాని నీవు చెప్పు బ్రహ్మానందము లే' దని ప్రవరుని వాదమునకు ఖండనము చేసినది. ఇందులకు 'ఆనందో బ్రహ్మ' అను శ్రుతివాక్యప్రమాణముఁ జూపినది.

దీని కాతఁడు ఏమి బదులాడెనో తిలకించితిరా ?

'నా కరణుల్ దర్భలు నగ్నులు ప్రియములైన ట్లన్య ముల్ గా వోడల్ తిరమే ? చెప్పకు మిట్టి తుచ్ఛసుఖముల్ మీూసాలపైఁ దేనియల్' అని ఖండనమండన మొనర్చి తన విషయభోగవైముఖ్యమును, వైరాగ్యమును వెల్లడించినాఁడు.

శాస్త్రవాద మిట్లు చట్టుబండలైపోయినది. ప్రవరుఁ డన్ననో నమలరాని నారికేళమైపోయినాఁడు. కామశాస్త్రోపా

ధ్యాయిని యట్లు వచించియు వరూధిని శాస్త్రవాదమునఁ ప్రవరునితో నెదిరి యొడ్డారింప లేకపోయెను!

వరూధిని కామశాస్త్రోపన్యాసము ప్రవరుని వేదాంతోపన్యాస మెదుట చిచ్చుపొంత వెన్నయైనది. అగుట ఆమెకేమియుఁ దోఁచినది కాదు. మాట లేకపోయినది. హృదయాబ్జము జల్లనినది. మోము వెల్లనైనది. పట్టలేక ఆమె 'వనిత తనంతఁ దా వలచివచ్చినఁ జుల్కనగాదె యేరికిన్' అని తన్నుఁ దా నిందించుకొన్నది.

స్త్రీలకుఁ బెట్టని భూషణమగు బెట్టుసరియూ? పోయినది. కార్యమా? నెఱవేఱలేదు. ప్రతిమ చేసినను ఫలము దక్కకపోవుట అభాగ్యము కాక మఱియేమి?

సామదానభేదోపాయము లిట్లు పోఁకకుఁ జెల్లకుండుటచే నామెకు ఆతుర్దా అతిశయించినది. ఇఁక బలవంతముగా ఘుస్నానమట్లు చేయఁగూడదా అని సమాలోచించుకొన్నది. బలాత్కృతియే కాని వేఱుదారి లేదని నిశ్చయించినది.

మితిమురిపిన 'రతిసంరంభము' ఆమెను నిల్వనిచ్చినది కాదు. 'కామాతురాణాం నభయం నలజ్జా' అని ఆర్యోక్తి.

ఉండఁబట్టలేక ఆమె 'ప్రాంచద్భూషణ బాహుమూల రుచితో,' మెరమెరపాటుతో', మోహాతిరేకముతోఁ బైపాటున ప్రవరుని కౌఁగిలించినది.

పరిరంభణప్రయోగము బ్రహ్మాస్త్రమువలెఁ దిరుగు లేనిదని ఆమె తలంపు. అవును, నిజమే. పరిరంభణము కంటె బలవత్తరమైన మోహనపరికర మేది? వశ్యాంజనము వలె నిది పనిచేయునని వరూధిని యూహ.

ఆమె యూహ సరియైనదా? కాదు. సతీలలామలు

ధీరచిత్తములఁ గలంచునా? ఎన్ని చేసినను రోఁకటికిఁ జిగురులు పుట్టునా?

అకాముకుఁడగుట ప్రవరుఁడు పరిరంభణప్రక్రియలో నున్న వరూథినిని త్రోచిపైచినాఁడు.

అందులకుఁ గోపము పెచ్చుపెరిగినది వరూథినికి. క్రేగంటఁ జూచి మురమురలాడుచు

'ఉ. పాటున కింతు లోర్తురె? కృపారహితాత్మక! నీవు ద్రోవ ని
చ్చోటఁ బ్రసన్నభావమున సోఁకెఁ గనుంగొనుమంచుఁ'

జూపి (ఏమీ లేనప్పుడు ఏమో లేచిన శృంగార మనునట్లు) వేదన నెపమిడి కలస్వనముతో విలపించినది.

తనకుఁ దానై వలపుగొనిన పురుషుఁడు దనకుఁ బ్రతికూలవృత్తి నున్నతఱి ఆతని హృదయము తనయందు అనురాగాయత్తమును, ఆతని మనము తనయందు లగ్నమును అగునట్లొనర్చుటకు అంగనలకుఁ గల అంతిమోపాయము కంటఁ దడిపెట్టుటే కదా!

వరూథిని 'కన్నుఁగవ ధవళరుచులు కావి గొన నతికరుణముగాఁ' బ్రలాపించినది. అంతతో నూరకొనలేదు. ప్రవరుని జూచి యలమటఁ బల్కినది.

అలమటయే కాని ఆశాపరిత్యాగము గాలేదు. 'ఇనుపకచ్చడాల్ గట్టుకొను మునిముచ్చు లెల్లఁ దామరసనేత్ర లిండ్ల బందా' లని గాఢముగ నమ్మిన వరూథిని కంతలో ఆశాత్యాగమగునా?

'ఆ. ఆడువారిఁగన్న నర్థంబుఁ బొడగన్న
సారమైన రుచుల చవులఁగన్న

యయ్యగారికైన నాశలు గలుగవా?
విశ్వదాభిరామ! వినుర వేమ!
ఆ. కాంచనంబుపైనఁ గాంతలపైనను
బమ్మకైనఁ బుట్టు రిమ్మతెగులు
తోయజాక్షి విడుచు దొర యెవ్వరును లేరు
విశ్వదాభిరామ! వినుర వేమ!'

అని కవి గానము చేయుచున్నాఁడు.

అట్టిచో నాశాపరిత్యాగమున కవకాశ మెక్కడ!

త్రోవతప్పిన భూసురుఁడు వంటయింటి కుందేలువంటి వాఁడు కదా! ఎక్కడికిఁ బోఁగల్గునను మొండిధైర్యము. ఒక్కింత తడవునకైన బుద్ధి తిరుగకపోవునా? మనసు కరఁగక పోవునా? అను అడియాస. అట్లగుట ఆమెకు అలమటయే కాని ఉత్సాహభంగము కల్గలేదు. ఆమె ఆశ నిరాశ చేసికొన లేదు. నకాౢశ పెట్టుకొని ఉవ్విళ్లూరినది.

కామశాస్త్రోపన్యాసముచే నామెకు రేణువంతయు లబ్ధి లేకపోయినది. పైఁగాఁ బ్రాణము విసిగిపోయినది. అందుపై నాఉపన్యాసము ఉట్టిమీఁదఁ బెట్టి అహింసయే పరమ ధర్మమని వరూధిని ఉపన్యసించినది. తిలకింపుఁడు:

ఉ. చేసితి జన్నముల్; దపము చేసితి నంటి దయావిహీనతం
జేసిన పుణ్యముల్ ఫలము సెందునె? పుణ్యము లెన్నియేనియుం
జేసిన వాని సద్గతియె చేకుఱు భూతదయార్ద్రబుద్ధి; కో
భూసురవర్య! యింత దలపోయవు నీ చదువేల చెప్పుమా?

సద్గతికి దయ ప్రధానమని నిగ్గు తేల్చినది. ఈనీతి నినుమంతయుఁ దలపోయని ఆతని చదువు అజాగళస్తనప్రాయ మనుటకుఁ గూడ సాహసించినది.

అంతతోఁ బోక అంకుపురాణములు విప్పి అంకుతనము మంచిదనియే చచ్చు తెగవేసి చాటినది. చూడుఁడు:

సీ. వలిపెట్టిరే బాడబులు పరాశరుఁబట్టి
దాశకన్యాకేళిఁ దప్పుసేసి
కులములో వన్నె తక్కువయయ్యెనే గాధ
పట్టికి మేనకచుట్టరికము
ననువుకాఁడై వెల్వునాగవాసముఁగూడి
మహిమ గోల్పడియెనే మాందకర్ణి
స్వారాజ్యమేలంగ నీరైరె సుర లహ
ల్యాజారుఁడైన జంభాసురారి

గీ. వారికంటెను నీమహాత్త్వంబు ఘనమె?
పవనపర్ణాంబుభక్షులై నవసి యినుప
కచ్చడాల్ గట్టుకొను మునిముచ్చు లెల్లఁ
దామరసనేత్రి లిండ్ల బందాలు గారె!

జారత్వము సర్వవిధముల సమర్థనీయమును, ఆచరణీయమును, శ్లాఘాపాత్రమును అని బోధించి సాధించుటకై వరూథిని పురాణములనుండి నిదర్శనముల నెత్తి చూపి ప్రవరుని జయింపఁ దలఁపుఁగొనినది.

ఈ కాముకవచనములకుఁ బ్రవరుఁడు ఏమని మాఱు వల్కెను? మౌనమే భూషణ మనుకొని చల్లఁడల్లగా జాఱినాఁడు.

ప్రవరుని మోహములోఁ బడవేయు వరూథిని ఎన్నిపోకలు పోయినదో చూచితిరిగదా!

తొలుత చక్కనిమాట లాడినది. అటుపిమ్మట తన అభిజాత్యమును, వైభవాతిశయమును వివరించి వర్ణించినది.

ఆపై ప్రవరుని కుటీరనిలయములకుఁ దన తావునకును గల తారతమ్యము వ్యక్తీకరించినది. అతఁ డేదియు లక్ష్యపెట్ట కుండుటచే బలాత్కారముగా మీఁదఁబడి ఆశ్లేషించినది. అప్పుడుకూడఁ బ్రవరుఁడు కొంచుకువడలేదు. అంత వరూధిని దయాదాక్షిణ్యములు చూపుమని వానిని వేఁడికొన్నది.

కాని కార్యము లేకపోయినది. ఆమె పన్నుగడలన్నియు విపన్నములైనవి.

తుదకు వరూధిని అనురాగము 'దుర్లభజనానురాగ మై'నది.

అట్లగుటనే కవి ప్రవరునిగూర్చి ఇట్లని పాడుచున్నాఁడు:

'ఆ. వాని చక్కఁదనము వైరాగ్యమునఁ జేసి
కాంక్ష సేయు జారకామినులకు
భోగబాహ్యమయ్యెఁ బూచిన సంపెంగ
పొలుపు మధుకరాంగనలకుఁ బోలె.'

# ౭

# ప్రవరుని సంసారసుఖము

ఆంధ్రకవితాపితామహుఁడు తన మనుచరిత్రమున ప్రవరుని సంసారమును వర్ణించి చిత్రించుటలో నాదర్శప్రాయమగు నొక సుఖకుటుంబమును మనమునం దిడుకొనియుండును. సమష్టి కుటుంబములలోఁ బూర్వము ఆర్యు లెట్టిసౌఖ్యమును బొందిరో ప్రవరుని సంసారచరిత్రమును పఠించువారికిఁ బెద్దనార్యుఁడు ప్రస్ఫుటము చేసెను.

వాసయోగ్యమైన గ్రామమున కాఁపురమును, పెక్కుచందాలం బందు మాన్యక్షేత్రములను, ఒకప్పుడును తఱుఁగని పాఁడిని, అతిథిజనుల రాకపోకలచే పావనమైన గృహమును, ఇలుదీర్చు తలిదండ్రులను, అనుకూలవతియగు భార్యను, శుశ్రూషావికస్వరహృదయంబగు శిష్యగణమును ఇచ్చి కావ్యబ్రహ్మ పెద్దనార్యుఁడు తన సృజించిన ప్రవరునకు అనంతమగు సంసారసుఖమును కూర్చినాఁడు.

ప్రవరునకు సంసారమున అట్టి అనంతసుఖమును కూర్చిన కారణగుణములను విడఁదీసి వివరించి పరామర్శింతము.

## —: వాసయోగ్యత :—

ప్రవరుని సంసారసుఖమునకు మూలదుంపయైనది అతఁడు కాఁపురమున్న అరుణాస్పదపురముయొక్క వాసయోగ్యత.

ఎట్టి సంసారమైనను సుఖవంతమైయుండుటకు ఉండు ఊరు తృణకాష్ఠజలసమృద్ధమై యుండవలయును, నదీతీర

భూములు ఎల్లప్పుడును జనాకీర్ణములును, సుభిక్షములును నై యుండుటకుఁ గారణములు అవి తృణకాష్ఠజలసమృద్ధములై యుండుటే.

ప్రవరుని స్వగ్రామమగు అరుణాస్పదము వరణాద్వీపవతీ తటాంచలమున విలసిల్లినది. ఆగుటచే నది తృణకాష్ఠజల సమృద్ధమై యుండెననుటకు సందేహము లేదు.

మఱియు ప్రవరునివంటి కర్మఠునకు వరణవంటి 'ఎప్పుడు నెడ తెగక పాఱు నేఱు' అనంతమగు వినియోగసుఖము నీయఁ జాలును.

అంబరచుంబియైన అచ్చటి వప్రముతీరు, చంద్రమండలమునందలి జింకను నయితము తెల్లఁగాఁ జేయఁజాలు అచ్చటి పాలగచ్చుమేడల యొప్పు, ముది మదిదప్పిన సరస్వతీనాథుని మెచ్చని అచ్చటి విప్రుల విద్యాప్రౌఢి, బంటునంపి భార్గవునైన బింకమున బవరమునకుఁ బిలిపించు నచ్చటి రాజుల శౌర్యసంపద, ధనాధినాథుఁడైన కుబేరునినయితము పోషింపఁగల నచ్చటి కోమటుల ధనసంపద, ఆదిభిక్షువు భైక్షమైన మాన్పఁజాలు నచ్చటి శూద్రుల హలముఖాత్తవిభూతి, రంభాదులనైన నోరయఁ గానెకొంగున వారించి కడపఁగల యచ్చటి వెలయాండ్ర నాట్యరేఖాకళాధురంధతానిరూఢి అరుణాస్పద పురముయొక్క వాసయోగ్యతకును, అచటి పౌరుల సుఖజీవన స్థితికిని ప్రబలనిదర్శనములై యున్నవి.

ఇట్లు సుఖజీవనమునకు వలయు అనుకూలవాతావరణమును గలిగి ఆ పట్టణము జనాకీర్ణమై మహీంకఁరహారతరళ స్ఫూర్తిని విడంబించినది.

అట్టి సుఖజీవనస్థితికిఁ దావలమైన వాతావరణముగల

పట్టణరాజమున ప్రవరుఁడు 'శమంబు దమంబు గల' విద్యా వంతుఁడును, 'శీలము కులము గల' ధనవంతుఁడును అయిన పౌరుఁడై విలసిల్లెను.

ఈసంగతి ప్రవరుని సంసారసుఖమున కెందును లోపము లేదన్న విషయమును తెల్లము చేయుచున్నది.

అరుణాస్పదపురముయొక్క వాసయోగ్యత ప్రవరుని సంసారసుఖమునకు మూలమంప యైనది.

—: ధ నా ఢ్య త :—

ప్రవరుని అనంతమైన కుటుంబసౌఖ్యమునకుఁ దోడ్పడిన రెండవకారణము అతని ధనాఢ్యత.

ఉన్న ఊరు ఎంత మంచిదైనను, ఎంత తృణకాష్ఠజల సమృద్ధిగలదైనను చేతఁ బైసాలేక 'నిత్యాశనశూన్యంబగు దైన్యంబు'న నున్నవాఁడు అచ్చట సంసారసుఖ మనుభవింప నేరఁడు.

ఉ. సంపదచేతఁగాని కొనసాగవుసుమ్వె గృహస్థధర్మముల్.

—పాండురంగమాహాత్మ్యము.

అనికదా అనుభవజ్ఞు లందురు.

మ. బలవద్దైన్యము వక్త్రగహ్వరము గాఁ బ్రాప్తిల్లఁ గొన్నట్టి యు
ష్ణలు మైచాటలు గాఁగ బాలరుదితంబు ల్మోగుటల్గాఁగ

— కేయూరబాహుచరిత్ర

దారిద్ర్యశార్దూలము ఏయింటియందు తిరుగాడుచుం డునో ఆ యింటివారజనానికి శాంతిసుఖములు చంద్రమామ ఘుటికలు.

ప్రవరునిసంసారమును ఎప్పుడును ఋణ మను పాతకము

తాఁకలేదు; దారిద్ర్య మను శార్దూలము చూడలేదు. ఏమందురా? ప్రవరుఁడు ధనాఢ్యుఁడు. దేహి అని ఒకరిని చేయిచాఁచి యాచింపవలసిన అవసర మాతనికి లేదు. ఆతని మాన్యక్షేత్రములు పెక్కు చందముల పండుచుండును. అగుటచే నాతని యింటియందు ఒకప్పుడును పాఁడిపంటలు తఱుఁగవు.

ఇంతటి సంపన్నుఁడు కావుననే ఆతఁడు అర్ఘమూలమైన అతిథిపూజ చేసి, సిరికిం దరమైన దానకీర్తిని చూపి గృహస్థాశ్రమధర్మము నిర్వహింపఁగలిగినను సంతోషసుఖమును పొందినాఁడు.

ధనసంపద, కృషిసంపద యున్నగు సంపదలకుఁ బేరు మ్రోసిన అరుణాస్పదపురమున ప్రవరుఁడు మాన్యక్షేత్రము లందుఁ బెక్కు చందాలం బండిన పంట, ఒకప్పుడును తఱుఁగని పాఁడి అను కృషిసంపద; బహుధనమూలకమైన వివిధాధ్వర ముల నిర్వహించిన ధనసంపద; అనారతాధ్యాపనతత్పరమైన విద్యాసంపద కలిగిన పౌరుఁడై సుఖియించెను.

—: జీవత్పాతృపాదత్వము :—

ప్రవరుని సంసారసుఖపాదపమునకు దోహదముచేసిన మూఁడవకారణము ఆతని జీవత్తాతపాదత్వము.

ఉన్నఊరు మంచిదియైనను, పిసిగిక్రొని తినుటకుఁ గావలసినంత యున్నను పిన్నటనాఁటనే తల్లిదండ్రులను గోల్పోయి కుటుంబభారమును వహింపవలసిన సంసారికి పూర్తిసుఖ ముండదు, సరికదా అతనికి గృహచ్ఛిద్రములు చెవులులేని వేదన గల్గించును.

చిన్నతనముననే సంసారనిర్వహణభారమును పూనిన

వారికి సంసారసుఖము మనఃక్లేశమలినము కాకతప్పదు. చూడుఁడు:

చ. జనకభుజావనీజముల చల్లనినీడ వసించియుండు నం
దనులు జగంబున న్సుఖులు తండ్రి మృతుం డయిచన్నఁ బిన్ననాఁ
డ నిజకుటుంబభారము గడంగి వహించుచుఁ దీవ్రదుఃఖ వే
దనబడు వా రపుణ్యులు విధాతృనిచేత భుజంగమేశ్వరా!

—మార్కండేయపురాణము

అనికదా సారమతులు వచియించెదరు.

ప్రవరుని విషయమున నిట్టి కష్టములులేవు. ప్రవరుఁడు జీవత్తాతపాదుఁడు. అగుటనే ఈవిషయమున అతని కెట్టికష్టములును లేవనుట.

సంసారశకటచోదనమునఁ దమ చీము నెత్తురులు వెచ్చించి యేళ్లుగడపిన అతని తల్లిదండ్రులు పురాణదంపతులగు పార్వతీపరమేశ్వరులవలె సుఖులై కూడియుండి ఇంటిపెత్తనము చక్కఁబెట్టుచుండిరి.

ఎట్టి లోపాలోపము లున్నను అనుభవశాలులు, అనురాగయుక్తులు నగు తల్లిదండ్రులే సవరించుకొనిపోవుచుండఁగా ఆ కుటుంబి హృదయము సంసారవిషయమున ఆందోళితము కాలేదు; చింతావకుంఠితము కాలేదు. అతని సౌఖ్యతురంగమునకు కశాఘాత మనునది లేనేలేదు. ప్రవరునకు సంసారమున సుఖమేకాని బాధ్యతలేదు; అనుభవమేకాని శ్రమలేదు.

—: అనుకూలకులకాంత :—

ప్రవరుని కుటుంబసుఖమునకుఁ గారణభూతమైన మఱియొక విషయము అనుకూలవతియగు భార్యవలని లాభము.

వాసయోగ్యమైన గ్రామము, తఱుఁగని పాఁడిపంటలు,

ఇలుదీర్చెడి తలిదండ్రులు ఉన్నను సంసారికి వహ్నిసాక్షికమగు సఖ్యమున జన్మాంతమువఱకు పార్శ్వవర్తినియై మెలఁగు కులకాంత అనుకూల కాదేని ఇనుమంతయైన శాంతిసుఖములు లభింపవు.

క. చెప్పినపని యొనరించిన
యప్పణఁతుక కల్గ గహమె మది సదనమగున్
జెప్పినపని యొనరింపని
యప్పణఁతుక కల్గ సదన మది గహనమగున్.

—చాటుధార.

అనుమాట మంచిఅనుభవముమీఁద చెప్పినదికదా!

భార్యవిషయమునఁగూడ ప్రవరాఖ్యుఁడు మంచి యదృష్టవంతుఁడు. 'కమనీయకౌతుకశ్రీవిధిఁగూఁకటుల్ నాలిచి చేసిన కూరిమి సోమిదమ్మ' అతనిని సౌఖ్యావహయై సేవించుచుండెను.

అభ్యాగతసేవాపరతంత్రసకలజీవనుఁడైన ప్రవరాఖ్యునకు ఆతనిభార్య సర్వవిధములఁ దగినది. ఎంతమంది అతిథులు వచ్చినను ఆమె వండుటకుఁ జిరాకుపడదు. అతిథులు అర్ధరాత్రి వచ్చినను ఆమె ఆనందముతో వారికిఁ గావలసిన పదార్థముల నెల్ల వండిపెట్టును. సహధర్మచారిణి సౌజన్యము వలన ప్రవరుని అతిథిపూజాభిలాష కార్యరూపము దాల్చెను. అందువలన ఆతఁడు గృహమేధిప్రవరుఁ డయ్యెను.

'వలపున్, ననుపున్, దగవున్, బ్రియుంబునున్' సోమిదమ్మవలన నాతనికి నిండారినవి. సహధర్మచారిణి తలలో నాలుకయై తె న్నెప్పుడును ఎడఁబాసి యుండని పదదాసియై సేవించుచుండ ప్రవరుఁడు అనంతమగు సంసారసుఖ మనుభవించుచుండెను.

—: విభవానుగుణ వితరణ :—

ప్రవరుని సంసారసుఖమునకుఁ గారణభూతమైన వేఱొక విషయము 'విభవానుగుణమైన అతని వితరణోత్కర్షంబు.'

ధనమునకు గతులు మూఁడు: భోగము, దానము, నాశము అని. 'కట్టక, కుడువక, యొరులకుఁ బెట్టక' 'ధనము గాఁపున్నదయ్యాలుఁ దఱుమువారి' సంపదకు గతి నాశనమే, అట్టిది సుఖ మీయఁజాలదు,

సుఖకరమైన లక్ష్మికి త్యాగభోగములు గతులు. భగవంతుఁడు తన కిచ్చిన సంపదను తా ననుభవించుటవలన కలిగెడి ఆనందము ఆ సంపదలోఁ గొంత యితరులకుఁ బంచి యిచ్చుటవలనఁ గలిగెడు తృప్తితో మిళితమైనప్పుడే కుటుంబి జీవనము అవంధ్యజీవన మగును; అతని సంసారసుఖము సమగ్రమగును.

ప్రవరుని ధనసంపద భోగము, దానము అను రెండు గతులను బొంది అతనికి సావధికముగాని సంసారసుఖము నిచ్చినది.

'చెక్కుటద్దములందు జిగివెల్లువలు చిందు
రమణీయమణికుండలములు'

చెవులకు—

'పసిఁడివ్రాఁతచెఱంగు మిసిమిదోఁపఁ జెలంగు
నరుణాంశుకోత్తరీయంబు'

భుజములమీఁద—

'సరిలేని రాకట్టు జాళువామొలకట్టు'

నడుముకు—

'కాశికాముద్ర యుడిన యుంగరము'

ప్రేలికి—

'పసిఁడితోరము'

బాహువునకుఁ—

బెట్టి ఆతఁడు తన ధనమును భోగించినాఁడు. అతిథి జనులకుఁ బెట్టి ఆతఁడు తన ధనమును త్యాగము చేసినాఁడు.

ప్రతిదినమును ప్రవరుని గృహాంతరమున అతిథిజనములు పావనస్నానవిధాన్నపానములచేత సంతృప్తులగుచు ఆఅభ్యాగతసేవాకాంక్షకు ఫలసిద్ధియు, ఆతని గృహస్థధర్మమునకు వినియోగమును గలిగించి ఆతనికి తృప్తిసుఖముల నిచ్చుచుండిరి.

—: విధేయశిష్యగణము :—

ప్రవరుని కుటుంబసౌఖ్యమునకు సహకారియైన మఱియొండు విషయము 'అజస్రశుశ్రూషావికస్వరహృదయం' బగు ఆతని శిష్యగణము.

వటువులకు విద్యగఱపి వేదవిద్యాపారంపర్యముగ నిలుపుంచుట ఆర్యవిప్రులకు విధ్యుక్తధర్మము. అంబురుహగర్భకులాభరణమును, అనారతాధ్యాపనతత్పరుండును అయిన ప్రవరుఁడా కారణమున శిష్యులను చేరఁదీసి వారికి వేదవిద్యల నేర్పెను.

అట్లగుట నాతఁడు స్వధర్మసేవ యథామతిని నిర్వహించితిని గదా యను సంతోషసుఖమును బొందఁగల్గినాఁడు.

ఇట్టి సంతోషసుఖమే గాక ప్రవరునకు ఆతని శిష్యుల వలనఁ బ్రత్యేకసుఖముకూడఁ గలిగినది. ఆతనియొద్ద విద్యాభిక్షను గొను విద్యార్థులు గురువునకు పంగనామములు పెట్టురకముగాక ప్రవరుఁడు అరుణోదయమున వరణానదికి స్నానమునకుఁ బోవునపుడు సయితము ఆతని ననుసరించుచు నెల్ల

వేళల నాతనికిఁ దోడునీడలై క్రీడించుచు సచ్ఛాత్రులై యుండిరి.

అట్లగుట వారు ప్రవరుని అనారతాధ్యాపనతత్పరత్వమునకు ఉచితోపయోగ్యవృత్తి నాపాదించి అందుచే ఆతని సంసారసుఖమునకు సమగ్రత్వమును సంపాదించిరి.

—: నియమబద్ధ జీవనము :—

ప్రవరుని సంసారసుఖమునకుఁ దోడ్పడిన మఱియొండు విషయము ఆతని నియమబద్ధమైన జీవనము.

ఎవఁడు తన జీవనమును నియమబద్ధ మొనర్చుకొనునో వాఁడు ఆరోగ్యవద్దేహుఁడును, సుఖియు నగును. పెందలకడ లేచుట, అరుణోదయమున శీతలజలస్నానము చేయుట, రమణీయప్రకృతికి వేలముపట్టునట్టు నదీతీరమున సమిత్కుశార్థము సంచరించుట - ఇత్యాది నియమములను ప్రవరుఁడు దినదినమును పాటించును.

సీ. వరణాతరంగిణీదరవికస్వరనూత్న
కమలకషాయగంధము వహించి
ప్రత్యూషపవనాంకురములు పైకొను...

బ్రాహ్మీముహూర్తమున ప్రవరుఁడు ప్రతిదినమును నిద్రమేల్కొనును. అప్పుడాతఁడు శిష్యసమేతుఁడై నదికిఁ బోవును. అందాతఁడు దోవతులు ఉదికికొని అఘమర్షణస్నానము ఆచరించును.

పిమ్మట ఆతఁడు సాంధ్యకృత్యమును దీర్చికొనును, సావిత్రిని జపియించును; ఆ నది సైకతస్థలిని కర్మసాక్షి కెఱుఁగును. సస్యశ్యామలములైన ఆప్రాంతభూములందు ఫల

సమిత్కుశకుసుమాదిబహుపదార్థములను దేవతార్చనార్థము సంగ్రహించుకొని శిష్యులతో నింటికి వచ్చును.

ఇట్టి నియమముల నవలంబించి తదాచరణమునఁ 'బ్రజ దన్ను మెచ్చిచూడ' ప్రవరుఁడు ఉదంచితసౌఖ్యమునఁ దేలి యాడెను.

—: నిత్యకృత్యనిర్వర్తనము :—

ప్రవరుని సంసారసుఖమునకు దోహదమొసఁగిన మఱి యొక విషయము నిత్యకృత్యసత్కర్మకలాపనిర్వర్తనమువలన నాతనికిఁ గలిగిన తృప్తి.

లేఁబ్రాయముననే వివిధాధ్వరముల నిర్వహించిన తృప్తి; ప్రతిదినక్రమమున 'వేలిమి, సురార్చన, విప్రసపర్య' మున్నగు వైదికకర్మల నిర్వర్తించుచున్న తనివి- కర్మక్షేత్రమైన ఆర్యావర్తదేశమునఁబుట్టి వివిధాధ్వరనిర్మలధర్మకర్మదీక్షాపరతంత్రుఁడైన ప్రవరుని సంసారసుఖమును పోషించినవి.

తన సంసారసుఖమునకుఁ బోషణ మిచ్చిన వైదికకర్మ నిష్ఠలయందు ఆతఁడు పూర్తిగ నిమగ్నుఁడయ్యెను గావుననే ఆతనికి అరణులు, దర్భలు, అగ్నులు ప్రియమైనట్లు అన్యములు గాకపోయెను.

ఆ నిత్యాగ్నిహోత్రికి—

మ. ......రేపును మాపు హవ్యములచేతన్ దృప్తుఁడౌ వహ్ని
సత్కరుణాదృష్టి నొసంగు సౌఖ్యము

అగ్గలమై యుండి ఆతని సంసారసుఖమును రెట్టించెను.

ఇట్లు వాసయోగ్యమైన గ్రామమున కాఁపురము గలిగి, పెక్కుచందాలంబందు మాన్యక్షేత్రములు కలిగి, ఒకప్పుడును తఱుఁగని పాఁడి కలిగి, అతిథిజనుల రాకపోకలచే పావనమైన

గృహము కలిగి, ఇలుదీర్చు తలిదండ్రులు కలిగి, సాధ్వీ వహాయై భజించు భార్య కలిగి, తోడునీడలైన శిష్యులను కలిగి ప్రవరుఁడు నిరవధికమైన సంసారసౌఖ్యమునందు ఓలలాడెను.

అట్టి ఆతని సుఖమునకు దివ్యత్వమిచ్చినది ఆకుటుంబము నందలి వివిధవ్యక్తులనడుమ నెలకొనిన పరస్పరప్రేమ. ప్రవరుని నిలయము నిజముగా ప్రేమనిలయము మనవచ్చును. చూడుఁడు:

ఆయింటియందు తల్లి ప్రాజ్ఞుఁడై యజ్ఞమునొనర్చి సోమయాజియైన తన కుమారుని పిట్టదోషము తగులునని యోమఱియేమో ఎపుడును సంధ్యలయందు నిలువెళ్ళనీక రక్షించును.

ఆయింటియందు తండ్రి తనయుని 'నిముసంబుగానక యున్న నూరేల్ల నరకును.'

ఆయింటియందు యజమానుఁడు తాను కార్యార్థియై యెక్కడకుఁ బోయినను కడువృద్ధులగు జననీజనకులకు భోజనము వేళ యతిక్రమించి వారు ఆఁకలిచే సోలుచుఁ, జింతతోఁ దన్నెదురుచూచుచు నుండకుండ వేళకే యింటికిఁ జేరుకొనుచుండును.

ఆయింటియందు యజమానురాలు పతికి అనుకూలవతియై ఆతని మనసులో వర్తించును.

ఆయింటియందు శిష్యులు గురువర్యునకుఁ దోడునీడలై క్రీడింతురు.

ఇట్లు ప్రేమసూత్రముచే నిబద్ధమైన వ్యక్తులుగల సంసారమునకు అధిపతియైన వానిసుఖము కొలందులువెట్టఁ దరము కానిది. వానికి భూతలమునందే సశరీరస్వర్గసుఖము సమకొనియె నన్నమాట.

ప్రవరుని అగ్గలమగు నిట్టి సంసారసుఖ మనుభవించు వానిఁగాఁ జిత్రించుటవలనఁ గావ్యమున సిద్ధించిన పరమప్రయోజన మేమి?

ప్రవరుని సంసారమువంటి సంసారమును 'సంసారాంధువు' అని- 'కౌగిలిఁ గో వెన్నవలె కరంగు నలివేణి,' 'తరుణి' యగు వరూధిని చెప్పినను పాఠకులు ఒప్పుకొనఁగలరా?

# ౮

# ప్రవరుఁడు - పెద్దన్న

తాను సృజించు పాత్రలలో కవి ఒక్కొక్కపాత్రను అభిమానపాత్రగాఁ జేకొనుననుట అనుభవజ్ఞులకు పునరుక్తవిషయము. అట్లు చేకొనిన అభిమానపాత్రకు కవి ప్రయత్నముగనో, అప్రయత్నముగనో స్వీయగుణములను అన్నిటినో, కొన్నిటినో అంకిత మొనర్చుట అరుదు కాదు.

ఆంగ్లనాటకకవిబ్రహ్మ షేక్సుపియరు తన ‘టెంపెస్టు’ రూపకములో ‘ప్రోస్పెరో’ పాత్రమున ఆత్మజీవితమును కొంత అనువుపఱచియున్నాఁడు. అట్లే మనుచరిత్రమున అల్లసాని పెద్దన్న ప్రవరునిగుణవర్ణనమున స్వీయగుణముల కొన్నిటిని పొసఁగించెనని విమర్శకదృష్టితో ఆ ప్రబంధమును పఠించు వారికిఁ దోఁపకమానదు.

మానదు కాదు, తప్పక తోఁచును.

ప్రవరునికథ వర్ణించు ఘట్టములే మనుచరిత్రమున రసకందాయములు. మిగిలినఘట్టములందు అట్టి రుచివిస్ఫూర్తి లేదు. ప్రవరుఁడు తనఅభిమానపాత్రగావుననే పెద్దన్న ప్రవరుని కథపట్టులను మనోహరముగ వర్ణించి విశేషరుచి చూపఁకలిగినాఁడని అనుకొననగును.

మారన మార్కండేయపురాణమునందలి స్వారోచిష మనుజన్మవృత్తాంతమును మూలముగాఁ గొని పెద్దన్న మనుచరిత్ర రచియించెను.

మార్కండేయపురాణమున

క. వరణాతటినీతటమున
వరుణాస్పద మను పురంబునం దతులగుణో
త్తరుఁడు గలఁ డొక్క ధరణీ
సురవరుఁ డశ్వినులకంటె సుందరుఁ డెంతున్.

చ. అతిసుకుమారమూర్తి ప్రవరాఖ్యుఁ డుదాత్తుఁడు వేదపారగుం
డతిథిజనార్చనాభిరతుఁడై చరియించుచు శైలకాననాం
చితసకలావనీతలవిశేషము లెల్లను బ్రీతిఁ గన్గొన
న్మతిఁ గడుఁ గోరుచుండ......

అని ప్రవరుఁడు అభివర్ణింపఁబడెను.

అట్లగుట మారన వర్ణించిన ప్రవరుఁడు

౧. సుందరసుకుమారమూర్తి;

౨. ఉదాత్తుఁడు, అతులగుణోత్తరుఁడు;

౩. వేదపారగుఁడు;

౪. అతిథిజనార్చనాభిరతుఁడు;

౫. సకలావనీతలవిశేషములఁ జూడఁగోరువాఁడు;

౬. ధరణీసురవరుఁడు.

ఇఁక పెద్దన్న వర్ణించిన ప్రవరుఁడు

౧. మకరాంకశశాంకమనోజ్ఞమూర్తి, అలేఖ్యతనూవిలాసుఁడు;

౨. భాషాపరశేషభోగి;

౩. వివిధాధ్వర నిర్మలధర్మకర్మదీక్షాపరతంత్రుఁడు;

౪. అంబురుహాగర్భకులాభరణము;

౫. అనారతాధ్యాపనతత్పరుండు;

౬. విషయేచ్ఛలేనివాఁడు;

౭. గురుజనభక్తికలవాఁడు;

౮. శిష్యులను జేరఁదీసి విద్య గఱపువాఁడు;

౯. నిర్దోషమైన సాలగ్రామదానమునయితము గ్రహింపని రాజసగుణము కలవాఁడు;

౧౦. ఒకప్పుడును ఇంటియందు పాఁడియు, పంటయు తఱుఁగని ధనాఢ్యుఁడు;

౧౧. అభ్యాగతసకలసేవాపరతంత్రసకలజీవనుఁడు;

౧౨. 'వలయు భోజ్యంబు లింట నవ్వారిగాఁ' గూర్చి మార్గస్థులకు సర్వకాలములందు అన్నదాన మొనర్చువాఁడు.

౧౩. తీర్థసందర్శనాభిలాషి.

ఈ రెండువర్ణనములు పోల్చి చూచితిమేని ౧. బ్రాహ్మణవంశము, ౨. సౌందర్యము, ౩. వేదాధ్యయనము, ౪. అతిథిజనార్చనాభిరతి, ౫. తీర్థసందర్శనాభిలాష; ౬. విషయేచ్ఛ మొదలగు తుచ్ఛగుణములులేని ఉదాత్తత- అను ఆఱు ధర్మములును మారన, పెద్దన లిరువురు సమానముగ ప్రవరునియం దారోపించిరని తేటతెల్లమగును.

౧. శిష్యశిక్షణము, ౨. రాజసగుణము, ౩. ధనాఢ్యత, ౪. భాషాపరశేషభోగిత్వము, ౫. దాననిరతి, ౬. గురుజనభక్తి అనునవి పెద్దన్న ప్రవరునియందు క్రొత్తగా అంకిత మొనర్చిన విశేషగుణములు.

సౌందర్యము, వైరాగ్యము, అతిథిసేవానిరతి, తీర్థసందర్శనాభిలాష మున్నగు ప్రవరునిగుణములు ఉత్తరకథావిస్తృతికి మూలబీజములు.

పెద్దన్న క్రొత్తగా ఆరోపించిన శిష్యశిక్షణము, రాజస

గుణము, ధనాఢ్యత, భాషాపరశేషభోగిత్వము మున్నగు అతనిగుణములు తరువాతికథను పెంపొందించుట కెట్లును సహాకారులుగావు.

కాకపోవుటతో సరిపోయినదా! అవి కథాసారస్యమునుగూడ చెడఁగొట్టుటకుఁ గొంతవఱకుఁ దోడ్పడినవి.

ఎట్లందురా! భాషాపరశేషభోగియైన ప్రవరుఁడు వరూథిని కామశాస్త్రోపన్యాసమునకు వాయెత్తలేకపోవుట యొక గొప్పలోపము.

అగుచో నొక ప్రశ్న.

ఉత్తరకథావిస్తృతికి ఉపయోగపడకుండుటయే గాక కథాసారస్యమునుకూడ చెడఁగొట్టుటకు తోడ్పడిన ఈ కొత్త గుణములు ప్రవరునియందు పెద్దన్న ఏల ఆరోపించెను?

దీని కొక్కటే జవాబు.

తా నభిమానపాత్రముగాఁ జేకొనిన ప్రవరునియందు స్వీయగుణములను కొన్నిటిని హత్తించ పెద్దన్న ముచ్చటపడినాఁడు. అవి కథాసారస్యమును ఒక్కింత డిందుపాటునొందించునను భయముకాని, ఉత్తరకథావిస్తృతికి సహాకారము కావను చింతకాని అట్టిముచ్చటలో అతనికి తట్టనేలేదు.

పెద్దన్న ప్రవరునియందు నూతనముగ ఆరోపించిన శిష్యశిక్షణము, రాజసగుణము, ధనాఢ్యత, భాషాపరశేషభోగిత్వము, దాననిరతి, గురుజనభక్తి అను గుణములు ఆంధ్రకవితాపితామహుని స్వీయగుణములని మన మిఁక నిర్ధారణచేయవలసియున్నది.

అందుల కాతని జీవితచరిత్రమునుండి నిదర్శనములను ఎత్తి పరిశీలింతము.

—: ౧. శిష్యశిక్షణము :—

వేదవేదాంగములయందు అనంతకౌశలము గడించిన కోవిదుఁడగుటచే ప్రవరుఁడు శిష్యులను చేరఁదీసి వారికి విద్యాబుద్ధులఁ గఱపెను.

శిష్యులయందు ప్రవరునకు వాత్సల్య మధికము. తాను వరణానదికి స్నానమునకుఁ బోవునపుడుసయితము వారిని వెంట బెట్టుకొనిపోవును. శిష్యులతో నింత అరమరలులేకయుండిన గురువు కావుననే ప్రవరుఁడు హిమాలయపర్వతమున 'మిన్నులు వడ్డచోట' నుండిపోయినప్పుడు

'శిడఁ దోడునీడలై క్రీడించు సచ్ఛాత్రు
లింతకు నెంత చింతింతురొక్కొ'

అని (తల్లిని, తండ్రిని, భార్యను గూర్చి చింతించిన నోటితో) శిష్యులఁగూర్చి కూడఁ జింతించినాఁడు.

పెద్దన్నయు తాను ఆంధ్రకవితాపితామహుఁడుగావున కొంతమంది యువకులకుఁ గవితాశిక్ష యొసంగినాఁడు.

ఇందుకు నిదర్శనములు చూపవచ్చును.

భట్టుమూర్తి, తెనాలి రామకృష్ణుఁడు, పింగళి సూరనలు కవిత్వమున ప్రథమపాఠములు పెద్దన్నయొద్దనే చదివిరనుటకు కథలుగలవు.

భట్టుమూర్తి పెద్దన్నశిష్యుఁడనుకథను వసుమనుచరిత్రలరచనాసాదృశ్యము కొంత పోషింపకపోదు.

రామకృష్ణుఁడు ఆంధ్రకవితాపితామహుని శిష్యుఁడను కథకు

క. కవి యల్లసాని పెద్దన
కవి తిక్కనసోమయాజి గణుతింపంగాఁ

కవి నేను రామకృష్ణుఁడఁ
కవి యను నామంబు నీరుకాకికి లేదే?

అను రామకృష్ణునిచాటుపద్యము జీవము పోయుచున్నది. గురువును అమితపూజ్యభావముతోఁ జూచు శిష్యునివలెనే ఈ పద్యమున రామకృష్ణుఁడు తన్ను ఎంతయో కొంచెపఱచుకొని పెద్దన్నకు కవిబ్రహ్మయగు తిక్కనతో సమానస్థాన మిచ్చి యున్నాఁడు.

ఇఁక పింగళి సూరన విషయము: అతఁడు పెద్దన్నకు మనుమరాలిపెనిమిటి అనికదా ఐతిహ్యము. అతఁడు పెద్దనార్యుని శిష్యుఁడై యుండుటకు అవకాశముకలదని ఈ చుట్టఱికము సూచించుచున్నది.

పింగళి సూరన, భట్టుమూర్తి, తెనాలి రామకృష్ణుఁడును అష్టదిగ్గజములలోనివారని బలవత్తరమైన జనశ్రుతి చాటుచున్నను వారు కృష్ణరాయలకాలమున గ్రంథము లేవియు రచియించియుండ లేదు. రాయలమరణానంతరము కొలఁది కాలముననే వారు గ్రంథరచనకు దొడఁగిరి.

ఇట్లగుటచే వారు రాయలకాలమున పిన్నలై పెద్దన యొద్ద గురుశుశ్రూష చేయుచు 'భువనవిజయము'నందు ప్రాజ్ఞులతో నిరంతరగోష్ఠి, కవిత్వమున జిజ్ఞాస యొనర్చి అనుభవజ్ఞులైన పిదప గ్రంథముల రచియించిరనుట కెడ మెంతేనియుఁ గలదు.

## —: ౨. రాజసగుణము :—

తనయోగ్యతను జూచి రాజులు నిర్దోషమైన సాల గ్రామదానమును ఈయవచ్చినను ప్రవరుఁడు తీసికొనఁడు. ఇది అతని రాజసగుణమును జాటుచున్నది. మహారాజు లిచ్చిన

మాన్యక్షేత్రములు కుటుంబపోషణమున కాధారమగుట ఆతనికి సమ్మతమే. కాని అట్టిరాజులే గౌరవించి ఇచ్చు నిర్దోషమైన సాలగ్రామదానపరిగ్రహణమునకు ఆతని రాజసగుణము అడ్డు తగిలినది.

ప్రవరునివలె పెద్దన్నయు రాజసుఁడే.

తనకు ఆంధ్రకవితాపితామహుఁడన్న బిరుదమిచ్చి అష్ట దిగ్గజములలో శ్రేష్ఠత్వమొసఁగి ఆదరాతిశయముతో గౌరవించిన కృష్ణదేవరాయ లొకప్పుడు ఏదేని కృతి రచింపుమని కోరఁగా రాజసగుణము గల పెద్దన్న

చ. నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చు క
ప్పురవిడె మాత్మకింపయిన భోజన మువ్యెలమంచ మొప్పుత
ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్
దొరకిన గాక యూరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే?

అని నిశ్శంకముగ నిరాకరించెను.

—: 3. ధనాఢ్యత :—

ప్రవరుఁడు 'ధనాఢ్యుఁడు.' ఆతని మాన్యపుభూములు 'పెక్కు చందాలన్ పండు'చుండును. కావున ప్రవరునిఇంట పాఁడిపంటలు ఎల్లప్పుడును కొల్లలుగా నుండును.

మఱి యిఁక పెద్దన్న ధనాఢ్యత మనము విచారింప నవసరము లేదు. విజయనగరసామ్రాజ్యనియంతయైన కృష్ణదేవ రాయలకు పెద్దన్న 'హితుఁడు.' అట్లగుట రాయలవలన అనేకాగ్రహారములను పొంది ఆతఁడు ధనాఢ్యుఁడై మహాభోగముల చూఱఁగొనినాఁడు. పైఁగా పెద్దన్న పరిపాలనాదక్షుఁడైన మాండలికుఁడు.

—: ౪. భా షా ప ర శే ష భో గి త్వ ము :—

ప్రవరుఁడు భాషాపరశేషభోగి.

పెద్దనార్యుని భాషాపరశేషభోగిత్వమునకు మనుచరిత్ర యొక దర్పణము. మనుచరిత్రకృత్యాదిని కృష్ణదేవరాయలు కవితాపితామహుని 'చతురవచోనిధి' అని పేర్కొనుచున్నాఁడు.

—: ౫. దా న ని ర తి :—

ప్రవరుని దాననిరతి మెచ్చఁదగినది. దానతత్పరుఁడైన ఆతఁడు భోజనపదార్థములు కొల్లలుగఁ దెచ్చి ఇంటియం దుంచును. ఎంతమంది వచ్చినను, ఎప్పుడు వచ్చినను విసుగు విరామములులేక అతిథులకు అమర్చిపెట్టి ఆతని సహధర్మ చారిణి అన్నపూర్ణను దలపించుచుండును.

పెద్దన్న దాననిరతి వెల్లడించుటకు బలవత్తరమైన నిదర్శన మొకటి కలదు. తాను కృష్ణరాయలవలన పొందిన కోకట మను అగ్రహారమున కాతఁడు శఠకోపపురమని ఆత్మ గురుఁడగు శఠకోపయతి పేరుపెట్టి విప్రులకు సర్వాగ్రహార ముగా దానముచేసెను. ఇదికాక ఆతఁ డనేకదేవాలయము లకు భూదానములు చేసినట్లు నిదర్శనములు కలవు.

—: ౬. గు రు జ న భ క్తి :—

ప్రవరుఁడు యజ్ఞమొనర్చి నలుగురిలో గౌరవప్రపత్తులు సంపాదించెను. అయినను ఆతఁడు ఇంటిపెత్తనమును స్వీకరింప లేదు. పార్వతీపరమేశ్వరులవలెనున్న తన తల్లిదండ్రు లనిన ఆతనికి అమితమగు భక్తి. అట్లగుట గృహకృత్యవిచారణ తలి దండ్రులకు వదలి ప్రవరుఁడు వారియాజ్ఞకుఁ బద్ధుఁడై యుండు వాఁడు.

౯

# పారిజాతాపహరణ ప్రబంధపరామర్శ

క. లోకమునం గల కవులకు
నీ కవనపుఠీవి యబ్బునే? కూపనట
ద్భేకములకు, నాకధునీ
శీకరముల చెమ్మ! నంది సింగయ తిమ్మా!

—చాటుధార.

## —: ఉపోద్ఘాతము :—

ఆంధ్రప్రబంధమణిహారమునఁ బారిజాతాపహరణమొక యమూల్యమణి. దీనియందలి చవి, చక్కన - జవము, జీవము కలిగి ఆంధ్రతావాసనల మిటారించి పరమళించు మృదుమధుర కవితఁ దనివితీఱఁ జూఱకొని కవికుంజరులు- 'ముక్కు తిమ్మనార్య ముద్దుపలుకు'- అను బిరుద మిడిరి.

ఈ రసవత్ప్రబంధరచయిత యగు నంది తిమ్మన 'భువనవిజయాఖ్యసంసద్భవన' మలంకరించిన అష్టదిగ్గజములలో నెన్నిక గన్న విద్వత్కవికుంజరుఁడు.

## —: కవియుదంతము :—

తిమ్మన ఆఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కౌశికగోత్రుఁడు; నంది సింగనకును దిమ్మాంబకును దనయుఁడు. 'సకలవిద్యావివేకచతురుండ'గు మలయమారుతకవీంద్రునకు మేనల్లుఁడు.

తిమ్మన 'కృష్ణరాయక్షితీశకరుణాసమాలబ్ధచతురంత

యానమహాగ్రహారసన్మానయుతుఁడు.' విద్యానగరమున ఆకాలమునందున్న 'శివాచార్య'పీఠాధిష్ఠాతల మువ్వురిలో నొకఁడును, 'శివపరాధీనమతియు' నగు అఘోరశివాచార్యున కీతఁడు శిష్యుఁడు. విశేషించి ఈతఁడు 'శ్రీమదుమామహేశ్వరవరప్రసాదలబ్ధసారస్వతాభినంది.'

నంది తిమ్మనకు ముక్కు తిమ్మన యని పౌరుషనామము కలుగుటకుఁ గారణ మింకను దెఱచాటుముచ్చటగనే యున్నది. ఇందుఁగూర్చి ప్రాకృతజనులలోఁ దలయుఁదోఁకయులేని కత యొకటి వ్యాపించి యున్నది. అది యేది అందురా?

శా. నానానూనవితానవాసనల నానందించు సారంగ మే
లా నన్నొల్ల దటంచు గంధఫలి బల్కాఁకం దపం బంది యో
షానాసాకృతిఁ బూని సర్వసుమనస్సౌరభ్యసంవాసియై
పూనెం బ్రేక్షణమాలికామధుకరీపుంజంబు లిర్వంకలన్.

—వసుచరిత్ర. ఆ. ౨., ప. ౪౭.

అను నాసికావర్ణనపద్యరాజము నంది తిమ్మనరచన యఁట. రామరాజభూషణుఁడు దాని రామణీయకమున కలరి, విలిచి తన వసుచరిత్రమున నుటంకించుకొనెనఁట. అందుచే నితనికి ముక్కు తిమ్మన అనుపేరు కలిగిన దఁట. విశ్వాస్యమగునా?

ముక్కు పొడుపుగనుండుటచే నీతని కీనామము కలిగి యుండుననుట సమంజసము; సంభావితము.

—: కావ్యరచనకుఁ గారణము :—

రాజప్రేరణమే కావ్యకరణమునకుఁ దెలుగుసారస్వతమున విశేషకారణముగా నుండినది.

వేమనవలెఁ గేవలజిహ్వాచాపల్యము దీర్చుకొనుటకునై

పోతరాజువలెఁ 'గైవల్యపదంబుఁ జేరుటకునై', తిక్కనవలె 'నాంధ్రావళి మోదముం బొరయు'టకునై గ్రంథములు రచించినవారు ఆంధ్రవాఙ్మయమునం దరిది.

తిమ్మకవి ఈకావ్యము రచించుట జిహ్వాచాపల్యము దీర్చుకొనుటకుఁగాదు; కైవల్యపదముఁ జేరుటకుఁగాదు. నిజ కవితాప్రాగల్భ్యప్రచురణార్థముకూడఁ గాదనుట అసమంజస మనఁజెల్లదు.

పారిజాతాపహరణకావ్యకరణమునకు హేతువు రాజప్రేరణ మంతకుముందే కాదు. ఏమందురా? రాజు తన్ను రావించుట, గ్రంథము రచించి కృతియిమ్మని కోరుట మొదలగువాని ఊసైన నీకవి యెత్తఁడయ్యె. దేవతాప్రార్థనమైన వెనువెంటనే కృతిపతివంశావళిని వర్ణింప దొరకొన్నాఁడు.

కావుటచే, ప్రణయకోపకారణమున విముఖులును, విరసులును నైన తిరుమలదేవికిని, రాయలకును సంధానము చేయుటయే ఈకృతి రచించుటకుఁ గల కారణ మను జనశ్రుతి సత్యమే అనుకొనవలయును.

రవరవలుపుట్టిన భార్యాభర్తలకు- సత్యభామకు, శ్రీకృష్ణునకు: తిరుమలదేవికి, రాయలకు- అనుసంధానము చేయవలయునను గవి యుద్దేశము పారిజాతాపహరణ ప్రథమాశ్వాసమున మిలమిల ఉరళించుచున్నది.

ద్వితీయాశ్వాసముదొట్టి అనవసరవర్ణనములు పెక్కులు తనకావ్యమునఁ దగిలించుకొనిన తిమ్మన ఈయభిప్రాయమే మనమున లేనిచోఁ బ్రథమాశ్వాసమునందును బురాదివర్ణనలు జొనిపి గ్రంథము పెంచియుండును.

శ్రీకృష్ణుఁడు సత్యభామ సరసపుటల్కఁ దీర్చు ఘట్ట

మును కృష్ణదేవరాయులకు సాధ్యమైనంతత్వరలో వినిపింపవల యునను కవిచంద్రుని ఆసక్తియే వర్ణనాంశములు కుంచించి కథావస్తువును ఆ ఘట్టమునకుఁ బరువెత్తించునట్లును, పురము మొదలగునవి వర్ణింపక ప్రారంభముననే కథావతరణ మొనర్చి కవి తనయుద్దేశమును అన్యాపదేశముగ, అనాలస్యముగ రాయ లకు వినుచునట్లును జేసినది.

'పే రలుకం జెందినయట్టి కాంత లుచితవ్యాపారముల్ నేర్తురే' అను అర్థాంతరన్యాసముచేఁ దన యభిమతము కృష్ణ రాయలకు నివేదించి కవి లబ్ధమనోరథుఁ డయ్యెను.

అట్లగుట తిరుమలదేవికిని, రాయలకును తిరిగి స్నేహము కల్పించుటయే ఏతత్కావ్యరచనకు హేతువని చేయెత్తి చెప్పనొప్పును.

అతిరహస్యస్థల మగు నంతిపురమున నడచిన ప్రణయ కలహవృత్తాంతము తిరుమలదేవి తిమ్మకవి చెవినూఁదుట పొసఁ గని విషయ మనుకొనఁ జెల్లదు.

తిమ్మన తిరుమలదేవి యరణపుకవి. అట్లగుట చనువు బలిమిని ఆమె తెలిపియుండవచ్చును. లేదా నెచ్చెలికత్తెలచేఁ జెప్పించి యుండవచ్చును.

మఱియు తిమ్మన వృద్ధుఁడగుట తిరుమలదేవికిఁ బితృ సముఁడు. కావున నాతనితో నెట్టిసంగతి వచించుటకును తిరు మలదేవి సందేహింప నవసరములేదు. చెలికారమ్మన నెట్టి గోప్యవిషయమునైన మనసుకెక్కిన మిత్రుల చెవినివేయుట లోకసహజము.

కాన, ఇది పొసఁగుఁబాటుకల విషయమే యనుటయుం దసత్యతాసంశయము సమకూడుట కెడములేదు.

## —: శైలి :—

పారిజాతాపహరణమందలి శైలి అమృతరసపూరము. అందు నీతఁడు తన కావ్యప్రథమాశ్వాసమున గూర్చిన ప్రతిపద్యము ఒక్కొక్క పనసతొన. 'శిరీషకుసుమపేశలసుధామయోక్తు' లితనివి కాని పెద్దన్నవి కావు. ఏమందురా? మనుచరిత్రమందలి శైలి సంస్కృత జటిలము.

చ. వెఱవక మీ కొనర్తు నొకవిన్నప మిట్టివి యెల్లఁ జూచిరా
నెఱికలు గట్టుకొన్న మఱి యేండ్లుఁబూండ్లును బట్టుఁ బ్రాయపుం
జెఱుతతనంబు మీ మొగము సెప్పక చెప్పెడు నద్దిరయ్య మా
కెఱుఁగఁ దరంబె మీమహిమ లీరయెఱుంగుదు రేమి చెప్పుదున్.

—మనుచరిత్ర. ఆ ౧., ప 23.

వంటి అచ్చతెనుఁగు పదములు పొందుకొనియుండు పద్యములు కవితాపితామహుని కవనమున నూటికి కొకటి, కోటి కొకటి.

కాని తిమ్మన కవిత్వమున నట్టివి కావలసినన్ని. నిదర్శనముగా నాలుగైదు పద్యము లుదాహరించెదను:

ఉ. చక్కనిదాన వంచు నెలజవ్వని వంచు జగంబులోనఁ బే
రెక్కినదాన నంచుఁ బతియెంతయు నాకనురక్తుఁ డంచుఁ దా
నిక్కుచు విఱ్ఱవీగుచు గణింపదు కాంతల సత్య యింతకున్
స్రుక్కకయున్నె నీమహిమ సూచిన బోటులు విన్నవించినన్.

—ఆ ౧., ప ౭౭.

ఉ. ఇన్నిదినంబులున్ సవతు లిందఱిలోఁ గడు గారవంబునం
గన్నియ నన్ను వల్లభుఁడు గన్నులఁ గప్పుకొనంగ నుండి యా

వన్నెయు వాసియుం దఱిఁగి వారు ననుం దలకెత్తి చూడఁగా
సన్నలఁ జాయలం బలుకసైతురె ప్రాణము లింత తీపులా!

—ఆ. ౧., ప ౮౮.

చ. మన మరయం దలంచి యొకమార్గము నన్నితొ నవ్వటాలకో
నను వెలిపించెదో యకట నాయెడ నిక్కము దప్పఁగల్గెనో
వనజదళాయతాక్షి! పగవాఁడనె నన్నిటు లేల చూడ వా
క్కునిమిషమైన నీవు దయఁ గన్గొనకుండిన నిల్వనేర్తునే?

—ఆ. ౧., ప ౧౧౯.

ఉ. ఈ నయగారపుం బ్రియము లీపస లీమొగమిచ్చమాట లే
లా నిను నమ్మియుండిన ఫలం బిది తోడన కల్గె నాకు నీ
యానను మీ ననుం జెనకి యాఱడి పెట్టిన నవ్వువారలం
గాన నెఱుంగనే పనుల కోపరి భావజమర్మకర్మముల్

—ఆ. ౧., ప ౧౩౪.

ఉ. గట్టిన చేఁతలుం బసలు గల్లదనంబులు నీవు పుట్టఁగాఁ
బుట్టిన వెందు లేని పలుఁబోకల మాయలు నీకు వెన్నతోఁ
బెట్టినవా యెఱింగియును బేలతనంబున నిన్ను నమ్మి నా
గుట్టును దేజము న్మగులఁ గోల్పడిపోయితి నేమి సేయుదున్.

—ఆ. ౧., ప ౧౨౭.

ఈ పద్యములందు సంస్కృతపదములు పరకపాటు. ఆ పరకపాటు సంస్కృతపదములైనను వాడుకలో లేని మారు మూలపదములు గావు.

సులలితాంధ్రపదార్భటిచేఁ బొంపెసలారి, ప్రతిభాప్రాగల్భ్యములతోఁ బదముల నేర్చి చేర్చిన సావు సంతనలచేఁ గొతుకులువడకయుఁ గుంటువడకయు నిక్కావ్యమందలి శైలి గొప్పరథమువలె నొయ్యారముగా సాగిపోవుచున్నది.

మధ్యయుగకవుల గ్రంథములలోఁ గన్పట్టు సంస్కృత సమాసముల యాడంబర మింతగా లేకుండుట యొక గొప్పవిశేష మనక తీరదు.

—: లలితశృంగారము :—

లలితశృంగారమున కీకావ్యరత్నము నిధానము.

శృంగారము శ్రుతిహితముగ వర్ణించినఁ గవులలోఁ దిక్కయజ్వ మేటి. అతని మార్గము పట్టి అనంతర కాలమున మంచన, జక్కన, అనంతామాత్యుఁడు మొదలగు కవిగ్రామణులు శృంగారమును సుకుమారముగ వర్ణించి ధన్యులైరి.

పచ్చిశృంగారమును ఆంధ్రమునకుఁ గొని తెచ్చినవాఁడు శృంగారశ్రీనాథుఁడు. ఆతనిఅడుగులలో నడుగులువైచి కవన మల్లి పెద్దన్న దూష్యశృంగారమును పెంపొందించినాఁడు.

తిమ్మన అట్లుగాక శృంగారమును సుకుమారముగ, శ్రుతిహితముగ, సులలితముగ వర్ణించి సరసమతులకు సంతోషము సమకూర్చినాఁడు.

రతివర్ణన మొదలగు పచ్చిశృంగార మనిన నితనికిఁ దలయేరు. అట్టివి వివరింపవలసినచో నీతఁడు ముక్తసరిగ మూఁడుముక్కలలో ముగించును. సాయంకాలవర్ణనము, అంధకారవర్ణనము, నక్షత్రవర్ణనము, చంద్రోదయాదివర్ణనము మొదలగునవి చదువరులకు విసువుఁబుట్టునట్లుఁ బొడుగించి పెంచి వ్రాసిన కవియే శ్రీకృష్ణుని రాత్రిచర్యను వర్ణించుచో 'శయనాగారంబున వినోదకేళిం దేలి నిద్రాముద్రితనేత్రుఁడై శయనించె' నని సూక్ష్మముగఁ దేల్చివైచినాఁడు.

మఱియు మురారి వైజయంతమున విడిసిననాఁటిరాత్రి సత్యఁగూడి 'మనోభూరాజ్యసౌఖ్యనిద్రాపారీణత నుండుచోఁ

ప్రభాతంబయ్యె' నని ప్రశంసనీయమగు ఒకకప్పదాటు వేసి నాడు.

మెలకువతో, నేర్పుతో శృంగారరసపోషణ మొనర్చిన ఈవిద్వత్కవిరత్న మొక్కచో నావిషయమున ఔచితీభంగము చేసెను.

రుక్మిణీరమణితో నారదుఁడు

మ. అళినీలాలక! నీవు నీపతి రహస్యక్రీడ వర్తించువే
ళ లతాంతాయుధసంగరంబునకు నుల్లాసంబు గల్పించు ను
జ్జ్వలదీపాంకురమై రతిశ్రమతనూసంజాతధారాళఘ
ర్మలవంబు ల్దొలఁగింపఁగా నురటియై రంజిల్లు నిచ్ఛాగతిన్.

—ఆ. ౧., ప ౭౦.

అని ఆడిన వచనములు తప్పక అనౌచిత్యమునకుఁ బాల్పడినవి.

పురాణదంపతుల సమక్షమున నారదునివంటి లోకోత్తర పురుషుఁ డిట్టి పిచ్చుపెడకట్టిమాటలు ప్రేలుట దూష్యము.

శృంగారరసపరిపోషణమునఁ దిమ్మన కావించిన లోప మిది యొక్కటే.

—: పాత్రగుణపోషణము :—

పాత్రగుణపోషణము పెక్కురు ఆంధ్రకవులకు వింత విషయము. నన్నయ, తిక్కన, సూరన మున్నగువారు పాత్ర గుణపరిపోషణమునం దందెవేసిన చేతులు. తిమ్మకవికూడఁ గొంచెమించుమించు నంతవాఁడే.

పాత్రస్వభావపరిపోషణమును ఈకవి నిర్వహించిన తీరు దీనితరువాతివ్యాసమున విపులవివరణ మందియున్నది.

—: మానవస్వభావపరిశీలనము :—

మానవస్వభావసూక్ష్మపరిశీలనము సునిశితప్రతిభులగు కవిరాట్టుల సహజగుణము. అట్టి పరిశీలనమున తిమ్మన గడి దేఱిన ఆంధ్రకవిరాజు.

నారదుని కలహప్రియత్వము, సమయోచితకార్యనిర్వహణవైదుష్యము- నరకాసురదమనుని నక్కనైచ్యములు, మాయాకల్పనాచాతురి, సుకుమారశృంగారరసజ్ఞానప్రాగల్భ్యము- సత్యభామ రాజసము, అసూయాదిగుణములు సూక్ష్మబుద్ధితోఁ బరిశీలించి, పరామర్శించి అసదృశకౌశలముతో తిమ్మకవి చిత్రించినాఁడు.

—: ప్రథమాశ్వాసము :—

పారిజాతాపహరణమనోహరకావ్యరత్నమున ప్రథమాశ్వాసమే రసకందాయము.

ప్రభావతీప్రద్యుమ్నమున ప్రథమ ద్వితీయ తృతీయాశ్వాసములు- మనుచరిత్రమున ద్వితీయాశ్వాసము- పాండురంగ మహాత్మ్యమున తృతీయాశ్వాసము రుచివిస్తారము కలిగియున్నట్లు పారిజాతాపహరణమున ప్రథమాశ్వాసము విశేషరుచిరమై ఉన్నది.

పారిజాతాపహరణప్రథమాశ్వాసమునందలి పద్యములు జున్నుముక్కలు, రసాలవాలములు. అవి ఇక్షుదండములఁబోలె నింపెసలారి చమ్మఁదనము చిమ్ముచుండును.

ఇందలి పలుకుల తియ్యందనము చదువువారికి, వినువారికి నింపుఁబెంపు సంపాదించును. నోరూరునట్లు రసము చిల్కు రచనములు- ముద్దులుమూటగట్టి మురిపించుచుండు సులలితాంధ్రపదప్రయోగములు- నిగూఢములు, నిక్షిప్తములు

నగు మనోభావముల వెల్వరించు కవి పరిజ్ఞానపాటవమును ఈ ప్రథమాశ్వాసము తుదిముట్ట నెట్టుకొని చూపట్టుచున్నది.

వేయేల! ఈభాగమందలి కవిత్వసారస్యసారళ్యములు కవితాపితామహ, రామరాజభూషణాదులకు సైత మబ్బినవి కావని చేయెత్తి చెప్పవచ్చును.

మఱియొక విశేషము: తులఁదూఁచితీఱిచినట్లు హత్తినది, ఈయాశ్వాసమందలి పదముల పొందిక. ఇందలి ప్రతిపదమును గంభీరార్థప్రతిపాదకమై యున్నది. కనుఁడు:

క. పూనుకొని మేలుగీళ్ళకు
లోనయి విహరించువారి లోక మెఱుఁగదో?
యా నరకాసురదమనుఁడు
దా నెఱుఁగఁడొ? భోజకన్య తా నెఱుఁగదొకో?

—ఆ. ౧., ప ౯౧.

అని సత్య పేకరుచున్నది.

కృష్ణమూర్తినిగూర్చి 'నరకాసురదమనుఁ' డనుటలో విశేషార్థ మిమిడియున్నది. నరకాసురవధావసరమున నాథునకుఁ దాఁజేసిన సాహాయ్యము స్మృతిపథమునకుఁ దెచ్చుచున్న దన్నమాట, సత్య.

ఇట్లే 'లతాంతాయుధుకన్నతండ్రి' యను పదముకూడ సాభిప్రాయవిశేషమిళితము.

ఉ. ఈ లలితాంగిచంద మొకయించుక చూచెదనంచు ధూర్తగో
పాలుఁడు...

ఇచ్చో ధూర్తగోపాలపద మెంతటి అర్థగాంభీర్యముఁ దాల్చుచున్నదో సరసమతులకుఁ దెల్లమే.

ఇటులనే ఈయాశ్వాసమునఁ బ్రతిపదమునకుఁ గొండంత విలువ.

స్వభావోక్తివర్ణనమున కీభాగము విడిది. ఆ వర్ణనము మనస్తోషజనకముగనుండి కవి విమలశేముషీవిశేషమును గుబాళించుచున్నది.

శ్రీకృష్ణుఁడు సత్యభామ పొలయలుక తీర్చి అనునయించు ఘట్టమందలి స్వభావోక్తిని 'కవితాప్రావీణ్యఫణీశుఁ'డును, రసజ్ఞుఁడును నగు రాయలు ఆలించి, మేలెంచి ఎంతలరియుండునో?

—: కందువమాటలు :—

లోకోక్తిసంఘటనాపాటవము తిమ్మన కుగ్గుఁబాలతో నేర్చిన విద్య. సమయానుగుణముగఁ జక్కని జాతీయములు, లోకోక్తు లిమిడ్చి స్వభావోక్తిని వర్ణించు కవులలో నితని కితండె సాటియనుట విశేషోక్తిగాదు. తిలకింపుఁడు:

క. అలరుంబోఁడుల లోపల
వలరుం బోఁడుములు నీకు వగ్గలమగుచున్
దలపూవాడక యుండుము
తలపూవు ధరించి వికచతామరసాక్షీ!

—ఆ. ౧., ప ౬౪.

క. పలుదెఱఁగు ముళ్ళమాటలు
కలహమె కల్యాణమని జగంబుల వెంటన్
మెలఁగెదు మానికి సహజము
వలదని వారింపవలదె వల్లభుఁ డతనిన్.

—ఆ. ౧., ప ౮౯.

'తలపూవు వాడక, ముళ్ళమాటలు, కలహమె కల్యా

ణము' మొదలగు చక్కని జాతీయములను ప్రస్తావనావసరము గుర్తించి పొందికగా హత్తించి తిమ్మన కావ్యమునకు వన్నెయు, వాసియుఁ దోడితెచ్చెను. అంతియేకాని ఇతడు తన కావ్యమున భట్టుప్రభువు కుచేలోపాఖ్యానమునందువలె స్థానమున: అస్థానమున, సమయమున: అసమయమున లోకోక్తులను, జాతీయములను ఉద్దేశపూర్వకముగ దూర్చి కావ్యశోభకు డిందుపాటు ఆపాదింపలేదు.

## —: కథానిర్వహణము :—

కథానిర్వహణమున తిమ్మకవి సూరనకుఁ దీసికట్టయినను కవితాపితామహరామరాజభూషణులకంటె మిన్న.

ప్రథమప్రబంధముగాఁ జెలామణీయగుచున్న మనుచరిత్రమునందు వస్త్వైక్యము లేదు. వసుచరిత్రకు వస్తువే లేదనుట సత్యేతరముగాదు.

కావ్యమున కనువగువస్తువు, ఆవస్తువునకుఁ దగిన ఐక్యత పారిజాతాపహరణమునఁ జాలవఱకు సిద్ధించినవి.

ఈ కవికమలాసనుని కావ్యప్రపంచకల్పనాచాతుర్య మపూర్వము. భాగవత దశమస్కంధములోని యేఁబదితొమ్మిదవ యధ్యాయమునందు మూఁడుశ్లోకములలో నతిలఘువుగ వర్ణితమైన కథాలవము నెంచి తీసి, పెంచి పెంచి, మెఱుంగు పెట్టి సుకుమారప్రబంధముగఁ గ్రొత్త వెల్వరించెను.

మఱియొక విశేషము. పారిజాతాపహరణమున ప్రథమాశ్వాసమందలి వస్తురచన నాటకసంవిధానసిద్ధముగ నున్నది. పాత్రసన్నివేశము, సంభాషణ దృశ్యకావ్యసంప్రదాయధోరణిలో నున్నవి.

ప్రభావతీప్రద్యుమ్నమున దృశ్యకావ్యసంపూర్ణసంప్రదాయములు సంఘటిల్లుటకుఁ బారిజాతాపహరణమునందు సూచనగఁ జూపట్టు నాటకసంప్రదాయాదర్శమే చాలవఱకు దోహదమనుట సత్యసమీపము.

ఇక్కావ్యమందలి కథానిర్వహణముకూడఁ బూర్తిగా నిర్దుష్టము, నిరుపమాన మనుటకు వీలుచాలదు. ప్రథమాశ్వాసమున గుత్తముగాఁ, బొంకముగా నున్న కథాప్రణాళిక అంతటి నుంచి సడలి, సన్నగిలి చవిఁగొల్పకున్నది.

ప్రథమాశ్వాసమున నున్న రసవిజృంభణము, ఉద్దీపిత భావములు, ఉత్సాహము మిగిలిన ఆశ్వాసములందు- సందర్భశుద్ధి లేని వర్ణనాంశములు పెచ్చుపెరుఁగుటచేఁ- గవి నిర్వహించుకొనలేకపోయెను.

వస్తురచనావిషయమున మఱియొక లోపముగూడఁ గానుపించుచున్నది. పారిజాతాపహరణముతోఁ దెంపుచెంది పర్యవసితముకావలసిన కథ పుణ్యకవ్రతాచరణ వర్ణనములో సంక్రమించినది.

తిమ్మకవియందు విశేషగౌరవముకలవారైనను గథాసంవిధానములో నిది యొక గొప్పలోప మనుటకు జంకరు. పుణ్యకవ్రతాచరణమున కిందుఁ బ్రసక్తిలేదు; ప్రయోజనము లేదు. గ్రంథము ననవసరముగాఁ బెంచుటకై తెచ్చిపెట్టుకొన్న విషయ మది.

—: వర్ణనములు :—

పురవర్ణనము మనప్రబంధములకుఁ దప్పని తద్దినమైనది. తిమ్మనమాత్ర మట్టి దాస్యమునకు లోఁబడక పారిజాతాపహరణమున ద్వారవతీవర్ణనము చేయక తన స్వాతంత్రత

చాటినాఁడు. పురవర్ణనములు చదివి చదివి నోళ్ళు కాయలు కాసిన, విని విని చెవులు చీములుకట్టిన ఆంధ్రప్రబంధపాఠక శ్రోతలకుఁ. పారిజాతాపహరణము కొలఁదియిడరాని ఆనందమును సంధానించును.

మాతలినోటఁ బెట్టి ప్రభావతీప్రద్యుమ్నమున పురవర్ణనమునకు సూరన నవీనచైతన్యము, నూతనమర్యాదను కల్గించినట్లే తిమ్మనకూడ నొకసందర్భమున సూచనగఁ బురవర్ణనముఁ జేసి నవ్యత నాపాదించె ననఁజెల్లును.

చూడుఁడు:

ఉ. ఆరమణీలలామముల నందఱఁ గూడి యదూద్వహుండు త
ద్ద్వారవతీపురోపవనవాటికలం గృతకాద్రిసీమల
న్వారిధితీరకుంజసదనంబులఁ గేళితరంగిణీతటీ
కైరవిణీసహాయమణికల్పితసౌధముల న్వసించుచున్.

—ఆ ౧., ప ౪౦.

అనుటలోఁ బురోపవనవాటికలు, అందలి కృతకాద్రి సీమలు, మణిసౌధములు ప్రస్తావనవశమునఁ జమత్కారముగఁ జతురతతో సూచించియున్నాఁడు.

పురవర్ణనాదుల ఉబుసైన నెత్తక కథారంభమున నూత్నమర్యాద, స్వాతంత్ర్యముఁ జూపి కావ్యమును నీటుపఱిచిన కవిచంద్రుఁడే ద్వితీయాశ్వాసము మెట్టి అలంకారికకవిత్వపు రొంపిలో దిగఁబడి అనవసరవర్ణనాంశములు దగిలించుకొని గ్రంథమును తడిపి మోపెడు చేసినాఁడు.

ఈవర్ణనములు ఉత్తరకథావిస్తృతికి సాధనములు కావు. రసపోషకములా? అంతకుముందే కావు. అసంగతములగు నిట్టి వర్ణనములు తిలకించి తిమ్మనయందు గౌరవప్రపత్తి

లు గల ఏతత్ప్రబంధపాఠకులు చింతిలక మానరు.

—: వీ ర ర స ము :—

ఖడ్గతిక్కనసోదరుఁడగు తిక్కనసోమయాజి వీరరసమును వర్ణించినట్లు, కృష్ణదేవరాయలవంటి వీరావతారముతోఁ జెలిమిగలిగి మెలఁగిన తిమ్మనకూడ వీరరసమును ఉత్తేజకరముగ వర్ణించియుండవలసినది.

కాని పారిజాతాపహరణమున వీరరసఘట్టములు చప్పగానున్నవి.

ఇందు తిమ్మన తప్పిద మేమియు లేదనవలయును. పారిజాతాపహరణప్రబంధరచననాఁటికే అతఁడు వయసుమీఱిన మానిసి. ముదుకఁడు నెట్టికశీల యగుఁగాని ఉద్ధతుఁడు గానేరఁడు. ఉద్ధతిలేని వీరరసము పేలపిండిగదా!

విశేషించి తిమ్మనశైలికి లాలిత్యము, లావణ్యములున్నవిగాని ఉద్వేగము, ఉరవడి లేవు. శృంగారరసము చిలికి చిత్రించు శైలికి లాలిత్యలావణ్యములు ముఖ్యావసరములు. కావుటనే పారిజాతాపహరణమున శృంగారరసప్రధానములగు ప్రథమ, ద్వితీయాశ్వాసములు తేనెతెఱలఁ బోలుచున్నవి. వీరరసముకూర్చు శైలికి ఉద్వేగము, ఉరవడి మెండుకొనియుండవలెను. అవి లేకుండుటనే ఈప్రబంధమందలి యుద్ధఘట్టములు రుచివిషయమునఁ గొంచెము తెట్టగిలి వెనుకాడుచున్నవి.

—: అ పూ ర్వ శై లీ ప్ర యు :—

ఈ కావ్యమునందలి ఇట్టి చిన్నిలోపములమీఁద మన దృష్టిని కేంద్రీకరించుట పాఁడికాదు. అనేకాంధ్రప్రబంధముల

బో లేని అపూర్వవైశిష్ట్య మొకటి పారిజాతాపహరణమున నుండుట మనము ముఖ్యముగా గమనింపవలసియున్నది.

మనుచరిత్ర, వసుచరిత్ర, ప్రభావతీప్రద్యుమ్నము మున్నగు ఆంధ్రప్రబంధములు ప్రాయికముగా నాయికానాయకుల పరిణయవృత్తాంతములతో పర్యవసితము లగుచున్నవి. పారిజాతాపహరణము మాత్రి మీవిషయమున నూతనపథమున నున్నది.

పారిజాతాపహరణప్రబంధమున ప్రస్తావితవిషయము పరిణయానంతరకౌటుంబికజీవితవృత్తాంతము. ఈసందర్భమున నీకావ్యముతో దొరయుపాటి ప్రబంధము ఆంధ్రమున మఱి యొకటి లేదనికూడఁ జెప్పవచ్చునేమో!

—: ఉపసంహారము :—

అర్థసంపద, భావచమత్కృతి, రసపుష్టి, సందర్భశుద్ధి, వస్తురచనాకౌశల్యము మొదలగు కవితాసంభారముల నెల్ల నేర్చి కూర్చి, తెలుఁగుపలుకుబడుల గుబాళింపులతోఁ గావ్యమును భోగ్యద్రవ్యముగా నొనర్చి ఆంధ్రప్రబంధకవులలోఁ దిమ్మన వీనుమిగిలినాఁడు. దేశభాషలందుఁ దెలుఁగు లెస్స యగునట్లుగా సృష్టిపఱచిన కావ్యస్రష్టలలో నుత్తమశ్లోకుల వర్గమున తిమ్మనార్యునకు మంచిస్థానము కలదు.

ఆంధ్రప్రబంధభాండారమునఁ బ్రథమస్థానము ప్రభావతీప్రద్యుమ్నమునకుఁ జెందుననుట నిర్వివాదాంశము. ద్వితీయస్థానము మనుచరిత్ర, వసుచరిత్ర, పారిజాతాపహరణములలో నెద్దానికి లభించు ననుట విమర్శకులు పరామర్శింపవలసిన విషయము.

ఈ సందర్భమున నెంతయేని అవకాశము గలదు, భేదాభిప్రాయములకు.

పారిజాతాపహరణమే ద్వితీయస్థానమున కర్హ్హమని నా వాదము.

పాక్షికబుద్ధితో విమర్శకు లా స్థానము పారిజాతాప హరణమున కీయకున్నచో నదియే మను, వసు చరిత్రల మెడ వట్టి నెట్టి వెన్బడఁజేసి ఆ స్థానము నాక్రమించి అలంకరించి మించఁగలదు.

అందులకుఁ గారణము లీవ్యాసమున నాయాతావుల వివరించియే యుంటిని.

## ౧౦

# పారిజాతాపహరణము-పాత్రపోషణము

అనేకాంధ్రప్రబంధములలో మందునకైనఁ గానరాని సముచితపాత్రసంపోషణము పారిజాతాపహరణప్రబంధమున సెబాసని శిరఃకంపము చేయవలసివచ్చునట్లు నిర్వహింపఁబడినది.

నారదుఁడు, సత్యభామ, శ్రీకృష్ణుఁడు- పారిజాతాపహరణమునఁ బ్రధానపాత్రలు.

కథాప్రారంభమునందే ముఖ్యపాత్రలతోఁ బాఠకులకుఁ బరిచయము కల్పించుట గొప్పకవిలక్షణము. కవిసంప్రదాయము కూడ.

షేక్స్పియరు తననాటకములందుఁ బ్రాయికముగాఁ బ్రథమాంకముననే చదువరులకు ప్రధానపాత్రలతోఁ జనవు కల్పించుననుట ఏతత్కవికృతనాటకపాఠకుల కనుభవపునరుక్తమగును.

ముక్కు తిమ్మనార్యుఁడుకూడఁ బ్రథమాశ్వాసముననే ప్రధానపాత్రలతో మనకుఁ బరిచయము కల్గించియున్నాఁడు.

ఈప్రధానపాత్రల స్వభావపరిపోషణము కవి యెట్లు నిర్వహించెనో ప్రత్యేకించి విమర్శించుకొందము.

### —: నారదుఁడు :—

నారదుఁడు కలహాశనుఁ డనుట జగమెఱిఁగిన విషయము. అతని కలహప్రియత్వ మిందు లెస్సగాఁ జక్కఁగాఁ జిత్రితము.

ఈ 'పోరోగిరము తిండిపోతు' శ్రీకృష్ణుఁడు రుక్మిణీ కాంతగృహంబులో జూదమాడుచుండ నచ్చటి కరుదెంచి పారిజాతకుసుమరాజ మాతని కొసంగెను. అతం డది భోజనందన కిచ్చెను. కయ్యము కల్పించుటకు 'నారి వేరంపుఁదపసి'కి సందు దొరకినది.

అతండు 'కలహసంభ్రమపరుఁడై' పారిజాతప్రసూన ప్రభావము తెలియఁజెప్పి రుక్మిణితో నిట్లనియె: 'నెటిగొప్పన నీకుసుమంబు దాల్చుటచే సవతులువచ్చి నీ చరణసారసయుగ్మము నాశ్రయింతురు. ధవుఁ డటులేనికూర్మి జవదాఁటక నీపలు కాదరించును.'

మన బాఁపఁ డంతటితో నూరకుండెనా? లేదు. ఊరకుండుచోఁ గలహబీజ మేది?

స్తుతివాక్యములలోఁ గలహకారణములు మేళవించి-

ఉ. చక్కని దాననంచు నెలజవ్వనినంచు జగంబులోనఁ జే
రెక్కినదాననంచుఁ బతియెంతయు నాకనురక్తుఁడంచుఁ దా
నిక్కుచు విఱ్ఱవీఁగుచు గణింపదు కాంతల సత్య యింతకున్
ద్రుక్కకయున్నె నీమహిమ సూచిన బోటులు విన్నవించినన్.

అని సత్యకుఁ గోపజనకంబులగు పలుకులు వచించినాఁడు,

ఔరా! నారదుని చాకచక్యము! స్తుతివాక్యములలోఁ గూడఁ గలహము వర్షింపఁడాయె.

ఇఁక నేమున్నది? అనుకొన్నంతయు నైనది.

ఈవృత్తాంతము సత్యకుఁ దెలిసినది. ఆపె మూతిముడిచినది. కంసారి తనకాళ్ళమీఁదఁబడి వేఁడికొనఁగా నాతనిశిరమును వామపాదమునఁ దొలఁగఁ ద్రోచినది. పారిజాతవృక్షమే

తెత్తునని శ్రీకృష్ణునిచే ననిపించినది. నారదుని కలహబీజ మిట వి త్తఁబడి మొలకెత్తినది.

మునీశ్వరుఁడు సత్యభామకుఁ గోపము పెచ్చెత్తునట్లు నిందించి రుక్మిణీకృష్ణులకును, నామెకును మనసులో రవరవలు పుట్టించినాఁడు.

అంతతో నిలిచెనా? పారిజాతతరుసంపాదనకై మురారి వృత్రారితోఁ గయ్యము చేయవలసియుండును. దీనంజేసి ఇంద్రు నకును, కృష్ణునకును గూడ నారదుఁడే పోరు కల్పించినాఁ డన వచ్చునుగదా!

ఒకటికి రెండు కల్పించిన నారదుని బుద్ధివైశద్య మేమని కొనియాడఁగలము?

చిత్రము కనుఁడు.

రుక్మిణీకాంతగృహములో సత్యను నోరికొలందు లాడిన నారదుఁడే సాత్రాజితి కావించిన యతిథిసత్కారము లందికొని, పందేరము లారగించి, త్రేఁపులు త్రేఁచుచు- 'నతులప్రాభవ వైభవోన్నతుల ప్రోవై యిట్లు వర్తించు నినుం బోలంగల రబ్జ గంధు లన వింటే యెందు సాత్రాజితీ!'- అని మొగమిచ్చ మాటలాడెను.

'ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటి కామాటలాడు'- నారదుని సమయోచితకార్యనిర్వహణ వైదుష్య మెంత నేర్పుతోఁ గవి చిత్రించినాఁడో కంటిరా?

సత్యను ముఖస్తుతిచేయుకాలమునందే అతఁడు- 'అని కైనం బతి నిన్నుఁబాసి చనునో'- యని సాభిప్రాయముగా వచించి కృష్ణునితో నాకమున కామెకూడఁ బోవునట్లుఁ బొసం గించెను.

మొలకెత్తిన కలహబీజ మిట చెట్టయి పూచి కాచి ఫలించినది.

స్తుతిలోఁ గలహకారణములు మేళవించుటయే నారదుని చాకచక్యము. అదియే ఆతఁడొనర్చు చమత్కారము.

పారిజాతతరువు దెచ్చిన పదంపడి నారదుఁడు తిరిగివచ్చి- 'హేమనిభగాత్రి! నీభాగ్య మేమి చెప్పు!' అని సత్యను సన్నుతి చేసి, ఆమెచేఁ బుణ్యకవ్రతమును జేయించి, వ్రతదక్షిణగా నామెవలనఁ గృష్ణునిగ్రహించి, యతనిచే వెడఁగుపనులఁ జేయించి యెల్లరయుల్లంబుల హాస్యము దొప్పఁదోఁగించెను.

పరమభాగవతశిరోమణియు, భక్తాగ్రేసరుఁడును నగు నారదుఁడు నవ్వులాల కట్లొనర్చెనే కాని నిక్కంపుమనముతోఁ గాదు. ఆతండు మొక్కవోని భక్తుఁ డనుటకు రుక్మిణీసద్మమునను, పుణ్యకవ్రతానంతరమునను శ్రీకృష్ణభగవానుని స్తుతించిన పద్యములే చాలును.

ఒక్కవిషయమున నారదుని స్వభావపరిపోషణమునం దనౌచిత్యము కనిపించుచున్నది.

ఏదియందురా? పారిజాతప్రభావము రుక్మిణితో వర్ణించునెడ నారదుఁడు:

మ. అళినీలాలక! నీవు నీపతి రహస్యక్రీడ వర్తించు వే
ళ లతాంతాయుధసంగరంబునకు నుల్లాసంబుఁ గల్పించు ను
జ్జ్వలదీపాంకురమై రతిశ్రమతనూసంజాతధారాళఘ
ర్మలవంబు ల్తొలఁగింపఁగా సురటియై రంజిల్లు నిచ్చాగతిన్.

అనుట అనౌచిత్యముగ, నసమంజసముగ నున్నది.

ఈమాటలు మునులనోటనుండి రాఁదగినవి కావు. భార్యాభర్తలయెదుట నారదునివంటి సకలశాస్త్రపారంగతుఁ డిట్టి

యసభ్యశ్రృంగారవచనము లుచ్చరించెననుట అనాగరకము కదా?

ఈఘట్టమున ముక్కు తిమ్మన్న నారదుని స్వభావపరిపోషణము చెడఁగొట్టి పప్పులోఁ గాలువైచెననుటలో సందియము లేదు. పాత్రపరిపోషణమునం దీకవి గావించిన లోప మిది యొక్కటే.

నారదుని కలహప్రియునిఁగా, 'ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటి కా మాటలాడి' సమయోచితముగఁ గార్యము నిర్వహించుకొనుటయందు నిపుణుఁగా, భక్తాగ్రగణ్యుఁగా తిమ్మనార్యుఁ డతిచాకచక్యముతోఁ జిత్రించియున్నాఁడు.

పారిజాతాపహరణమునందు రణభోజనుని పాత్ర ప్రధానమైనది. ఇందలి కథాకల్పనకు నాతఁడే సూత్రధారుఁడు. ఆతఁడు లేనిచోఁ గథయే లేదు.

—: సత్యభామ :—

సత్యభామ రాజసికగుణము గల స్త్రీరత్నము. 'కులమును రూపము న్మగని కూరిమియుం గలది.' సౌందర్యవతి, మానవతి, మహనీయసౌభాగ్యవతి,

కావుననే నారదుఁ డాడిన మాటలు విని లాఁతిదేవేరులు చల్లచల్లఁగ నూరకున్నను మానవతియగు సత్య 'ప్రేటుపడ్డయురగాంగనయుం బోలె నేయివోయ భగ్గని దరికొన్న భీషణహుతాశనకీల యనంగ లేచి'- నారదుఁడు 'అతులమహానుభావ మని యవ్విరి' యచ్యుతునకు నూడిదగా నిచ్చెఁగాక; 'తా నతఁడు ప్రియంబుగల్గు నెడ కర్పణచేసినఁ జేసెఁగాక; ఆ మతకరి వేలుపుఁదపసి మమ్ము దలంపఁగ నేల?' యని బిట్టు వగచినది.

రుక్మిణిఅని యనక 'ప్రియంబుగల్గు నెడ' కని భోజనందనను గూర్చి పల్కుటచే సత్యకు నామెయెడఁ గలుగు చూపోపమి యగ్గలము తెల్లమగును. 'మమ్ము' అను గౌరవార్థకబహు వచనప్రయోగముచే నామె రాజసికగుణము తెలియనయ్యెడిని.

సత్యభామకుఁ గృష్ణునిపైఁ గినుక వొడమినది. 'ధూర్త గోపాలుఁడ'ని మగనిం దూలనాడినది, 'శరదంబుదచలచిత్తులు పురుషు లన్నది.' 'ఆహా! యిట్టిమాటలు చెవులన్ వినంబడెనుఁ బ్రాణము దాల్చెద మేన నింతగా, నోఁచితి నింక నెట్టివి కనుం గొన నున్నదాననో'- యని యనర్థములకుఁ దలంకినది.

ఆమె కోపము క్రమముగా నె ట్లగ్గలమగుచున్నదో కనుఁడు.

మఱల నంతలో భర్తృప్రేమ తలంచుకొన్నది. వగల మిగుల నొగిలినది. 'మాసినచీర గట్టికొని, విరస్తభూషయై'- 'చీఁకటింటి కడకంకటిపై గాఢమనోజవిషాద వేదనచేఁ' బొరలినది.

ఇదంతయు నెందులకు? తనకు నలుగురిలో నలుసుఁ దనము వచ్చినదని.

ఈసందర్భమున స్త్రీజనసహజంబులగు అసూయాదిగుణ ములు కూర్పునేర్పుతోఁ గవి మనోహరముగ వెల్వారించి యున్నాఁడు.

కృష్ణుఁడు సత్రాజిత్తనయ నెన్నిరీతుల ననునయిం చెను. పాటలగంధి కోపభరముఁ దీర్పఁజాలక 'మృదుపల్లవ కోమలతత్పదద్వయీపాటలకాంతి మౌళిమణిపంక్తికి వన్నెవెట్ట నాజగన్నాటకసూత్రధారి' మ్రొక్కెను.

రజోగుణప్రధానయగు సత్య 'జలజాతాసనవాసవాది

సురపూజాభాజనంబై తనర్చు లతాంతాయుధుకన్నతండ్రి శిరమును వామపాదంబునం దొలఁగం ద్రోచె.'

అహా! రాజసమా! జగన్నాటకసూత్రధారి లతాంతాయుధుకన్నతండ్రి నీకు మ్రొక్కినను నీదారతనంపునీటు రవ్వంతైన సరే తగ్గించుకొంటివి కావుగదా!

సత్యభామ స్వాభిమానసంరక్షణప్రియత్వము, స్త్రీసహజమగు నసూయయు నిచ్చోఁ బ్రదర్శితము.

కృష్ణభగవానునివాక్యము లామెను నూఱటపుచ్చలేదు. అతనిని నిందింప దొరఁకొన్నది. పసులకాపరికి భావజుమర్మకర్మములు తెలియవన్నది. 'మాయలు నీకు వెన్నతోడఁ బెట్టినవి;' 'ఇంకిటు నిను నమ్మను,' అన్నది. 'మానరహితమైనబ్రదుకు మానిని కేలా?' అని ఆత్మగౌరవనాశనమునకై వగచినది. 'నను నెవ్వతెగాఁ జూచితివి' అని మఱల రాజసము మెఱపించినది.

అంతలోఁ జూపోపమి పెంపుచే నామెకు విచారము గల్గినది. స్త్రీలకుఁ గన్నీ రాయుధమువంటిదికదా! అగుట ఆమె గాసిలి యేడ్చినది.

నరకాసురదమనుఁ డామెకుఁ బూర్తిగ లొంగిపోయి నెయ్యముఁదియ్యముఁ దోఁప- 'పారిజాతవృక్షంబునే తెచ్చి నీపెరటిచెట్టుగ నాటింతుఁ బెంపుఁగనుము'- అన్నాఁడు.

అంత సత్యామానిని 'నీపల్తికవోలెం గనుపట్టె.' ఆమె సంతుష్టిచెందినది. నాథునకు మజ్జనభోజనాదులు యథావిధిగ సల్పినది.

చిన్నిసంగతులకై నను పెనువంతఁ గుంది యంతలో మఱల నూఱడిల్లుట స్త్రీలకు స్వభావసిద్ధము.

మఱియుఁ జీటికిమాటికిఁ జిట్టుబుట్టుమనువారే త్రుటిలోఁ బొగడ్తలకుఁ బొంగిపోవుదురు. లతాంతమాత్రముననే మూతి ముడిచిన సత్య మఱల నంతలో సంతసించినది.

ఆలుమగల యలుక 'అద్దముమీఁద పెసరగింజ నిలుచు నంతకాల ముండు' నని సామెత. అట్లే సత్య కృష్ణుని దూఱి యుఁ దన్నియుఁ బారిజాతపాదపము తెత్తు ననుటతోడనే హెచ్చుగా మెచ్చుకొన్నది. అందుచే నామె అల్పసంతోషి యని వచింపవచ్చును.

రుక్మిణీసదనంబునఁ దన్నుఁ దూలనాడిన నారదుఁడే తన వద్దకు వచ్చి తన్ను పొగడినవెంటనే సత్య పొంగిపోయినది. దీనిచే నామె అమాయకురాలని నిర్ధారణచేయవచ్చును.

నారదునకు సత్కారము లొనర్చుటచే నామె గురుజన భక్తియు, నుదాత్తగుణములును తెలియనయ్యెడిని.

శ్రీకృష్ణుఁడు సురతరువు పెకలించినపుడు నందనపాలురు వారించిరి. వారికిఁ గృష్ణుఁడు జవాబీయవలసియుండఁగాఁ దనకార్యము నెగ్గినదను గర్వముతో, తనముద్దు చెల్లిన దను నహంభావముతో సత్యభామ 'ఏమో వచింపఁబూను హృదయేశ్వరునిఁ గిరసంజ్ఞ మాన్చి' సురేశ్వరవనపాలకులను 'వార్ధిఁ బొడమిన యీదివ్యభూరుహమున కింద్రాణి యెవ్వతె? ఇంద్రుఁ డెవ్వఁడు? ఇందిరను గౌస్తుభము నెవ్వఁడు చేకొనె నతఁడె దీని కధికారి. తెకతేర యిది యేమి యొకరి సొమ్మె?' అని అడిగినది.

అంతతోఁ బోక-

'ఇది నాదువిభునిచే నీవదాన్యనగంబు
నొడియించుకొని యేఁగుచున్నదాన'-

అన్నది.

తిలకించితిరా? సత్యగర్వము.

విశేషమేమనఁగా సత్య శ్రీకృష్ణుని 'సత్యభామావిధేయుఁ' డనుట. ఆమె గర్వము సోడుముట్టినది. ఆమె యహంభావము ఆకాశమంటినది.

నారదుని పంపునఁ బుణ్యకవ్రతము సల్పుటచే నామె వ్రతనిష్ఠ, సదాచారసంపత్తి గలదియని ప్రస్ఫుటమగును.

సురమునీశ్వరుఁడు నాథుని ధారోదకపూర్వకముగ దానమొనర్పుమని యనినతోడనే సత్యభామ 'మధుకైటభమర్దన! చిత్తగించితే మునిపతి మాట?' అన్నది. భావము వెలిపుచ్చక, మర్మము చెడక, నోరు వెలితిచేసికొనక ఆమె తన భావానుగుణముగ నాథుని ఒప్పకోలు వడసినది. ఏమి? ఆమె తెలివితేటలు?

సత్యభామ ఆత్మగౌరవముగలది. మానవతి. రజోగుణప్రాధాన్యముగల కాంతారత్నము. స్త్రీలకు సహజముగ సవతులయెడనుండు అసూయాదిగుణములు గలది. అల్పసంతోషి, అమాయికురాలు. గురుజనభక్తి గలది. సువ్రత. సదాచారిణి. గర్వము కలది. అహంభావముకూడఁ గలది. కృష్ణుని మన్ననలఁ గన్నది. తెలివితేటలు గలది.

ఇట్టి ఆమె విశేషగుణములు నేర్పుతో, మెలఁకువతో వర్ణించి వివరించిన నంది తిమ్మనార్యుని విశేషశేముషీధురంధరత్వము నిరుపమానముకదా!

—: శ్రీ కృష్ణుఁడు :—

శ్రీకృష్ణుఁడు శృంగారపురుషుఁడు. రసికశిఖామణి. ఆతఁడు సత్యభామ ననునయించుటకై పన్నిన

మాయలు, సల్పిన సరసములు, వచించిన ముద్దుమాటలు, ఒనర్చిన కృత్యములు నాతని రసికత్వమును శృంగారరస స్వరూపవిజ్ఞానమును వేయినోళ్ళ వెల్లడిచేయుచున్నవి.

'నయగారవుం బ్రియములు, మొగమిచ్చుమాట' లాడి సత్య ననునయింపఁజూచెను. సత్య యెందు కలిగినదో తనకుఁ దెలిసియున్నను ఏమియు నెఱుఁగనివానివలె- 'మైతొడవు లేల ధరింపవు?'- అని పృచ్ఛించెను. చూచితిరా! 'మురారి మాయాకల్పనాచాతురి!' శతథా సాహస్రథా కీర్తింపవలసి యున్నది.

కోపోపశమనమునకై శ్రీకృష్ణుఁడు ఆమెను బ్రతిమాలెను. చివరకు మ్రొక్కెను.

అప్పుడైన సత్యభామ కోపాగ్ని చల్లారినదా? లేదు. పేరలుకం జెంది యామె పురుషోత్తము నుత్తమాంగము వామపాదముతోఁ దన్నినది.

దానికిఁ గృష్ణుఁడు గ్రుడ్లెఱ్ఱచేసెనా? మండిపడెనా? లేదు. లేదు. రసికజనశిఖామణి, 'భావజమర్మకర్మము లెఱింగిన పనులకాపరి,' శృంగారరసస్వరూప మెఱింగిన దక్షిణానాయకుఁడు అగు అతఁడట్లేల చేయును?

ప్రత్యగ్ర 'శిరీషకుసుమకోమలసుధామయోక్తుల'

చ. నను భవదీయదాసుని మనంబున నెయ్యపుఁగిన్కఁ బూని తాఁ
చిన యది నాకు మన్ననయ చెల్వగు నీపదపల్లవంబు మ
త్తనుపులకాగ్రకంటకవితానము సోఁకిన నొచ్చునంచు నే
ననియెద నల్క మానవుగదా యిఁకనైన నరాళకుంతలా!

[illegible] యనునయించి పారిజాతపాదపము దెచ్చి సత్యభామ కేళివనములో నాటుదునని ప్రతిన యొనర్చెను.

చిత్రమారయుఁడు: సత్యభామ నెయ్యపుఁగిన్కఁ బూని నదఁట. ఔరా! కృష్ణుని గడుసుమాటలు!

కోపమును ప్రసాదముగాఁ దీసికొనుటయందు మురారి దిట్ట. కోపమును ప్రసాదముగా స్వీకరించుటయే కోపాగ్నిని చల్లార్చుటకు, తద్వేగము తగ్గించుటకు ముఖ్యసాధనము. ఇట్టి సాధనము స్వాధీనములో నుంచుకొనిన కంసారి ఎంతటి మాయాకల్పనాచతురుఁడో, గడుసువాఁడో యోచింపుఁడు.

ఈ ఘట్టమునందలి శ్రీకృష్ణుని శృంగారవిలాసరహస్య జ్ఞానము, మాయాకల్పనాచాతుర్యము, గడుసుందన మసదృశ ముగాఁ జిత్రింపఁబడినది.

స్వర్గయాత్రకుఁ బోవుచుఁ దనకాంతకు విశేషవస్తువర్ణ నలు చేయుటచే నాతఁడు సత్యభామాప్రియుఁడని తేటతెల్ల మగును.

పారిజాతాపహరణమునకై ప్రియకాంత వేగిరించుచు న్నను నందనవనములోఁ గొంతకాలము విహరించుటచే నాతని క్రీడాప్రియత్వము తెలియవచ్చెడిని.

సముద్రమువలె సురసైన్యము దన్ను చుట్టుముట్టినను వెనుకంజ వేయక తా నొక్కఁడే నిలచి నిశ్చలధైర్యముతో, నిర్నిద్రసాహసముతోఁ బోరాడుటచే నాతఁడు మహావీరుఁడని నిర్ణయింపవచ్చును.

ఇంద్రుఁ డోడి సాఁగఁబడి మ్రొక్కిన కృష్ణుఁడు కృపా ర్ద్రచిత్తుఁడై ఆతని వజ్రమాతని కిచ్చె. పిఱికికండ లేని కడింది మగండగు కంసారి- 'చంపఁదగినయట్టి శత్రువు తనచేతఁ జిక్క నేని పొసఁగ మేలుచేసి పొమ్మను' విశాలహృదయుఁడనియు, సకరుణుండనియు దీనిచేఁ జెప్పఁజెల్లును.

'నీముఖుండలు కోరిన పారిజాతము చేకొంటిని' అని నేరము సత్యభామపైఁ బెట్టి, 'వలసినచోఁ దీసికొమ్ము'- అని యింద్రునితో ననిన నరకాసురదమనుని సంభాషణసమీచీనత, నాగరికత, గడుసుఁదనము ఏమని కొనియాడఁగలము?

పారిజాతముతో నిజనగరి కేతెంచి దేవకీవసుదేవులకు, బలభద్రునకుఁ, దక్కఁగల పెద్దలకు నమస్కరించెనని చెప్పుటచే శ్రీకృష్ణుని గురుజనభక్తి వెల్లడియగును.

పుణ్యకవ్రతసందర్భమున నారదునకుఁ దాను దానమీయఁబడుట కొప్పుకొలిచ్చుటచే నాతని సుకుమారసరస. శృంగారరసజ్ఞానప్రాగల్భ్యము తెల్లమగును.

నారదునిపంపున వెడఁగుపను లొనర్చుటచే నాతఁడు 'కపటనటనాపరుండనియు,' 'లీలామానుషశరీరుం' డనియు, భక్తాభీష్టప్రదాతయనియు, బ్రాహ్మణభక్తిపరాయణుండనియు స్ఫురించును.

శ్రీకృష్ణుఁడు రసికజనశిఖామణి. శృంగారవిలాసవినోదవిచక్షణుఁడు. 'సత్యభామావిధేయుఁడు.' మహావీరుఁడు; అట్లయ్యు కృపార్ద్రచిత్తుఁడు. మాయాకల్పనాచతురుఁడు. బ్రాహ్మణభక్తిపరాయణుఁడు. క్రీడాప్రియుఁడు. గురుజనభక్తి కలవాఁడు. గడుసరి. విశేషించి, కాంతల కనుసన్నల మెలఁగువాఁడు.

శ్రీకృష్ణుఁడు, సత్యభామ, నారదుఁడు ఈ కావ్యమున ప్రధానపాత్రలు. వీరుకాక ఇఁక ఇందలి పాత్రలు రుక్మిణి, ఇంద్రుఁడు.

—: ఇంద్రుఁడు :—

ఇందు ఇంద్రుఁడు కేవలము ఉత్తరకుమారునివలెఁ

జిత్రింపఁబడినాఁడు. సత్యభామావిధేయుఁడు పారిజాతాపహరణము చేయుటను వనపాలకులు పులోమజాస్వామియైన ఇంద్రునకుఁ జెప్పిరి. అప్పుడు ఇంద్రుఁడు అనిన మాటలు:

ఏమేమీ కృష్ణుఁడు మందలో బలెనె తా నింద్రద్రుమోత్పాటనం
బీమై నిచ్చటఁజూపవచ్చె నిదిమేలే తార్క్ష్యుఁడైన న్మదీ
యామోఘాశనిపాత మిట్టిదని యాహా! తెల్పఁడాయెంజుమీ!

పారిజాతమును ఇంద్రద్రుమమని గర్వముగాఁ జెప్పికొనెను, మందలోఁజేసినట్లు కృష్ణుఁడు చేయుచున్నాఁడని ఈసడించెను. గరుత్మంతుని ఈఁకనుమాత్రము చెండిన తన వజ్రాయుధము సంగతి గొప్పగాఁ జెప్పికొనెను. 'కన్నులువేయును జేవుటింప' కదనమునకుఁ బోయెను. తన అస్త్రమును దేవకీనందనుఁడు గైకొనఁగా ఇంద్రుఁడు విదుపదిచేసినాఁడు.

—: రుక్మిణి :—

ఇఁక రుక్మిణి పాత్రపోషణవిషయము:

శ్రీకృష్ణునకు సమతాభిమానవతులయిన మహిషులెనమంద్రు. వారిలో రుక్మిణిని, సత్యను హరి మిగుల మన్నించి హెచ్చుచనవు లిచ్చెను. కాఁగా వారిరువురకు కులరూపములకుఁ దోడు మగని కూరిమికూడఁ గలదను అభిమానముతో రవరవలు పుట్టినవి.

ఐనను రుక్మిణి పెద్ద, మహిమాన్విత కావున గంభీరముగ నుండినది. పారిజాతకుసుమధారణప్రభావమున

చక్కఁదనమున కొక వింత చక్కఁదనము
జవ్వనంబున కొకవింత జవ్వనంబు
విభ్రమంబున కొకవింత విభ్రమంబు

కలిగినను ఆమె తన గాంభీర్యమును విడనాడి ఒకమాటయైన ఆడలేదు.

తన సదనమునకు నారదుండు వచ్చిన అతనిని పూజించుచు, నారదునివలన నందికొని శ్రీకృష్ణుండు తనకిచ్చిన పారిజాతకుసుమము నెఱిగొప్పునఁ దాల్చి వెలుగొందుచు, 'సతులు పదాఱువేవురును సంగడీరా కమలరాగమణీశిబికాధిరూఢయై' పుణ్యకవ్రతసందర్భమున సత్యభామసదనమునకుఁ బోవుచు మాత్రమే రుక్మిణి పాతకులకుఁ బొడగట్టును. ఆమె నోటిమాట లేవియుఁ దిమ్మన మనకు వినిపించలేదు. పట్టపుదేవికి సముచితమగు స్తవనీయ గాంభీర్యముతో, ఔదార్యముతో ఆమె మసలినది.

తన పెరటిలో పారిజాతమును నాటించుకొని పుణ్యకవ్రతమును చేయు సత్యభామసదనమునకును ఆమె పోయి తన యౌదార్యమును జూపినది.

అగుఁగాక! ఆమె స్త్రీ. స్త్రీజనస్వభావసిద్ధమగు అసూయ ఆమె కుండుట సహజము. కావుననే ఆమె సత్యభామసదనమునకు 'వదనాంబుజంబునం గృతకవికాస మచ్చుపడ' వచ్చినదని తిమ్మనార్యుఁడు చెప్పుచున్నాఁడు.

ఇట్టి సందర్భోచితపాత్రసంపోషణ మసదృశముగా నొనర్చి ఆంధ్రప్రబంధకవులకు ముక్కు తిమ్మనార్యుఁడు పూజ్యులింగమైనాఁడు.

# మనవిమాటలు

ఆంధ్రసారస్వతము, సారస్వతపట్టభద్రులగు ఆంధ్రకవులు, 'ఆంధ్రకవిప్రణీతకృతిసారకథాసుధారససంపన్మాధురీవిశేషములు'- వీనిని గుఱించి ఈగ్రంథకర్త వ్రాసిన వ్యాసములలో ఇంతకుఁబూర్వము పత్రికలలోఁ బ్రచురితములైన పదివ్యాసములను మాత్రము ఈగ్రంథమున సంధానితములైనవి.

ఈవ్యాసములు ఈగ్రంథకర్త కళాశాలవిద్యార్థిగా నుండఁగా అనఁగా నిప్పటికిఁ బాతికేండ్లకుఁ బూర్వము రచితములైనవి. సమయవిలాసి సన్మానమున అవి నేటికి గ్రంథరూపము నందఁగల్గినవి.

ఈ పదివ్యాసములలో మొదటిది (1923), రెండవది (1927), మూడవది (1924), నాలుగవది (1925) ఆంధ్రపత్రిక సంవత్సరాదిసంచికలలోను; ఐదవది (1941), ఆఱవది (1924) భారతిమాసపత్రిక సంచికలలోను; ఏడవది (1925) సమదర్శిని సంవత్సరాదిసంచికలోను; ఎనిమిదవది (1926) లలిత మాసపత్రికసంచికలోను; తొమ్మిదవది (1926) ఆంధ్రసర్వస్వము మాసపత్రికసంచికలోను; పదియవది (1924] భారతి మాసపత్రిక తొలిసంచికలోను ప్రచురితములైనవి.

ఈ పదివ్యాసములలో మొదటిదగు 'ప్రాచీనాంధ్రవాఙ్మయావలోకనము'ను ఆ యేటి ఉగాదిసంచికలోని చెప్పఁదగిన వ్యాసములలో నొకటిగ సంపాదకులు దేశోద్ధారక శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు

తమ ప్రస్తావనలో ప్రత్యేకముగఁ బేర్కొనినారు. ఆ సంచికను అప్పుడు సారస్వతసంపాదకులుగా నుండిన అధిగత కావ్యతీర్థాది బిరుదులు శ్రీపంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు ఈవ్యాసమును ఎక్కుడగా మెచ్చుకొనుచు ప్రత్యేకము ఒకపెద్ద జాబు వ్రాసియున్నారు. 'తెనుఁగు కైతల క్రొత్తతెన్నులు' కళాశాలలో పోటీవ్యాసములందు ప్రథమబహుమానము నందినది. 'ఆంధ్రవాఙ్మయావలోకనము'నుండి, 'తిక్కనవంశకథ'నుండి కొన్నిపంక్తులు ఎత్తి కవిత్వవేది 1927లో ప్రచురించిన ఆంధ్రవాఙ్మయచరిత్ర సంగ్రహమున ఉదాహరించియున్నాఁడు. 'పారిజాతాపహరణము : పాత్రపోషణము'. ఆంధ్రమాసపత్రికారాజమగు భారతి తొలిసంచికకు కళాప్రపూర్ణ శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారి ప్రత్యేకాహ్వానముపై పంపఁబడి ప్రచురింపఁబడినది. ఈ వ్యాసమును చేకొన్న ఆ సంచిక ప్రతులు కాకినాడ కాంగ్రెస్‌లో కరపత్రములవలె ధారాళముగఁ బంచిపెట్టఁబడి ఈగ్రంథకర్తకు బుధజనులలో, బంధుజనులలో ఒక్కపెట్టున పేరు తెచ్చినవి.

ఈ వ్యాసములపట్ల నడచిన ఈ సంఘటనములు చిన్నవి, సన్ననివి. అగుఁగాక! రచనములు తొలిరచనములగుట, కాలము అవినయనిధానమగు యౌవనమగుట అవి గ్రంథకర్తకు ఆనాఁడు గర్వకారణములై అతఁడు సారస్వత జీవనపథప్రవేశకుఁ డగుటకు ముల్లుచూపినవి.

Golden Press, 2/50 Tana Street, Madras—7.